ఈనాడు
కరీంనగర్ 22-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 162
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈనాడు

కరీంనగర్ 22-1-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 162
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పిల్లలు >>>>
ఒక్కరే ముద్దు



2లో

భారత్‌లో చాలా మంది మహిళలు ఒక్క బిడ్డే చాలని కోరుకుంటున్నారు. రెండో సంతానం కావాలనుకునేవారు కేవలం 24% మందే. పురుషుల్లోనూ దాదాపు ఇదే ధోరణి. ఇందుకు కారణాలు అనేకం.

పచ్చబొట్టు >>>>
భలే స్మార్టు



2లో

గదిలోని స్మార్ట్ బల్బును మీ చేతి మీది పచ్చబొట్టుతో నియంత్రించవచ్చు. చేయిని ఒక్కోకోణంలో కదిపినప్పుడు బల్బు ఒక్కో విధంగా వెలిగేలా చేయొచ్చు. తాము కనుగొన్న 'పచ్చబొట్టు చర్మం'తో ఇదంతా సాధ్యమేనంటున్నారు శాస్త్రవేత్తలు.

మర బుర్రే >>>>
మనకంటే మెరుగు



2లో

ఒప్పందాలను కుదర్చడంలో మనుషుల కంటే కృత్రిమ మేధస్సు యంత్రాలే మెరుగ్గా పనిచేస్తాయట. ఎంఐటీ పరిశోధకులు గుర్తించిన వాస్తవమిది.

అన్ని దారులూ అమ్మల సన్నిధికే



ఆదివారం మేడారంలో సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ

- మేడారానికి పోటెత్తుతున్న భక్తజనం
- ఒక్కరోజే 3 లక్షలకు పైగా రాక
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

-11లో

జనాకర్షకం కాదు

రాబోయే బడ్జెట్‌పై ప్రధాని మోదీ సంకేతాలు

- ప్రజలు ఉచితాలు కోరుకోవడం లేదు
- నిజాయతీతో కూడిన పాలన కావాలనుకుంటున్నారు
- మూడేళ్లలో ఉజ్వల భారత్‌గా తీర్చిదిద్దామని వెల్లడి



దిల్లీ: రాబోయే బడ్జెట్ ప్రజాకర్షకంగా ఉండదని ప్రధాని మోదీ సంకేతాలిచ్చారు. తన ప్రభుత్వం సంస్కరణల అజెండా కొనసాగిస్తుందని తేల్చి చెప్పారు. ఐదు దుర్బల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న దేశం ఈ సంస్కరణలతో ఉజ్వల భారత్‌గా అవతరించిందని చెప్పారు. టైమ్స్ నౌ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రధాని తన ఆర్థిక విధానాలను గట్టిగా (మిగతా 2లో)

చావులోనూ గెలవలేక..

- రైతు ప్రాణానికేదీ 'పరిహారం'
- ఆత్మహత్య చేసుకున్నా.. కుటుంబానికి అందని సాయం
- అకాల వర్షాలు, పంట నష్టాలతో అప్పుల్లో అన్నదాత
- తీర్చే దారి లేక బలవన్మరణాలు
- గుర్తింపుపత్రం జారీలో అధికారుల జాప్యం
- ప్రభుత్వ పరిహారం ఎండమావి
- పంట అమ్మి.. కర్మకాండలు
- కార్యాలయాల చుట్టూ బాధిత కుటుంబాల ప్రదక్షిణ

భర్త ఫొటో చూసి కన్నీరు పెడుతున్న ఈ యువతి పేరు మౌనిక. వయసు 24. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలానికి చెందిన ఈమెకు ఐదేళ్ల కూతురు, ఏడాది వయసున్న కొడుకు ఉన్నారు. భర్త యువరాజు (25) గత నవంబర్‌లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేస్తూ అప్పులపాలై పురుగుమందు తాగినట్లు పోలీసులు నిర్ధారించారు. పంట పెట్టుబడికి భార్య మంగళసూత్రం గొలుసు, చెవిపోగులు, మెట్టెలు కూడా తాకట్టు పెట్టాడు. 'నా భర్త కర్మకాండలకు రూ.70 వేలు ఖర్చయ్యాయి. పత్తి అమ్మి రూ.60 వేలు తెచ్చి ఆ అప్పులు కట్టాను. పాత అప్పులు రూ.8 లక్షలున్నాయి. వీటిని తీర్చాలో, పిల్లలను ఎలా పోషించాలో తెలియడం లేదు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిహారం ఇస్తారో లేదో కూడా చెప్పడం లేదు. పోలీసులు తుది నివేదిక ఇచ్చాకే పరిహారం ఇచ్చేది లేనిదీ చెబుతారట' అని కన్నీటి పర్యంతమైంది. మౌనిక ఒక్కరిదే కాదు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్న వందలాది మంది రైతుల కుటుంబాల్లో కనిపిస్తున్న విషాదమిదీ.

- 'ఈనాడు' ప్రత్యేక కథనం 11లో



కన్నీటి పర్యంతమవుతున్న మౌనిక, పిల్లలు



ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా
ఓంప్రకాశ్ రావత్

- కమిషనర్‌గా అశోక్ లవాసా
- నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు

ఈనాడు, దిల్లీ: తదుపరి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా ఓంప్రకాశ్ రావత్‌ను కేంద్రం నియమించింది. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న ఏకే జ్యోతి సోమవారం పదవీవిరమణ చేయనున్నారు. ఇప్పుడు కమిషనర్‌గా ఉన్న ఓంప్రకాశ్.. మంగళవారం సీఈసీగా బాధ్యతలు చేపడతారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ ఉత్తర్వులను జారీ (మిగతా 2లో)

అఫ్గాన్ హోటల్‌లో తాలిబన్ల దారుణం
43 మంది మృతి

- విదేశీయులే లక్ష్యంగా కాల్పులు
- హెలికాప్టర్‌లో దిగిన సైనికులు
- దాడిచేసిన ఆరుగురు ముష్కరుల హతం
- 17 గంటలపాటు ఉత్కంఠ -12లో

తక్షణ సాయానికి త'రుణోపాయం'

- సమూహాల్లో సూక్ష్మ పరిశ్రమలు నెలకొల్పే వారికి ఆర్థిక దన్ను
- బ్యాంకు రుణం ఇప్పించే ప్రక్రియ
- కొత్త పథకం రూపకల్పనకు ప్రభుత్వం సన్నాహాలు -14లో

5% ఓట్లు దక్కినా ధరావతు సొమ్ము వెనక్కి

- పంచాయతీ ఎన్నికల్లో మారనున్న నిబంధన
- ఎన్నికల్లో పోటీ పెరిగే అవకాశం -2లో

20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి వేటు

- లాభదాయక పదవులపై ఈసీ సిఫార్సుకు ఆమోదం
- ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్న ఆప్
- కేంద్రం అన్ని విధాలుగా వేధిస్తోంది: కేజ్రీవాల్ -2లో

ఇదీ సంగతి!



ఒక్కరు చాలు...

రెండో సంతానం కోరుకుంటున్న భారతీయ మహిళలు 24 శాతమే

దిల్లీ: భారతీయ మహిళల్లో రెండో సంతానం పట్ల ఆసక్తి గణనీయంగా తగ్గిపోతోంది. చాలా మంది ఒక్క బిడ్డతోనే సంతృప్తి చెందుతున్నారు. రెండో బిడ్డ కావాలని దేశ మహిళల్లో 24% మందే కోరుకుంటున్నారు. పదేళ్ల క్రితం వీరి సంఖ్య 68%గా ఉండటం గమనార్హం. ఇటు పురుషుల్లోనూ 27% మందే రెండో సంతానాన్ని పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. దశాబ్దం కిందట వీరి సంఖ్య 49%గా ఉండేది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. పిల్లల పెంపకానికి అధికంగా ఖర్చవుతుండటం, ఉద్యోగ జీవితంపై శ్రద్ధ, గర్భధారణలు కూడా ఆలస్యంగా జరుగుతుండటం వల్ల ప్రజల ఆలోచనల్లో ఈ మార్పు వస్తోందని నిపుణులు చెబుతున్నారు. నగరవాసులు, విద్యావంతుల్లో చాలా జంటలు.. 30 ఏళ్లు దాటిన తర్వాతే తొలి సంతానం కోసం వైద్యులను సంప్రదిస్తున్నారని దిల్లీకి చెందిన వైద్యురాలు అర్చన బజాజ్ చెప్పారు.

స్మార్ట్‌గా పచ్చబొట్టు!

బెర్లిన్: స్మార్ట్ ఉపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను చేతి సైగలతోనే నియంత్రించేందుకు తోడ్పడే అధునాతన 'పచ్చబొట్టు చర్మం'ను శాస్త్రవేత్తలు తయారుచేశారు. అత్యంత పలుచగా (మూడు మైక్రోమీటర్ల మందం) ఉండే దీన్ని ఎలా కావాలంటే అలా మడతపెట్టేయొచ్చు. దీనిలో అయస్కాంత క్షేత్రం ఆధారంగా పనిచేసే సూక్ష్మ సెన్సర్లున్నాయి. ఓ అయస్కాంతం సాయంతో ఈ సెన్సర్లను ఉపయోగించి గదిలోని స్మార్ట్ బల్బును నియంత్రించొచ్చని ఆస్ట్రియాలోని జోహెన్నెస్ కెప్లెర్ వర్సిటీ లింజ్ (జేకేయూ) నిపుణులు నిరూపించారు. దీని కోసం 0 నుంచి 180 డిగ్రీల కోణంలో చేతి కదలికలను డిజిటల్ రూపంలోకి మార్చారు. చేయిని ఒక్కో కోణంలో కదిపినప్పుడు బల్బు ఒక్కో విధంగా వెలిగేలా కోడ్‌చేశారు. చివరగా ఈ పరిజ్ఞానాన్ని అయస్కాంత క్షేత్రానికి అనుసంధానించారు. అనంతరం అధునాతన సెన్సర్లు కలిగిన ఎలక్ట్రానిక్ పచ్చబొట్టును అంటించుకొని స్మార్ట్ బల్బును నియంత్రించగలిగారు. వర్చువల్ రియాలిటీతో సృష్టించే కాల్పనిక ప్రపంచంలోని వస్తువులనూ ఈ పచ్చబొట్టుతో నియంత్రించే వీలుందని వారు పేర్కొన్నారు.

ఒప్పందాల్లో దిట్ట 'కృత్రిమ మేధ'

బోస్టన్: ఒప్పందాలు కుదర్చడంలో మనుషుల్ని మించిపోయే కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. ఇతరులతో సత్సంబంధాలనూ ఇది చక్కగా కొనసాగించడం విశేషం. దీని కోసం ఎస్'యాష్' పేరిట అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బ్రింగ్హమ్ యంగ్ వర్సిటీ (బీవైయూ) నిపుణులు ప్రత్యేక అల్గారిథమ్‌లను రాశారు. వీటిని యంత్రాలకు ప్రోగ్రాంచేసి.. యంత్రాలు-యంత్రాలు, యంత్రాలు-మనుషులు, మనుషులు-మనుషులు మధ్య సంబంధాలను పరీక్షించారు. దీంతో ఇద్దరికీ ఆమోదయోగ్య ఒప్పందాలను కుదర్చడంలో ఎస్‌యాష్ యంత్రాలే మెరుగ్గా పనిచేస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. 'సగం మంది మనుషులు ఏదో సమయంలో అబద్ధాలు చెబుతుంటారు. అబద్ధాలు మాట్లాడకూడదనే అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ ఈ అల్గారిథమ్‌లను రాశాం. నిజాయితీగా ఉండే మనుషులు ఈ యంత్రాలలానే చక్కగా ఆమోదయోగ్య ఒప్పందాలు కుదర్చగలరు'అని పరిశోధనలో పాలుపంచుకున్న జాకబ్ క్రాడెల్ తెలిపారు.

జనాకర్షకం కాదు

(మొదటిపేజీ తరువాయి)

సమర్థించుకున్నారు. పెద్ద నోట్ల రద్దు ఒక పెద్ద విజయగాథ అని చెప్పారు. వస్తు, సేవల పన్ను విధానంలో లోపాలు ఏమైనా ఉంటే మార్పులకు సిద్ధమేనని తెలిపారు.

2019 సాధారణ ఎన్నికలకు ముందు ప్రవేశ పెడుతున్న చివరి బడ్జెట్‌లో మీ ప్రభుత్వం ప్రజాకర్షకంగా మారుతుందా అని ప్రశ్నించగా మోదీ స్పందిస్తూ "సామాన్యులు ఉచిత పథకాలు, ఉచిత వరాలు కోరుకోరు. వారు వాటిని ఆశిస్తారన్నది ఒట్టి మాటే. నన్ను గుజరాత్ ముఖ్యమంత్రిగా చూసిన వారికి, ప్రధానమంత్రిగా చూసిన వారికి ఈ విషయం తెలుస్తుంది. సామాన్యులు నిజాయతీతో కూడిన పాలనను కోరుకుంటారు" అని స్పష్టం చేశారు.

పాక్‌ను ఏకాకిని చేయడం మా పని కాదు

పాకిస్థాన్‌ను ఏకాకి చేయడానికి భారత్ తీవ్రంగా కృషి చేస్తోందన్న వాదనను మోదీ కొట్టివేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచాన్ని ఏకం చేయడమే తన లక్ష్యమని చెప్పారు. 'పాక్‌ను ఒంటరి చేయడానికి ప్రపంచమంతా తిరిగి ప్రయత్నిస్తున్నామన్నది తప్పు. ఇది మా పని కాదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రపంచమంతా ఏకమవుతోంద'ని అన్నారు. భారత్ విదేశాంగ విధానం పాకిస్థాన్‌పై ఆధారపడి లేదని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దృఢచిత్తంతో మాట్లాడుతున్నారని అన్నారు. 'ఆయన మాటలను స్వాగతిస్తున్నా. ఆయనను గౌరవిస్తున్నా. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎవరు చర్యలు తీసుకున్నా వారిని ప్రశంసిస్తా. ఎందుకంటే నా దేశం గత నలభై ఏళ్లుగా ఉగ్రవాదంతో బాధపడుతోంది. ప్రపంచంలో ఉగ్రవాదానికి ముగింపు పలకాల్సి ఉంద'ని చెప్పారు.

బలమైన భారత్-అభివృద్ధి కావాలా లేదా రాజకీయ సంస్కృతి-కాంగ్రెస్ సంస్కృతిని అనుసరించాలా అన్నది నిర్ణయించుకోవాలన్నారు.

ఉద్యోగాలు లేని వృద్ధిని సాధిస్తున్నారన్న విమర్శలను ప్రధాని తోసిపుచ్చారు. ఉద్యోగ, ఉపాధి కల్పన గురించి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే గత మూడేళ్లలో రహదారి నిర్మాణం రెండింతలయ్యేదా అని ప్రశ్నించారు. రైల్వే ట్రాక్ నిర్మాణం సాధ్యమయ్యేదా అని అడిగారు. ఉద్యోగ కల్పన లేకుండా విద్యుద్దీకరణ, ఓడరేవుల నిర్మాణం జరిగేదే కాదని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంలో సమస్యలున్నాయన్న సంగతిని అంగీకరించారు. రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని చెప్పారు. సౌర విద్యుత్తుతో నడిచే పంపులను అందుబాటులోకి తీసుకురావడం, వ్యవసాయోత్పత్తుల ప్రాసెసింగ్‌ను పెంచడం, గ్రామీణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి ఆలోచనలు తనకు ఉన్నాయన్నారు.

చివరి ఏడాదిన్నర కాలంలో తన ముందున్న లక్ష్యంపై స్పందిస్తూ ఇంకా విద్యుత్తు సౌకర్యం లేని నాలుగు కోట్ల కుటుంబాలకు ఆ లోటు తీర్చడం, సామాన్యుల లబ్ధికి ప్రారంభించిన కార్యక్రమాలు, పథకాలను పూర్తి చేయడం తన ప్రాధాన్యాంశమన్నారు.

ఆర్థికంగా తన ప్రభుత్వ విజయాలపై స్పందిస్తూ "ఐదు దుర్బల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న పరిస్థితి నుంచి మూడేళ్ల కాలంలో దేశం బయటపడింది. అంతే కాదు.. ఇప్పుడు ఉజ్వల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను చూస్తున్నారు." అని ప్రధాని చెప్పారు. ఆర్థికాంశాలకు సంబంధించి అన్ని పరామితుల్లోనూ భారత్ పురోగతి సాధించిందన్నారు.

దావోస్ సదస్సులో ప్రారంభోపన్యాసం చేస్తున్న తొలి భారత ప్రధాని తాను కావడంపై స్పందిస్తూ భారత్ అభివృద్ధి చెందింది కాబట్టే ఇది సాధ్యమయిందన్నారు.

కాంగ్రెస్ విముక్త భారత్ అన్న తన నినాదంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ఆ పార్టీని నిర్మూలించడం ఆ నినాదం అర్థం కాదని, కాంగ్రెస్ సంస్కృతిని నిర్మూలించడం అని అన్నారు. కులతత్వం, వారసత్వం, అవినీతి, అధికారంపై పూర్తి నియంత్రణ ఇలా ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటే విజయం సాధించొచ్చన్న సంస్కృతి దేశంలోని అన్ని పార్టీలకూ పాకిందని, దానికి మూలస్తంభం కాంగ్రెస్సేనని చెప్పారు. ఈ సంస్కృతి నుంచి రాబోయే తరాలను రక్షించాలన్నారు.

ముమ్మారు తలాక్ బిల్లుకు రాజ్యసభలో ఆ పార్టీ అభ్యంతరం తెలపడాన్ని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అయినా మరో పార్టీ అయినా ఓటు బ్యాంకు రాజకీయాలను వదిలి మహిళా సాధికారికత, మహిళల గౌరవం కోణంలో ఆలోచించాలని హితవు పలికారు.

పాక్ ప్రజలతో నేరుగా మాట్లాడుతా

సమస్యలపై భారత్, పాక్‌లు కలిసి పోరాటాలు చేయాల్సి ఉందని ప్రధాని మోదీ అన్నారు. 'పాక్ ప్రజలతో నేను నేరుగా మాట్లాడుతా. వారిని సూటిగా అడుగుతా... మనం పేదరికానికి వ్యతిరేకంగా పోరాడవద్దా? నిరక్షరాస్యతకు వ్యతిరేకంగా పోరాటం చేయొద్దా? వ్యాధుల నివారణకు పోరు సలపవద్దా? వీటిపై కలిసి యుద్ధం చేద్దాం. త్వరగా విజయాలు పొందుదాం' అని అభిప్రాయపడ్డారు.



ప్రతివారికీ ప్రధానితో మాట్లాడే హక్కు

కశ్మీర్ సమస్యపై చర్చలకు ప్రత్యేక ప్రతినిధిని నియమించడంపై సమాధానం ఇస్తూ ప్రతి భారత పౌరునితో ఇలాంటి సంభాషణలు ఉంటాయి, ఇవి కొనసాగుతాయని అన్నారు. 'ఇదేమీ కొత్త కాదు. ఎప్పటి నుంచో జరుగుతున్నవే. 'మోదీ గారూ, దయచేసి నిలబడి మాతో మాట్లాడండి' అని అడిగే హక్కు ప్రతి పౌరునికీ ఉంది. రాజ్యాంగాన్ని నమ్మేవారు, దేశం కోసం బతుకుతూ ప్రాణాలు ఇచ్చేవారి కోసమే మేమున్నాం" అని అన్నారు. మరి వేర్పాటువాదులు రాజ్యాంగాన్ని నమ్మరు కదా అని ప్రశ్నించినప్పుడు 'అలాంటప్పుడు వారితో మేమెందుకు చర్చలు జరపాల'ని ప్రశ్నించారు.

న్యాయ సంక్షోభం నుంచి పార్టీలు దూరంగా ఉండాలి

ప్రస్తుతం న్యాయవ్యవస్థలో తలెత్తిన సంక్షోభం నుంచి పార్టీలు దూరంగా ఉండాలని ప్రధాని సూచించారు. 'మన న్యాయవ్యవస్థకు ఘనమైన చరిత్ర ఉంది. వారు చాలా సమర్థులు. వారు కలిసి కూర్చొని సమస్యకు పరిష్కారం కనుక్కోగలరు. న్యాయవ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. దీనిపై జరిగే చర్చ నుంచి నేను దూరంగా ఉంటాను. ప్రభుత్వం కూడా తప్పకుండా దూరంగా ఉండాలి. రాజకీయ పార్టీలు కూడా దీన్నే పాటించాల'ని అన్నారు. భాజపా అగ్రనాయకులను ఈ వివాదంలోకి లాగేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న యత్నాలపై సమాధానం చెబుతూ తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్ననాటి నుంచి తనను రాజకీయంగా అంతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతునే ఉన్నాయని అన్నారు.

20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై రాష్ట్రపతి వేటు

దిల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీకి శరాఘాతం... లాభదాయక పదవులను నిర్వహించినందుకు ఆ పార్టీకి చెందిన ఒక మంత్రి సహా 20 మంది శాసనసభ్యులపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అనర్హత వేటు వేశారు. ఎన్నికల సంఘం ఈ మేరకు చేసిన సిఫార్సుపై శనివారం ఆయన సంతకం చేసినట్లు ఆదివారం న్యాయ మంత్రిత్వశాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమనీ, ప్రజాస్వామ్యానికి హానికరమనీ ఆప్ సీనియర్ నేత అశుతోష్ పేర్కొన్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మల్లా వ్యవహరిస్తున్నారని పార్టీ ఆక్షేపించింది. అన్నివిధాలా తనను వేధించడానికే కేంద్రం ప్రయత్నిస్తోందని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.

ఈసీ సిఫార్సుపై నేడు దిల్లీ హైకోర్టులో విచారణ: 13.3.2015 నుంచి 8.9.2016 వరకు పార్లమెంటరీ కార్యదర్శులుగా లాభదాయక పదవుల్ని నిర్వహించిన వారందరిపై అనర్హత వేటు వేయడమే సబబని ఈసీ అభిప్రాయపడిన విషయం తెలిసిందే. ఇలాంటి 21 మందిలో ఒకరు ఇప్పటికే రాజీనామా చేశారు. మిగిలిన 20 మంది ఈ హోదాల్లో ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తీసుకోలేదని దిల్లీ ప్రభుత్వం చెప్పినా ఈసీ విభేదించింది. వారు లబ్ధి పొందారా, ప్రభుత్వ విధుల్లో పాల్గొన్నారా అనేది ప్రాముఖ్యం కాదనీ, నిర్వహించిన పదవి- లాభదాయక నిర్వచనం కిందికి వస్తే అనర్హత అనివార్యమనేది జయాబచ్చన్ కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసిందనీ ఎన్నికల సంఘం పేర్కొంది. ఈసీ సిఫార్సుపై దిల్లీ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. తమ ఆశలన్నీ న్యాయ వ్యవస్థపైనే ఉన్నాయనీ, కొంత ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నామనీ మదన్‌లాల్ అనే శాసనసభ్యుడు చెప్పారు. న్యాయస్థానంలో ఊరట లభించకపోతే దిల్లీ శాసనసభలో 20 స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యం కానున్నాయి. 20 ఖాళీలు ఏర్పడినట్లు దిల్లీ శాసనసభాపతి అధికారికంగా ఈసీకి తెలియపరచడం సాంకేతికంగా అవసరం. అప్పుడు 70 మంది శాసనసభ్యులున్న సభలో ఆప్ ఎమ్మెల్యేల సంఖ్య 66 నుంచి (ఒకరు ఇప్పటికే రాజీనామా చేశారు) 46కి పడిపోతుంది.

కేంద్రంపై విరుచుకుపడ్డ సీఎం

దిల్లీలోని నజాఫ్‌గఢ్‌లో జరిగిన ఒక సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ దైవం తమ పక్షాన ఉండడం వల్లనే గతంలో 67 స్థానాలను గెలుచుకున్నామని చెప్పారు. 'కేంద్రం అన్ని విధాలా మనల్ని వేధించాలని చూస్తోంది. అందుకే నా కార్యాలయంపై సీబీఐ దాడి జరిపించారు. 24 గంటలపాటు వెతికితే నాలుగు మఫ్లర్లు మాత్రం వారికి దొరికాయి. 400 దస్త్రాలను లెఫ్టినెంట్ గవర్నర్ పరిశీలిస్తే ఏ ఒక్క తప్పూ దొరకలేదు. మాకు వ్యతిరేకంగా ఏమీ లేకపోవడంతో ఈరోజు 20 మంది ఎమ్మెల్యేలపై వేటు వేశారు' అని విమర్శించారు. నిజాయతీగా వెళ్లేవారికి చాలా సమస్యలు ఎదురవుతుంటాయని చెప్పారు. చివరకు నిజమే నెగ్గుతుందన్నారు. ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలేగానీ తమను నియమించినవారికి తొత్తులుగా ఉండకూడదని పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. శాసనసభ్యుల వాదనలు ఆలకించాకే నిర్ణయం తీసుకుంటామని నసీంజైదీ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు చెబితే ఆయన మారిన వెంటనే నిర్ణయం ఎలా మారిందని ప్రశ్నించారు. ఈ ఏకపక్ష పోకడను న్యాయస్థానంలో సవాల్ చేస్తామేగానీ భయపడేది లేదన్నారు.

దేనికైనా సిద్ధంగా ఉండండి

–శాసనసభ్యులకు ఆప్ సూచన

అనర్హత వేటును ఎదుర్కొనే విషయంలో న్యాయ పోరాటం చేయడంతో పాటు ఉప ఎన్నికలను ఎదుర్కొనేందుకైనా సిద్ధంగా ఉండాలని 20 మంది శాసనసభ్యులకూ ఆప్ సూచించింది. అవసరమైతే సుప్రీంకోర్టుకూ వెళ్దామనీ, అనుకూలంగా తీర్పు రాకపోతే ప్రజాకోర్టుకు వెళ్లేందుకూ వెనకాడవద్దని వారితో నిర్వహించిన సమావేశం సందర్భంగా పేర్కొంది.

పారదర్శకంగా కేసుల కేటాయింపు

- **ఇకపై వెబ్‌సైట్ ద్వారా వివరాలు వెల్లడి**
- **సూచనలను పరిశీలించిన సీజేఐ**

దిల్లీ: సున్నితమైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను వివిధ ధర్మాసనాలకు కేటాయించడంలో పారదర్శకత పాటించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ఈ విషయంపై ఇటీవల నలుగురు సీనియర్ న్యాయమూర్తులు వ్యక్తం చేసిన అభ్యంతరాల నేపథ్యంలో వివిధ వర్గాల నుంచి అందిన సూచనల్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్‌మిశ్ర పరిశీలించారు. కొంతమంది సహచర న్యాయమూర్తులతోనూ ఆయన చర్చించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ చేసిన సిఫార్సులనూ పరిగణనలో తీసుకున్నారు. ప్రతిపాదిస్తున్న కొత్త వ్యవస్థ ప్రకారం కేసుల కేటాయింపును సుప్రీంకోర్టు వెబ్‌సైట్లోనే పొందుపరచనున్నారని సీజేఐ సన్నిహిత వర్గాలు ఆదివారం వెల్లడించాయి. కేసుల కేటాయింపు ప్రక్రియకు ఒక రోస్టర్ పద్ధతిని అనుసరించనున్నారని తెలిపాయి. సీజేఐ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తమ వెబ్‌సైట్ ద్వారా అధికారికంగా తెలియజేయనుంది. ఏయే తరహా కేసుల్ని ఎవరు విచారిస్తారో తెలిపే వ్యవస్థను బహిర్గతం చేయనుంది.

రోస్టర్ విధానం అవసరం... వికాస్ సింగ్: దిల్లీ, బాంబే హైకోర్టుల్లో ఉన్న మాదిరి రోస్టర్ విధానాన్ని సుప్రీంకోర్టులోనూ ప్రవేశపెట్టాలని తాము కూడా డిమాండ్ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ తెలిపారు. సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తును డిమాండ్ చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లను సీజేఐ జస్టిస్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించనున్న విషయం తెలిసిందే. భవిష్యత్తులో సీజేఐలుగా పదోన్నతి పొందడానికి అవకాశం ఉన్న నలుగురు న్యాయమూర్తులు ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించడానికి సీజేఐతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సీజేఐపై అసంతృప్తి వ్యక్తం చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులకు, సీజేఐకి మధ్య ఈ నెల 18 తర్వాత ఎలాంటి భేటీ జరగలేదు. సోమవారం న్యాయస్థానం కార్యకలాపాలు ప్రారంభం కావడానికంటే ముందు వీరి మధ్య భేటీ జరిగే అవకాశం ఉంది.

5% ఓట్లు దక్కినా ధరావతు వెనక్కి

- **పంచాయతీ ఎన్నికల్లో మారనున్న నిబంధన**
- **ఎన్నికల్లో పోటీ పెరిగే అవకాశం**

ఈనాడు – హైదరాబాద్

పంచాయతీ సర్పంచిగా విజయం సాధించి ప్రజలకు సేవచేయాలనేది యాదగిరి చిరకాల వాంఛ. ఎన్నికల్లో ఓట్లు తక్కువగా వస్తే 'డిపాజిట్ కోల్పోయిన యాదగిరి' అంటూ అంతా గేలి చేస్తారేమోనని అతని భయం. ఇప్పుడు ఇలాంటి సంశయాలకు తావు లేకుండా కొత్త విధానం రూపొందింది. పోలైన ఓట్లలో అభ్యర్థికి కేవలం 5% ఓట్లు వచ్చినా.. ధరావతు సొమ్ము వెనక్కి వచ్చేసినట్లే. దీంతో యాదగిరి వంటి వారెంతోమంది రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడే అవకాశం పెరిగింది.

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయదలచిన నామినేషన్ పత్రాలను అందజేసే రోజున ఎన్నికల సంఘానికి ధరావతు (డిపాజిట్)ను చెల్లించాలి. ఇది సర్పంచి అభ్యర్థికి రూ.2,000, వార్డు సభ్యుడికి రూ.500 చొప్పున ఉంది. ఇవే పదవులకు తలపడే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులైతే వరుసగా.. రూ.1,000, రూ.250 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. అభ్యర్థుల ఖర్చుతో పోల్చినప్పుడు ధరవాతు సొమ్ము తక్కువగానే ఉన్నా.. వారు ఓడిపోయినప్పుడు మాత్రం ఈ ధరావతు కీలక పాత్ర పోషిస్తుంది. తగిన ఓట్లు లభించనప్పుడు ఆ సొమ్ము ప్రభుత్వపరం అవుతుంది. ఇలా తక్కువ ఓట్లు లభించిన వారిని 'డిపాజిట్ కోల్పోయారు' అంటూ గేలిచేయటం పరిపాటి. 'డిపాజిట్ సొమ్మును ప్రభుత్వపరం చేయడమయింది' అంటూ రిటర్నింగ్ అధికారి ఆయా అభ్యర్థులకు లేఖలనూ పంపుతుంటారు. ఇది ఆ అభ్యర్థులకు పుండుమీద కారం చల్లినట్లుగా ఉంటోంది. ఈ భయంతోనే ఎంతోమంది ఎన్నికల్లో పోటీకి వెనుకడుగు వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి వచ్చింది. దీనిపై వివిధ రాజకీయ పార్టీలతో చర్చించగా.. ధరావతు సొమ్మును వెనక్కి ఇచ్చేందుకు ప్రస్తుతం అవలంబిస్తున్న విధానంలో మార్పులు అవసరమని అవి సూచించాయి. 2016 నాటి జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీచేసిన 1,333 అభ్యర్థుల్లో కేవలం 319 మంది మాత్రమే ధరావతును వెనక్కి పొందేందుకు అర్హత సాధించారు. మిగతా 1,014 మంది వాటిని కోల్పోయారని తెలుసుకున్న ఎన్నికలసంఘం అధికారులు తక్కువ ఓట్లు లభించినా సొమ్ము వెనక్కి వచ్చేలా నిబంధనను సవరించనున్నారు.

రానున్న ఎన్నికల్లో ఇలా..

రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థులు ఇక ఆయా పంచాయతీల్లో పోలైన చెల్లిన ఓట్లల్లో నూటికి అయిదు ఓట్లను (5 శాతం) పొందితే సరిపోతుంది. వీరికి ఫలితాలు వెలువడిన 30 రోజుల్లోగా ధరావతు సొమ్ము వెనక్కి వచ్చేస్తుంది. ప్రస్తుతం నూటికి 13 ఓట్లను పొందాలనే నిబంధన ఉంది. ప్రభుత్వం ఇప్పుడు 500 జనాభా ఉన్న గ్రామాలనూ పంచాయతీలుగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తోంది. అంటే అక్కడి ఓటర్లు 250 మంది ఉండి.. వారిలో 200 ఓట్లు పోలైతే అందులో యాదగిరి వంటివారికి 10 ఓట్లు లభిస్తే ధరావతు వెనక్కి వస్తుంది. పాత విధానంలోనైతే వారికి 26 ఓట్లు లభించాల్సి వచ్చేది. రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా నాలుగు వేలకు పైగా చిన్న పంచాయతీలు ఏర్పాటు కాబోతున్నాయి. చిన్న పంచాయతీల్లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఓట్లను పొందినా డిపాజిట్‌ను దక్కించుకోవచ్చు. దీనివల్ల ఓటమి చెందినా అవహేళనకు గురయ్యే అవకాశం ఉండదని భావిస్తున్నారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఓంప్రకాశ్ రావత్

(మొదటి పేజీ తరువాయి)



చేసింది. మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఓంప్రకాశ్ గతంలో భారీ పరిశ్రమలశాఖలోని ప్రభుత్వసంస్థల విభాగం కార్యదర్శిగా పనిచేశారు. అంతకు ముందు రక్షణశాఖలోనూ డైరెక్టర్‌గా సేవలందించారు. జ్యోతి పదవీ విరమణతో ముగ్గురు సభ్యులుండాల్సిన ఎన్నికలసంఘంలో ఓ స్థానం ఖాళీ అవుతోంది. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు.. ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి అశోక్ లవాసాను ఎన్నికల కమిషనర్‌గా కేంద్రం నియమించింది. రాజస్థాన్‌కు చెందిన అశోక్ 1980వ బ్యాచ్ హరియాణా క్యాడర్ ఐఏఎస్ అధికారి. గత ఏడాది అక్టోబర్ 31న ఆర్థికశాఖ కార్యదర్శిగా ఆయన పదవీ విరమణ చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సీఈసీగా ఓంప్రకాశ్ పదవీకాలం ముగుస్తుంది. తదనంతరం ఎన్నికల సంఘంలోని మరో సభ్యుడు సునీల్ అరోరా. . ఈ బాధ్యతలను తీసుకునే అవకాశముంది.

గ్రహం అనుగ్రహం

22–1–2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
పంచమి: మ. 12-56 తదుపరి షష్ఠి
ఉత్తరాభాద్ర నక్షత్రం: తె. 4-53 తదుపరి రేవతి
అమృత ఘడియలు: రా. 11-59 నుంచి 1-37 వరకు
వర్జ్యం: మ. 2-12 నుంచి 3-50 వరకు
దుర్ముహూర్తం: మ. 12-33 నుంచి 1-17 వరకు
తిరిగి మ. 2-47 నుంచి 3-31 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-45
శ్రీపంచమి

రసాయన కర్మాగారంలో పేలుడుకు నలుగురి బలి

వడోదర: గుజరాత్‌లోని వడోదర నగర శివార్లలోని ఓ రసాయన కర్మాగారంలో ఆదివారం తెల్లవారుజామున పేలుడు సంభవించింది. దీంతో నలుగురు కార్మికులు మృత్యువాతపడ్డారు. మరో తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కర్మాగారం జీఎస్‌పీ కార్పొరేషన్ సైన్స్ ప్రైవేటెడ్ లిమిటెడ్ సంస్థకు చెందినదని వడోదర జిల్లా కలెక్టర్ పీ భారతి తెలిపారు. మంటలను అదుపుచేసేందుకు అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలకుపైగా కృషిచేశారని ఆమె పేర్కొన్నారు.

ఉన్న మాటంటే ఉలుకెందుకు?

- **గవర్నర్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై హరీశ్ మండిపాటు**
- **బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్**

మంథని – న్యూస్‌టుడే

కాళేశ్వరం ప్రాజెక్టుపై గవర్నర్ నరసింహన్ ఉన్న మాట అంటే కాంగ్రెస్ నేతలకు ఉలుకెందుకని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి వందేళ్ల అనుభవం ఉందే తప్ప సంస్కారం లేదన్నారు. గవర్నర్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా మంథనిలో విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. తెరాస ప్రభుత్వం మంచి పనులను అంతా మెచ్చుకుంటుంటే తమబతుకు ఆగమైపోతుందనే ఆందోళన కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తోందన్నారు. గవర్నర్ 'కాళేశ్వరం' గురించి గొప్ప పని అన్నందుకు కాంగ్రెస్ నేతలు సంస్కారహీనంగా మాట్లాడారన్నారు. తెరాస ప్రభుత్వ పనులను ఇతర రాష్ట్రాల మంత్రులు, కేంద్ర మంత్రులూ మెచ్చుకున్నారని.. వారంతా తెరాస ఏజెంట్లేనా అని ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నపుడు వైఎస్ హయాంలో 108 వాహనాలను తీసుకొస్తే స్వాగతించామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని, 8 ఏళ్ల క్రితం చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి(పాతది) అటవీ అనుమతులు కూడా తేలేదన్నారు. నీరులేని తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు చేపట్టి ఎందుకు పూర్తి చేయలేదన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని కేంద్ర జలసంఘం చెప్పిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో, మహారాష్ట్రలో అప్పుడు మీరే అధికారంలో ఉండీ కూడా ఏమీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. మీరు నీళ్లలేని చోట ప్రాజెక్టులు మొదలెడితే మేం ఏడాదంతా నీరుండేచోట కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టామన్నారు. కాళేశ్వరం పనులు అడ్డుకునే ఉద్దేశంతో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు తన అనుచరులతో ప్రజాభిప్రాయ సేకరణలో గొడవ సృష్టించారని హరీశ్ పేర్కొన్నారు. మీరు చేసిందల్లా తెలంగాణను ముంచి పోతిరెడ్డిపాడు, పులిచింతలను పూర్తి చేశారని ధ్వజమెత్తారు. మీ హయంలో కృష్ణా నీళ్లు తెలంగాణకు రాకుండా పోయాయని, నల్లగొండ జిల్లాను ముంచి ఆంధ్రాకు మూడో పంటకు నీరిచ్చారని విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదన్నారు. కర్ణాటక మంత్రి రేవన్న గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని మెచ్చుకుంటే తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆయనపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారన్నారు. హైదరాబాద్‌లో రూ.ఐదుకు భోజనం పథకం బాగుందన్నందుకు జానారెడ్డిని మాకు ఏజెంటు అన్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు తెలంగాణ పంట పొలాల్లో పారించి దీటుగా సమాధానం చెబుతామన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే మధుకర్, గ్రంథాలయసంస్థ ఛైర్మన్ రఘువీర్‌సింగ్, మార్కెట్ ఛైర్మన్ ఆకుల కిరణ్ తదితరులున్నారు.



గోలివాడ పంపుహౌజ్ వద్ద మంత్రి హరీశ్‌రావు

మంత్రి హరీశ్‌రావు మంథని మండలంలో సుందిళ్ల ప్రాజెక్టును, మహదేవపూర్ మండలంలోని అన్నారం-కన్నెపల్లి కాలువ పనులను పరిశీలించారు. సుందిళ్ల బ్యారేజి పనుల మందగమనంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కూలీల సంఖ్యను పెంచి పనులు వేగవంతం చేయాలన్నారు. జూన్ నాటికి పనులు పూర్తి కావాలన్న తలంపుతో ప్రభుత్వం ఉందని ఆ దిశగా పనులు జరగాలని అధికారులకు ఆదేశించారు. గోలివాడ పంపుహౌస్ పనులను పరిశీలించారు.

హరీశ్ వేలుకు స్వల్ప గాయం

మంత్రి హరీశ్‌రావు చేయికి స్వల్ప గాయమైంది. ఆదివారం రాత్రి మంథని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో విలేకరుల సమావేశానికి వచ్చారు. అప్పుడు కొందరు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలను ఇచ్చారు. ఆ సమయంలో గుచ్ఛానికున్న ఇనుప తీగె మంత్రి వేలుకు గుచ్చుకుంది. వెంటనే రక్తం రావడంతో కొద్దిసేపు మంత్రి వేలును పట్టుకుని ఉండిపోయారు. ఎమ్మెల్యే మధు రక్తంతుడవడానికి వస్త్రం అందించారు.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	6.4	30.0
మెదక్	8.9	34.6
రామగుండం	10.9	30.8
హైదరాబాద్	12.7	31.0
హన్మకొండ	13.0	31.5
నిజామాబాద్	14.0	32.0
తిరుపతి	15.4	30.0
కరీంనగర్	16.0	30.2
మహబూబ్‌నగర్	16.2	32.5
ఖమ్మం	19.0	30.0
సూర్యాపేట	19.0	34.0



రామదాసు విగ్రహానికి అభిషేకం చేస్తున్న పూజారులు

వైభవంగా భక్త రామదాసు జయంతి ఉత్సవాలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో భక్త రామదాసు 385వ జయంతి ఉత్సవాలను వాగ్గేయకారోత్సవాల పేరిట ఆదివారం వైభవంగా ప్రారంభించారు. నగర సంకీర్తన చేసి రామదాసు విగ్రహానికి అభిషేకం జరిపి నవరత్న కీర్తనలతో గోష్ఠి నిర్వహించారు. గోదావరి మాతకు పూజలు జరిపారు. దేశంలోని ప్రఖ్యాత కళాకారులు నిర్వహించిన సంగీత కచేరీతో అంతా రామమయమై సాక్షాత్కరించింది. ఈ సందర్భంగా సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు తెలిపారు. భగవంతుడ్ని చేరడానికి భక్తి అత్యంత సులభమైన మార్గమని నమ్మిన మహాభక్తుడు రామదాసు అని ఆలయ ఈవో ప్రభాకర శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే, ట్రైకార్ ఛైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, ఐఏఎస్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అసాధ్యాన్ని.. సు'సేద్యం' చేసేదెలా!

- వ్యవసాయ ప్రగతికి 12 అంశాలపై ఆలోచనలతో దరఖాస్తునకు అవకాశం
- ఫిబ్రవరి 15 వరకు గడువు
- వ్యవసాయ అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహమే లక్ష్యం
- కేంద్ర వ్యవసాయశాఖ, జయశంకర్ వర్సిటీ కొత్త ప్రయోగం

ఈనాడు, హైదరాబాద్: 'పంటల నూర్పిళ్ల అనంతరం మిగిలిపోయిన వ్యర్థాలను సులభంగా తొలగించడం ఎలా? పోనీ వాటిని వినియోగించడం ద్వారా అదనంగా ఆర్జించడమెలాగన్న ఆలోచన మీ దగ్గర ఉందా? అయితే మీకు ఆర్థికసాయం చేసి సదరు ఆలోచనకు సాంకేతికత జోడించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేంద్ర వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇస్తున్న పూచీకత్తు ఇది.

వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత ప్రోత్సహించేందుకు వర్సిటీ శ్రీకారం చుట్టింది. 'వ్యవసాయ అంకుర పరిశ్రమలు(అగ్రి స్టార్టప్)'లను ప్రోత్సహించడం ద్వారా డిగ్రీలు, పీహెచ్‌డీలు పూర్తిచేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నిరుద్యోగుల ఆలోచనలను రైతులకు, వ్యవసాయ రంగానికి ఉపయోగపడేలా చేయడం, వారిని వ్యాపారవేత్తలుగా మార్చడం దీని ప్రధాన ఉద్దేశం. ఇందుకు నిధులు కూడా కేటాయించిన కేంద్ర వ్యవసాయ శాఖ ..ఆయా ఆలోచనలను దరఖాస్తు రూపంలో పంపేందుకు ఫిబ్రవరి 15 వరకూ గడువు ఇచ్చింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అదే నెల 25న విజేతలను ఎంపిక చేస్తుంది. వారి ఆలోచనలను మార్కెట్లకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలనూ కేటాయిస్తుంది.

12 విభాగాల్లో ఆలోచనలు పంపవచ్చు

మొత్తం 12 విభాగాల్లో కొత్త ఆలోచనల ఆధారంగా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తారు. పంట వ్యర్థాల సులభ వినియోగం, తక్కువ ఖర్చుతో భూసార పరీక్షలు చేయడం ఎలా, విత్తనాలు వేసే సమయంలోనే ఆయా పంట ఉత్పత్తులకు ముున్ముందు దక్కబోయే ధరలను అంచనా వేయడం, ఆహారోత్పత్తుల్లో కల్తీని గుర్తించడం, వ్యవసాయ యంత్రాలతో గ్రామాల్లో సేవా కేంద్రాల ఏర్పాటు, పంటల దిగుబడుల అంచనాలు, కుగ్రామాల రైతులకు సైతం సులభంగా సమాచార పంపిణీ, పంటల ఉత్పాదకత పెంపు, పంట కోతకు ముందు, తరవాత నష్టాల తగ్గింపు, ఎలక్ట్రానిక్ మార్కెట్ల ఏర్పాటు, పంట కోసిన తర్వాత సులభంగా గ్రేడింగ్ చేయడం ఎలా? అనే 12 అంశాలు ఇందులో ఉన్నాయి. వీటిలోని ఏదేని అంశంలో ఇప్పుడు రైతులు చేస్తున్న పనులను మరింత సులభతరం చేసేలా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడానికి ఏం చేయాలనే కోణంలోని ఆలోచనలతో ఎవరైనా దరఖాస్తు చేయవచ్చు.

ఏప్రిల్‌లోనే ఇక్కడ ప్రారంభం

దేశంలోనే తొలిసారి జయశంకర్ వర్సిటీలో కొత్త ప్రయోగం వచ్చే ఏప్రిల్ నుంచి మొదలుకాబోతోంది. ఇందులో భాగంగా విద్యార్థులతో సదస్సు ఏర్పాటుచేసి స్టార్టప్‌ల ప్రారంభంపై అవగాహన కల్పిస్తారు. అందులో వినూత్నమైన వాటికి 'వెంచర్ క్యాపిటల్' కంపెనీల భాగస్వామ్యంతో ఆర్థిక సదుపాయాన్ని వర్సిటీ ఏర్పాటు చేయిస్తుంది. ఇన్‌స్టాగ్రాం కంపెనీతో ఇప్పటికే చర్చించింది కూడా.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలు కావాలి

వ్యవసాయ విద్యార్థులు విజయవంతంగా అభివృద్ధి చేసిన స్టార్టప్‌ను వ్యాపార సంస్థగా మార్చేలా వర్సిటీలో ప్రత్యేక హబ్ ఏర్పాటుచేస్తాం. డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం కోసం వెదుక్కునే అవసరం లేకుండా..అదే విద్యార్థి స్టార్టప్‌ల ద్వారా పారిశ్రామికవేత్తలుగా మరికొందరికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగేలా చేయాలన్నది మా లక్ష్యం. తద్వారా తెలంగాణ విద్యార్థులను దేశానికి ఆదర్శంగా నిలుపుతాం.

- ప్రవీణ్‌రావు, ఉప కులపతి, జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం



అలిపిరి తరహా భద్రత

- యాదాద్రి చుట్టూ సీసీ కెమెరాల నిఘా
- రూ.5 కోట్ల ప్రణాళిక సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని తెలంగాణ తిరుమలగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో భద్రతపై రాచకొండ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాక యాత్రికుల రద్దీ భారీగా పెరగనున్న దృష్ట్యా భద్రతను పటిష్ఠం చేసే అంశంపై కమిషనర్ మహేశ్ భగవత్ ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. తిరుమల కొండ భద్రత కోసం అలిపిరిలో చర్యల తరహాలోనే ఇక్కడా అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా యాదాద్రి చుట్టూ సీసీ కెమెరాల నిఘాను విస్తృతం చేయనున్నారు. ఈ ప్రణాళిక అమలు చేసేందుకు రూ.5 కోట్ల నిధులు అవసరమవుతాయని భావిస్తున్నారు. ఈ నిధుల మంజూరీ కోసం దేవాదాయ శాఖకు ఇది వరకే లేఖ రాశారు. అయితే అన్ని నిధులు మంజూరు చేసేందుకు ఆ శాఖ నిరాసక్తత వ్యక్తం చేయడంతో యాదాద్రి ఆలయ అభివృద్ధి సంస్థ(వైటీడీఏ) నుంచి వాటిని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

వాహనాలపై స్కానర్ల నిఘా: తిరుమల ఆలయానికి అలిపిరి వద్ద పటిష్ఠ భద్రత అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. తిరుమల కొండపైకి వెళ్లే ప్రతీ వ్యక్తితోపాటు వాహనాలపై స్కానర్ల నిఘా ఉంటుంది. యాత్రికులు తమ వెంట తీసుకెళ్లే సామగ్రిని లగేజ్ స్కానర్ల ద్వారా పరిశీలిస్తారు. అలాగే వాహనాలు కొండపైకి వెళ్లే ముందు అడుగు భాగంలో ఉన్న స్కానర్లు స్కాన్ చేస్తాయి. దీని వల్ల ఆయుధాల్ని గానీ, అనుమానిత వస్తువుల్ని గానీ కొండ పైకి తీసుకెళ్లే అవకాశముండదు. ఇదే తరహా భద్రతను యాదాద్రిలోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మరోవైపు సమీప భవిష్యత్తులో యాదగిరిగుట్ట ప్రాంతంలోనే ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే గుట్టపై ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ వెల్లడించారు.

కాచిగూడ-టాటానగర్ మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం కాచిగూడ-టాటానగర్‌ల మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 07438 నంబరు గల ప్రత్యేక రైలు ఫిబ్రవరి 5, 12, 19, 26, మార్చి 2, 9, 16, 23, 30, ఏప్రిల్ 7, 14, 21, 28 మే 4, 11, 18 జూన్ 25వ తేదీల్లో కాచిగూడలో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.45కు టాటానగర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు (నెంబరు 07439) ఫిబ్రవరి 6, 13, 20, 27, మార్చి 6, 13, 20, 27, ఏప్రిల్ 3, 10, 17, 24 మే 1, 8, 15, 22, 29, జూన్ 26వ తేదీల్లో టాటానగర్‌లో రాత్రి 10.50కి బయలుదేరి రెండోరోజు ఉదయం 5 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. ఈ రైలు మల్కాజిగిరి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాసా, కుర్దారోడ్, భువనేశ్వర్, కటక్‌స్టేషన్లలో ఆగుతుంది.

పట్టాలెక్కని పాసుపుస్తకాల ముద్రణ

- టెండరు ప్రక్రియలోనే జాప్యం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి ప్రభుత్వం గడువు నిర్ణయించినప్పటికీ ముద్రణకు సంబంధించిన ప్రక్రియ నేటికీ పట్టాలెక్కలేదు. మార్చి 11 తేదీకి ఒక రోజు ముందుగానే పాసుపుస్తకాలను ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు తరలించాలని సర్కారు ఆదేశించింది. ఆ లెక్కన ఇంకా దాదాపు యాభై రోజుల లోపే సమయం ఉంది. ఈ లోగా ప్రమాణాలకు అనుగుణంగా టెండర్లు పూర్తి చేయడంతోపాటు ముద్రణకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాతగానీ ముద్రణ పూర్తిచేసుకుని గ్రామాలకు పంపించే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో మరోమారు చెమటోడ్చక తప్పదన్న అభిప్రాయం రెవెన్యూ యంత్రాంగం నుంచి వినిపిస్తోంది.

అత్యంత ఆధునిక సాంకేతికతతో రూపొందించనున్న పాసుపుస్తకాల్లో అంశాలు సమగ్రంగా ఉండాలని, భద్రతా ప్రమాణాలను పాటించాలని సీఎం ఇప్పటికే అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పక్కాగా పాసుపుస్తకం రూపొందించడానికి రెవెన్యూ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సాంకేతిక, ముద్రణ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. పాసుపుస్తకం తయారీలో వినియోగించే విధానాలను మరెక్కడా వాడొద్దని ఆయా సంస్థలకు సూచిస్తున్నారు. ఇప్పటికే ఇరవైకి పైగా సంస్థలు పలు దఫాలుగా చర్చల్లో(బిడ్డింగ్‌కు సంబంధించిన) పాల్గొన్నాయి. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంస్థలు ముందుకొస్తే ధర నిర్ణయించనున్నారు. మరోవైపు దీనికి సమాంతరంగా ధరణి వెబ్‌సైట్‌ను కూడా ఏర్పాటుచేయాల్సి ఉంది. ఇప్పుడు అమలవుతున్న వెబ్‌ల్యాండ్(మాభూమి) స్థానంలో భూ దస్త్రాల ప్రక్షాళన(ఎల్‌ఆర్‌యూపీ) సందర్భంగా సేకరించిన సమాచారాన్ని ధరణిలో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఈ పనిని కూడా పాస్‌పుస్తకాలకు సమాంతరంగానే చేపట్టాల్సి ఉంది.



భూదస్త్రాల ప్రక్షాళన సందర్భంగా బాసర మండలంలో సేకరించిన సమాచారంతో I బి పత్రం

ఆదివాసీల హక్కుల సాధనకు కృషి చేస్తా

జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్ సాయి



విద్యానగర్, న్యూస్‌టుడే: రాజ్యాంగబద్ధంగా ఆదివాసీలకు సంక్రమించాల్సిన హక్కులు, రిజర్వేషన్ల అమలుకు కృషి చేసి, న్యాయం చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ నందకుమార్ సాయి తెలిపారు. అన్నిరంగాల్లో వారు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని నల్లకుంటలో కుసుమ హరినాథ్ ఆశ్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో 'గిరిజన ఐక్య వేదిక' పుస్తకావిష్కరణ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధనకు శాంతియుతంగా ఉద్యమించాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలకు ఆదివాసీలు ప్రతిబింబమని చెప్పారు. పట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి మాట్లాడుతూ..ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతోందని అభిప్రాయపడ్డారు. ఆదివాసీలకు రిజర్వేషన్లు, హక్కులు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సోయం బాబురావు మాట్లాడుతూ..ఆదివాసీలకు అందాల్సిన రిజర్వేషన్లు, హక్కులను లంబాడీలు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఆదివాసీలకు నష్టం జరుగుతోందని చెప్పారు.

'లిమ్కా రికార్డ్స్'లో శ్రీనగర్ పుస్తకాల దుకాణం



దాల్ సరస్సు పక్కన పుస్తకాల దుకాణం. అంతరచిత్రంలో అహ్మద్

శ్రీనగర్: పర్యటకుల స్వర్గధామం శ్రీనగర్‌లోని దాల్ సరస్సు పక్కనే ఉన్న ఏకైక 'గుల్షన్ బుక్స్' ప్రచురణ దుకాణం 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. నెహ్రూ ఉద్యానవనంలోని ఈ దుకాణంలో 80 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. తేనీరు తాగుతూ, పుస్తకం చదువుతూ దాల్ సరస్సు అందాలు వీక్షించాలనుకునేవారికి, చెక్క పడవలో సరస్సులో విహరించాలనుకునే సాహితీప్రియులకు ఇది చక్కటి అనుభూతిని పంచుతోంది. ఐదు తరాలుగా తాము పుస్తకాలు అమ్ముతున్నామని, పుస్తకం కొనేవారికి సరస్సులో విహారం కూడా ఉచితంగా కల్పిస్తున్నట్లు దుకాణం యజమాని షేక్ అజాజ్ అహ్మద్(46) తెలిపారు.

మాజీ డీజీపీ ఆర్కే రాగాల కన్నుమూత



హబ్సిగూడ, న్యూస్‌టుడే: మాజీ డీజీపీ ఆర్.కె.రాగాల(81) అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన డీజీపీగా విధులు నిర్వర్తించారు. తూర్పుగోదావరి జిల్లా చదలవాడకి చెందిన రాగాల ప్రస్తుతం హబ్సిగూడ కాకతీయనగర్‌లో నివాసముంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఇక ప్రజల వద్దకే పోలీస్

ప్రతి జిల్లా కేంద్రంలోనూ ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ విభాగం

ఈనాడు, హైదరాబాద్: బాధితుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే సమీపంలోని పోలీసు సిబ్బంది సంఘటనాస్థలానికి వెళ్లే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయబోతున్నారు. తద్వారా నేరాలు, వాటి తీవ్రతను నివారించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆదేశాలు జారీ చేయగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ విభాగాలను నెలకొల్పేందుకు ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ప్రస్తుతం ఈ విధానం హైదరాబాద్‌లో అమలులో ఉంది

ఏదైనా సమస్య తలెత్తినప్పుడు బాధితులు పోలీసులను సంప్రదిస్తుంటారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరగడంతో చరవాణి ద్వారానే స్థానిక పోలీసులను సంప్రదిస్తున్నారు. కానీ పోలీసులు పెద్దనేరం జరిగినప్పుడో, తప్పదనుకున్నప్పుడో మాత్రమే స్టేషన్ నుంచి కాలు బయటపెట్టేవారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే బాధితులు పోలీస్‌స్టేషన్లో కూడా అధికారులను కలవడం కష్టంగా ఉంటోంది. రకరకాల కారణాలతో స్థానిక అధికారులు స్టేషన్లో కూర్చునేది తక్కువ. దాంతో బాధితులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు డయల్-100 విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయడం మొదలుపెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇందుకోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జీపీఎస్ వ్యవస్థతో ఇది అనుసంధానం కావడం వల్ల ఎవరైనా ఎక్కడ నుంచయినా ఫోన్ చేసిన వెంటనే వారు ఉన్న ప్రదేశం, సమీపంలోని పోలీసు గస్తీ బృందాలు కమాండ్ కంట్రోల్ కేంద్రంలోని కంప్యూటర్ తెరపై కనిపిస్తాయి. దాంతో సమీపంలోని పోలీసులను తక్షణమే బాధితుల వద్దకు పంపడానికి వీలయ్యేది. ఫోన్ చేసిన వెంటనే పోలీసులు వస్తుండటంతో ప్రజల్లోనూ దీనిపై నమ్మకం పెరిగింది. ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే ప్రతి నిముషానికి రెండు అత్యవసర ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, కొట్లాటలు, ఇతరత్రా నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయబోతున్నారు.

రబ్బరు పరిశ్రమ అధిపతి గుండెపోటుతో మృతి

ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.కోట్లలో నష్టం!



దీనదయాళ్ అగర్వాల్ (పాతచిత్రం)

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: ఇటీవల అగ్నిప్రమాదం జరిగిన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం బండ్లగూడ గ్రామంలోని అగర్వాల్ రబ్బరు పరిశ్రమ యజమాని దీనదయాళ్ అగర్వాల్(70) గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. అగర్వాల్ రబ్బరు పరిశ్రమలో ఇటీవల విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం సంభవించగా దాదాపు లక్షకు పైగా టైర్లు కాలిపోయి రూ.కోట్లలో నష్టం వచ్చింది. ఈ సంఘటనతో దీనదయాళ్ అగర్వాల్ ఆందోళనకు లోనై అస్వస్థతకు గురయ్యారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున గుండెపోటు వచ్చిందని.. ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారని చెప్పారు. 1300 మంది కార్మికులు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. ఆయన కుమారుడు అమిత్ అగర్వాల్‌ను హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పరామర్శించారు.

గురుకుల పోస్టుల భర్తీకి వచ్చే నెలలో ప్రధాన పరీక్షలు

టీఎస్‌పీఎస్సీ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, గ్రంథపాలకుల పోస్టుల భర్తీకి వచ్చే నెలలో ప్రధాన (మెయిన్స్) పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఆదివారం వెల్లడించింది. వచ్చే నెల 19 నుంచి 24 మధ్యలో వీటిని నిర్వహించే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే నిర్వహించిన ప్రాథమిక పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా 1:15 నిష్పత్తిలో అభ్యర్థులను ప్రధాన పరీక్షకు ఎంపిక చేసినట్లు తెలిపింది. వివరాల కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

ప్రతిష్టంభన ముగింపునకు చివరి ప్రయత్నాలు

- అమెరికాలో కాంగ్రెస్‌లో మళ్లీ ఓటింగ్
- పరిష్కారం కాకుంటే తీవ్రం కానున్న సమస్య

వాషింగ్టన్: బడ్జెట్ ప్రతిష్టంభనతో లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులు ఎలాంటి వేతనం లేకుండా ఇంటికే పరిమితమయ్యే పరిస్థితిని నివారించడానికి అమెరికా చట్టసభ సభ్యులు చివరి ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి మొదలైన ఈ ప్రతిష్టంభన ఇప్పటివరకూ పరిమితంగానే ప్రభావం చూపింది. న్యూయార్క్‌లోని 'స్టాట్యూ ఆఫ్ లిబర్టీ' వంటి ప్రదేశాలను మూసేశారు. సోమవారానికి కూడా ఈ ప్రతిష్టంభన కొనసాగితే ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది.

జనవరి 20లోగా తాత్కాలిక బడ్జెట్‌కు ఆమోదం లభించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తింది. దీనికి కారణం మీరంటే మీరంటూ రిపబ్లికన్లు, డెమోక్రాట్లు పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నారు. అధ్యక్షుడి విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికాలోని ప్రధాన నగరాల్లో వేల మంది ప్రజలు శనివారం ర్యాలీలు నిర్వహించారు. మరోవైపు అమెరికా కాంగ్రెస్‌లోని రెండు సభలు స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సమావేశమవుతున్నాయి. అర్ధరాత్రి 1.00 గంటల (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11.30గంటలు)కు నిధుల అంశంపై కీలక ఓటింగ్ జరిగే వీలుందని రిపబ్లికన్ పార్టీకి చెందిన అగ్రశ్రేణి సెనేటర్ మిచ్ మెక్ కానెల్ పేర్కొన్నారు. ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు అసాధారణంగా శనివారం కూడా కాంగ్రెస్ సమావేశమైంది. అయితే సమస్య పరిష్కారానికి బదులు.. నేతలు పరస్పరం ఆరోపణలు రువ్వుకున్నారు. అక్రమ వలసదారుల అంశమే ఈ వివాదానికి కేంద్రబిందువుగా ఉంది. చిన్నతనంలోనే అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన 7లక్షల మంది.. దేశం నుంచి గెంటివేతకు గురికాకుండా నివారించడానికి ఒక నిధిని ఏర్పాటు చేయడానికి నిరాకరించడం ద్వారా.. రిపబ్లికన్లు మొండిగా వ్యవహరిస్తున్నారని డెమోక్రాట్లు ఆరోపిస్తున్నారు. దీనివల్ల రాజీకి అవకాశం లేకుండాపోతోందన్నారు. అయితే దేశం మీద కన్నా అక్రమ వలసదారుల గురించే డెమోక్రాట్లకు ఆరాటం ఎక్కువగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. మరోవైపు సోమవారం ప్రతిష్టంభన ప్రభావం తీవ్రం కానుంది. ప్రస్తుతానికి అత్యవసర ఫెడరల్ సేవలు, సైనిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఒక అవగాహనకు వచ్చేవరకూ సైనిక బలగాలకూ వేతనాలు అందవు.

రాయబార కార్యాలయ సేవలు యథాతథం: తాజా ప్రతిష్టంభన నేపథ్యంలోనూ దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయంలో కాన్సులర్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని ఓ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

ఏడాదిగా ఎన్నో ఆటుపోట్లు

ఎద్దు ఎండకు ఎనుబోతు నీడకు చందంగా అగ్రరాజ్యంలో పాలక ప్రతిపక్షాలు ఎడమొగం పెడమొగం కావడంతో- పెద్దల సభలో కీలక వ్యయ బిల్లుకు ఎదురుగాలి వీచి అమెరికా స్తంభించిపోయింది. రక్షణ శాఖ సహా పలు ప్రభుత్వ విభాగాలకు వచ్చేనెల 16దాకా స్వల్పకాల నిధులందించే వ్యయ బిల్లును దిగువ సభ 230-197 ఓట్లతో ఆమోదించినా, సెనేట్‌లో చుక్కెదురు కావడానికి దేశాధ్యక్షుడు ట్రంప్ ఒంటెత్తు ధోరణులే పుణ్యం కట్టుకొన్నాయి. శ్వేత సౌధాధిపతిగా ఏడాది పూర్తయిన వేళ- ట్రంప్ సర్కారుకు ఈ ఎదురు దెబ్బ స్వయంకృతమేనని చెప్పాలి. 'ప్రమాదకర దక్షిణ సరిహద్దుల్లో భద్రత కన్నా, మన ఘనత వహించిన మిలిటరీ కన్నా ఎక్కువగా డెమోక్రాట్లు అక్రమ వలసదారులపట్లే ఆందోళన చెందుతున్నారు. సునాయాసంగా ఒప్పందం కుదుర్చుకోగల వీలున్నా వారు ప్రభుత్వ వ్యవస్థలను స్తంభింప చేయడానికే మొగ్గు చూపారు' అని అధ్యక్షుడు ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. ప్రభుత్వోద్యోగులకు జీతాలు చెల్లించలేని వాతావరణంలో ఎనిమిదిన్నర లక్షలమందికి వేతన రహిత సెలవుల్ని ప్రకటించారు. సంవత్సరాలుగా సాగుతున్న తమ పరిశోధనలకు అంతరాయం ఏర్పడుతుందని జాతీయ ఆరోగ్య సంస్థలు వాపోతుంటే- ఆరోగ్యం, మానవ సేవా విభాగ సిబ్బందిలో సగం మంది ఇళ్లకే పరిమితం కానున్నారు. సర్కారీ వ్యయ పద్దు స్తంభన కారణంగా వారానికి రూ.42వేల కోట్ల మేర నష్టం వాటిల్లనుందని ఒక అంచనా. అక్రమ వలసలపై ట్రంప్ ఉక్కుపాదం మోపడంతో- దశాబ్దాల క్రితం తల్లిదండ్రులతో కలిసి అమెరికా గడ్డపై కాలిడిన ఏడు లక్షలమంది మార్చి తొలి వారంలోగా తట్టాబుట్టా సర్దుకోవాల్సి ఉంటుంది. అలాంటి యువ వలసదారుల (డ్రీమర్స్)కు న్యాయం జరగాలని పట్టుపడుతున్న డెమోక్రాట్లు, తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లంటున్న ట్రంప్ మహాశయుడు- ఎవరూ మెట్టు దిగిరాకపోవడంతోనే తాజా ఆర్థిక దిగ్బంధం అమెరికా ప్రభుత్వాన్ని చుట్టేసిందిప్పుడు. ఇదే వరస కొనసాగితే అగ్రరాజ్యానికి ఇక ముందూ తప్పవు ఆటుపోట్లు!

పెడసరానికి పెద్దన్నగా పదేపదే రుజువు చేసుకొంటున్న ట్రంప్ రాకతో- అంతర్జాతీయ యవనికపై అగ్రరాజ్యంగా అమెరికా దశాబ్దాలుగా పోషిస్తూ వచ్చిన పాత్ర స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోయాయి. 'అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట' అన్న ట్రంప్ అజెండాలో తప్పు పట్టాల్సింది ఏమీ లేకపోయినా, అందుకోసమంటూ తీసుకొంటున్న హ్రస్వదృష్టి నిర్ణయాలతో- అమెరికాతోపాటు ప్రపంచ దేశాలూ సతమతమవుతున్నాయి. నేడు రమారమి 20లక్షల కోట్ల డాలర్ల మహా ఆర్థిక మేరునగంగా ఎదిగిన అమెరికా- ఒక్క ముక్కలో చెప్పాలంటే, నానాజాతి సమితి! ట్రంప్‌కు ముందు శ్వేతసౌధంలో చక్రం తిప్పిన 44మంది అధ్యక్షులూ ఆ చారిత్రక వాస్తవాన్ని గుర్తెరిగి నడుచుకొన్నవారే. ఉరుముతున్న ఉగ్రవాదాన్ని ఆయా మత సంబంధ దేశాలతో ముడిపెట్టకుండా సంయమనం పాటించినవారే! ఉత్తర కొరియా, వెనిజువేలాతోపాటు ఏడు ముస్లిం దేశాల పౌరులు అమెరికాలోకి రాకుండా ట్రంప్ విధించిన నిషేధాజ్ఞల్ని సమీక్షిస్తామని తాజాగా సుప్రీంకోర్టు ప్రకటించింది. వలసల కట్టడి ద్వారానే అమెరికన్ల ఉద్యోగ భద్రత సాధ్యపడుతుందన్న ట్రంప్ వర్గీయుల బృందగానం అగ్రరాజ్యం ప్రయోజనాలకే భంగకరమని ఆర్థికవేత్తలే మొత్తుకొంటున్నా శ్వేత సౌధం పెడచెవిన పెడుతోంది. నిరుటితో పోలిస్తే నిరుద్యోగిత రేటు తగ్గడం ఏడాది కాలంలో తాను సాధించిన ఘన విజయమని ట్రంప్ చెప్పుకోవచ్చుగాక- వాషింగ్టన్ డీసీలో వేలమంది మహిళల మహా ప్రదర్శన లింగ సమానత్వంపై ఎలుగెత్తి, పాలక పక్ష విధానాల్ని తూర్పారబట్టింది. దేశీయంగా ఉపాధి పెంపు పేరిట ప్యారిస్ ఒప్పందాన్ని తోసిపుచ్చడం అసంబద్ధమని పలు రాష్ట్రాలు గట్టిగానే నిరసన వ్యక్తీకరించాయి. అమెరికా పౌర సమాజాన్ని సంకుచిత రాజకీయ దృక్కోణంలో విభజించడం ద్వారా- వచ్చే నవంబరునాటి కాంగ్రెస్ ఎన్నికల్లో విజయతీరాలు చేరాలన్న ట్రంప్ దురాలోచనలవల్లే- పాలనలో ప్రతిష్టంభన అనివార్యమైంది!

ప్రజాజీవితంలో అధ్యక్షుడు ఎంతో హుందాగా మెలగాలని, ఎల్లవేళలా తన పదవీ గౌరవాన్ని కాపాడేలా వ్యవహరించాలని అమెరికా తొట్టతొలి అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్ 1789లో వ్యాఖ్యానించారు. వాషింగ్టన్, లింకన్, ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌లాంటివారు అధ్యక్షులుగా ఎంతగానో రాణించగా- జేమ్స్ బుకానన్, ఆండ్రూ జాన్సన్ ప్రభృతులు నేలబారు సరకుగా అపకీర్తి పాలయ్యారు. నడుస్తున్న చరిత్రలో డొనాల్డ్ ట్రంప్ స్వీయ పదవీ గౌరవాన్నే కాదు, అమెరికా ప్రతిష్ఠనే దిగజారుస్తున్న తీరుకు ఎన్నో రుజువులు పోగుపడుతున్నాయి. పన్ను కోతలతో ఆర్థిక ప్రగతి, ఉద్యోగాల వృద్ధితోపాటు కుటుంబ ఆదాయాలు పెరుగుతాయని ట్రంప్ ప్రభుత్వం చెబుతున్నా, 2028 నాటికి ఆర్థిక వ్యవస్థ స్థాయిని మించి అమెరికా రుణభారం పెరిగిపోతుందన్న ఆందోళనలు చెవినపడుతున్నాయి. భిన్నాభిప్రాయాలు వ్యక్తీకరించే పత్రికల్నే కాదు; న్యాయ, కార్య నిర్వాహక వ్యవస్థల్నీ తూలనాడే ధోరణులు ప్రబలుతున్నాయి. పసిఫిక్ తీర ప్రాంత దేశాలతో వాణిజ్య భాగస్వామ్య ఒప్పందం రద్దు, సహేతుక వాటాలు చెల్లించడం లేదంటూ 'నాటో' కూటమితో కోలాటాలు అగ్రరాజ్యాన్ని ఏకాకిని చేస్తుంటే- ఉత్తర కొరియా ఉన్మాదాన్ని తలదన్నే స్థాయిలో ట్రంప్ 'ట్వీట్లు'- అణు యుద్ధ భూతాన్ని ఆవాహన చేసే స్థాయిలో భీతిల్లజేశాయి. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని సంస్కరించాల్సిందేనన్న హుంకరింపులు, ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని జెరూసలెమ్‌కు తరలించడం కొత్త కుంపట్లు రగిలించాయి. దుందుడుకుతనంతో ట్రంప్ ఏడాదికాలంగా సాగిస్తున్నది బీభత్స పాలన. దాని పర్యవసానమే తాజా ప్రతిష్టంభన!



ఆహారం పుట్లు పంపిణీలోనే పాట్లు


ఆచార్య కోదాటి వియ్యన్నరావు

ప్రపంచ ఆహార భద్రతకు సంబంధించి, గతేడాది ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) వెలువరించిన నివేదిక పలు ఆందోళనకర వాస్తవాలకు అద్దం పట్టింది. ఆహార కొరత, పోషకాహార లోపం వంటి సమస్యలు మానవాళిని ఎంతగా పీడిస్తున్నాయో అది వెల్లడించింది. ఆ సంస్థ అందించిన సమాచారం ప్రకారం, అంతకుముందు ఏడాదికంటే 2017లో ప్రపంచవ్యాప్తంగా కోటీ 68లక్షల టన్నుల ఆహార ధాన్యాలు అధికంగా ఉత్పత్తి అయ్యాయి. ఆ సంవత్సరంలో మొత్తంమీద ఆహారోత్పత్తి 262.7కోట్ల టన్నులకు పైమాటే! ఇది రికార్డు స్థాయి ఉత్పత్తి. గడచిన సంవత్సరాల నిల్వలనూ కలిపి లెక్కిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఆహారనిల్వలు గత డిసెంబరునాటికి 333 కోట్ల టన్నులకు పైగా ఉంటాయి. అవసరాల్ని, ఉన్నవాటిని బేరీజు వేసి చూస్తే, నిల్వలు మూడు రెట్లు ఎక్కువ ఉన్నాయి. అయిదేళ్ల కాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తిపరంగా పెరుగుదల సగటున 0.6 శాతంనుంచి 1.0 శాతం వరకు నమోదైంది. అంటే, ఉత్పత్తి రీత్యా ఆహారధాన్యాల విషయంలో గడ్డు పరిస్థితి లేదు. ధాన్యాలు పుష్కలంగా ఉన్నా, మరోవైపు అన్నార్తుల సంఖ్య అంతకంతకూ ఇనుమడించడానికి కారణమేమిటన్నదే ప్రస్తుత చర్చనీయాంశం!

లక్ష్యం సుదూరం


అర్థశాస్త్రవేత్త థామస్ రాబర్ట్ మాల్థస్ సిద్ధాంతాన్ని అనుసరించి- ఆహారోత్పత్తికి, జనాభా పెరుగుదలకు సంబంధం ఉంది. ఆహారధాన్యాల కొరతకు జనాభా పెరుగుదల కూడా ఒక కారణం. జనాభా 1, 2, 4, 8... నిష్పత్తిలో, ఆహారోత్పత్తి 1, 2, 3, 4 పద్ధతిలో పెరుగుతుంటాయి. ఆయన అంచనా మేరకు, ప్రతి పాతిక సంవత్సరాలకూ జనసంఖ్య రెట్టింపు అవుతుంటుంది. ఆహారోత్పత్తి క్రమేపీ తగ్గుతుంటుంది. కొంతకాలానికి ఇలా పోల్చి చూస్తే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల శాతం దాదాపు శూన్యంగానే కనిపిస్తుంది. మితిమీరిన వినియోగంతో పాటు, భూసారంలో క్షీణతవల్ల సైతం రానున్న సంవత్సరాల్లో గతంతో పోలిస్తే ఆహారోత్పత్తి తగ్గవచ్చు. ఆహార, వ్యవసాయ సంస్థ లెక్కల్ని బట్టి, మొత్తం ఉత్పత్తిలో తగ్గుదల లేకున్నా పెరుగుదల శాతం మాత్రం ఒకటి లోపునే ఉంటోంది. ఆహారోత్పత్తి పెరుగుదల స్థిరీకరణ చెంది, స్థూల ఉత్పత్తి తగ్గిన స్థితిలో- సరైన ప్రణాళికల్ని ప్రభుత్వమే సిద్ధం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత సమస్య ఆహారధాన్యాల కొరత కాదు. వాటి లభ్యత, వినియోగం మధ్య నిష్పత్తి 3:1గా ఉంది. అంటే, కావాల్సిన దానికంటే మూడు రెట్లు అధికంగానే దేశంలో ఆహార లభ్యత ఉన్నట్లు లెక్క. ఇటువంటి స్థితిలో ఆకలి కేకలకు కారణమేమిటి? 'ఫుడ్ ఎయిడ్ ఫౌండేషన్' గణాంకాల ప్రకారం- 2016 నాటికి ప్రపంచంలో 79.5 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఇది నాటి మొత్తం జనాభాతో పోలిస్తే, 10.89 శాతం ఉంటుంది. అంటే ప్రతి తొమ్మిది మందిలోనూ ఒకరు క్షుద్బాధతో అలమటిస్తున్నారన్నమాట. అంతేకాక ప్రపంచవ్యాప్తంగా 13 శాతం ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐక్యరాజ్యసమితి 2015లో ప్రకటించిన సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల్ని సాధించాలంటే, ప్రపంచం నుంచి ఆకలి సమస్యను 2030 నాటికి తరిమివేయాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ లక్ష్యం నెరవేరుతుందని ఆశించడం అత్యాశే!

ఆహారధాన్యాల నిల్వలు సరిపడా ఉన్నా, ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేదు. ప్రజల ఆదాయాలు కనిష్ఠ స్థాయిలో ఉంటున్నాయి. ప్రపంచ జనాభాలో 15 శాతం ప్రజలు రోజుకు సగటున రెండు డాలర్లయినా ఆర్జించలేకపోతున్నారు. దాదాపు 56 శాతం ప్రజల ఆదాయం సగటున రోజుకు 10 డాలర్లు (సుమారు 650 రూపాయలు) దాటడం లేదు. భారత్‌లో గ్రామీణుల పరిస్థితి మరీ దుర్భరం. వారి సరాసరి ఆదాయం నెలకు రూ.5,000 లోపే. ఇంత తక్కువ ఆదాయంతో కుటుంబాన్ని పోషించడం ఎవరికైనా పరమ దుర్భరమే. అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తిని పెంచేలా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలుచేస్తున్నారు. ఇది 685 జిల్లాల్లో 2,62,703 గ్రామపంచాయతీల పరిధుల్లో కొనసాగుతోంది. ఇప్పటివరకు పనికార్డులు మంజూరైనవారి సంఖ్య 12.6 కోట్లు. దేశవ్యాప్తంగా పల్లెప్రాంతాల్లో నివసించేవారిలో 15-20 శాతం ప్రజలకు ఈ పనికార్డులు ఉన్నాయి. గ్రామీణ భారతానికి ఎనలేని మేలు చేసే బృహత్తర పథకంగా దీన్ని రూపుదిద్దారనడంలో సందేహం లేదు. అయితే దేశ జనాభా రీత్యా దీని పరిధిని మరింత విస్తృతం చేయాల్సి ఉంది. గడచిన అయిదేళ్ల కాలంలో (2013-14 నుంచి 2017-18) ఈ పథకంపై కేంద్రం చేసిన ఖర్చు రూ.2,25,431 కోట్లు. అంటే ఈ కార్యక్రమంపై ఏటా సగటున రూ.45,086 కోట్లు ఖర్చు చేస్తున్నారన్నమాట. అయితే గడచిన



వ్యవస్థను చక్కదిద్దాల్సిన సమయం

కొన్నేళ్లుగా ఈ పథకంపై వ్యయంలో స్వల్పంగానైనా కోత కనిపిస్తోంది. సగటున వంద రోజుల పాటు గ్రామీణులకు పని కల్పించాలన్న నిబంధన ఉన్నప్పటికీ చాలాచోట్ల ఈ పనిదినాల సంఖ్య 50కి మించడం లేదని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ కార్యక్రమం పట్టాలకెక్కినప్పటికీ ఇంకా దేశంలో 31శాతం ప్రజలు ఆకలి ముప్పును ఎదుర్కొంటున్నట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆకలి సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు అనేక దేశాలు ఆహార భద్రత చట్టాలను తీసుకువచ్చాయి. అమెరికాతో పాటు చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాలు పలు చర్యలు చేపడుతున్నాయి. మనదేశంలో 2013 నుంచి అమలుచేస్తున్న జాతీయ ఆహారభద్రతా చట్టం ప్రకారం, జనాభా మొత్తంలో మూడింట రెండొంతుల మందికి ఆహారధాన్యాల్ని సబ్సిడీ రేట్లపై అందజేయాలి. ప్రతి వ్యక్తికి నెలకు అయిదు కిలోల వంతున బియ్యం/గోధుమలు/ తృణధాన్యాలు ఇవ్వాలి. ఈ మొత్తం సరఫరా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జరగాలని నిర్దేశించారు. అయితే అమలులో ఈ చట్టం అంత ప్రభావం చూపలేకపోతోంది. అర్హులందరి వద్ద



సంబంధిత కార్డులు లేకపోవడం ఇందుకు కారణం. రాష్ట్రాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించేందుకు వీలుగా అనేక రకాల రంగుల కార్డులను పంపిణీ చేస్తున్నారు. చాలా రాష్ట్రాల్లో ఈ పంపిణీ సక్రమంగా జరగడం లేదు. అందువల్ల అనేకమంది అర్హులు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందలేకపోతున్నారు. ఈ మధ్యకాలంలో 'ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానం' కింద అర్హులందరూ బ్యాంకు ఖాతాలు తెరవాలని, తమ ఆధార్ సంఖ్యతో ఆ ఖాతాలను అనుసంధానించాలని ప్రభుత్వం చెబుతున్నా- పలు కారణాల వల్ల అర్హుల్లో దాదాపు సగంమంది దానికి వెలుపలే ఉన్నారు. పథకాన్ని కేవలం ఆహార ధాన్యాల వరకే పరిమితం చేయడం మరో సమస్య. ఆహార తయారీకి అవసరమైన పప్పులు, చక్కెర వంటివి పథకంలో అంతర్భాగంగా లేకపోవడం గమనార్హం. ఉభయ తెలుగు రాష్ట్రాలూ ఈ పథకం అమలుపై పూర్తి శ్రద్ధ వహించాలి. నిబంధనల్ని బట్టి, ఆహార కమిషన్లను అందుబాటులోకి తేవాలి.

నైపుణ్యాలకు సాన

ప్రపంచ ఆకలి సూచీలో భారత్ ర్యాంకు 100 వద్ద స్థిరపడటం దేశ దురవస్థకు నిదర్శనం. ఆ జాబితాలో భారత్‌తో పోలిస్తే 19 దేశాలు మాత్రమే వెనకంజలో ఉన్నాయి. వంద పాయింట్లకుగాను భారత్ సాధించింది కేవలం 31.4 మాత్రమే! ఈ విషయంలో భారత్ పరిస్థితి నేపాల్ కన్నా దయనీయంగా ఉంది. ఉత్తర కొరియా కంటే బాధాకరం. దేశంలో 23కోట్లమంది ఆకలితో అలమటిస్తున్నారు. ఆకలిబాధ తట్టుకోలేక రోజూ ఏడువేలమందికిపైగా మరణిస్తున్నారని అధ్యయనాలు ఉద్ఘోషిస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఈ విషయంలో బాధాకరంగానే ఉంది. భారతదేశం వృద్ధిరేటు 6.2 శాతమా లేక 7.2 శాతంగా ఉంటుందా అనే చర్చ కంటే, ప్రతి పౌరుడూ రోజూ రెండు పూటలా కడుపునిండా తినగలుగుతున్నాడా అన్నదే ప్రధానం. దాదాపు 42 శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారన్నది కఠోర వాస్తవం. ఆకలి, పౌష్టికాహార లేమి బారినపడుతున్న వారిలో మహిళలు, పిల్లలే అత్యధికంగా ఉన్నారు. ఆకలి బాధకు సరైన పరిష్కారం- అర్హులందరికీ పని కల్పించడం. అదేవిధంగా ఆహారోత్పత్తిని రెండింతలు చేయడం. ఆహార ధాన్యాలను సక్రమంగా పంపిణీ చేయడమే సమస్యను తొలగించే మార్గం. ప్రభుత్వాలు రాజకీయ అవసరాల్ని పక్కనపెట్టి, ప్రజలందరికీ ఆహారం పంపిణీ అయ్యేలా చూడాలి. బియ్యం విషయంలో భారతదేశం ప్రముఖ ఎగుమతిదారుగా అవతరించింది. కాబట్టి, ఆహార కొరత అనేది ఉత్పత్తి కారణంగా ఏర్పడింది కాదు. సమర్థంగా సరఫరా చేయడమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత.

పౌరులకు కేటాయించే ఆహార ధాన్యాల పరిమాణం పెంచాల్సిన అవసరం ఉంది. అర్హత కార్డుల పంపిణీ సవ్యంగా సాగాలి. జాతీయ ఉపాధి పథకం పరిధిని ఎంతో విస్తృతం చేయడం, పనిదినాల్ని 200 రోజులకు పెంచడం, కుటుంబంలో ఇద్దరికి అవకాశం కల్పించడం కూడా ప్రభుత్వ కర్తవ్యాలే. దాని ద్వారా 'సామాజిక ఆస్తులు' పెరగాలి. అన్ని మార్గాల ద్వారా ఉపాధి అవకాశాల్ని పెంపొందించడం సమస్యకు మరో శాశ్వతమైన పరిష్కార మార్గమవుతుంది. అందులో భాగంగా తల్లిదండ్రుల, విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పు తీసుకురావాలి. నైపుణ్య ఆధారిత చదువు, స్వశక్తితో నేర్చిన పని ఆధారంగా వ్యక్తి ఉన్నత జీవనం సాగించే వాతావరణం నెలకొనాలి. జపాన్ వంటి దేశాలు సత్వర పురోభివృద్ధి చెందడానికి, ఆ జనాభాలో కనీసం 40శాతం వరకు సుశిక్షితులైన కార్మికులు ఉండటమే కారణం. వస్తూత్పత్తిలో జపాన్‌ను మించిన దేశం లేదు. సంక్లిష్టమైన యంత్రాలు, పరికరాల తయారీలో వారికి వారే సాటి. పేరెన్నికగన్న భారీ యంత్ర తయారీకి జర్మనీ పేరు గడించింది. మనదేశంలోనూ నైపుణ్యాల్ని వెలికితీసి, వాటికి అన్ని రకాలుగా ప్రోత్సాహం కల్పించాలి. చట్టాల్ని సవ్యంగా అమలుచేస్తే, ఆహార ధాన్యాల పంపిణీలో జాగ్రత్త వహిస్తే, నైపుణ్య సంపదను అభివృద్ధిపరిస్తే... భారత్‌కు మంచిరోజులు వచ్చినట్లే!

(రచయిత- పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

రోబోలున్నారు జాగ్రత్త!

ఇటీవల జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన రోబోల ప్రదర్శనలో దుస్తులు మడత పెట్టే రోబోనూ, దుకాణాల్లో సరకులు అమ్మే మర మనిషినీ చూసినవారికి ఇక మానవ శ్రామికులకు కాలం చెల్లుతోందని భయం పట్టుకొంది. జనాభాలో వృద్ధుల శాతం పెరిగిపోయిన జపాన్‌కు మర మనుషులు అవసరమేమో! కానీ, అధిక జనాభా కలిగిన భారత్, చైనా వంటి దేశాల్లో మాత్రం రోబోలు మనుషుల పొట్ట కొడతాయని ఆందోళన పెరిగిపోతోంది. ఇళ్లలో, దుకాణాల్లో, కార్యాలయాల్లో సేవలు అందించే రోబోల విపణి 2016లోనే 810 కోట్ల డాలర్లకు చేరగా, 2030 కల్లా ఈ విపణి విలువ 9 రెట్లు పెరగనున్నది. రానున్న రోజుల్లో మొబైల్ ఫోన్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), కృత్రిమ మేధ (ఏఐ)లు అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక వ్యవస్థలను నడిపిస్తాయని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) ప్రకటించిందంటే ఆశ్చర్యమేముంది?

మారుతున్న పనితీరు

కొత్త సాంకేతికతలు మన కార్యస్థానాలను కొత్త రకంగా తీర్చిదిద్దుకోవలసిన అవసరాన్ని ముందుకు తెస్తాయి. భవిష్యత్తులో చాలా పనులు ప్రాజెక్టులవారీగానే జరుగుతాయి కాబట్టి పూర్తి కాల ఉద్యోగుల అవసరం తక్కువ అవుతుంది. అంతర్జాలం, మొబైల్, కంప్యూటర్ల చలవతో పనులను కార్యస్థానాల్లో మాత్రమే కూర్చుని చేయాల్సిన అగత్యం ఉండదు. ఎక్కడైనా చేయవచ్చు, ఎక్కడికైనా ప్రాజెక్టులను పూర్తిచేసి పంపవచ్చు. ఈ పరిణామాన్ని రోబోలు, డ్రోన్లు, సెన్సర్లు, ఐఓటీ, కృత్రిమ మేధ మరింత వేగవంతం చేస్తాయి. ఈ మార్పులు అన్ని సంస్థల్లో ఒకే రకంగా జరగకపోయినా వాటికి అందరూ సిద్ధంగా ఉండకతప్పదు. మారుతున్న పని పరిస్థితులు యాజమాన్యాలతోపాటు యువ ఉద్యోగులు, కార్మికులపై కూడా విస్తృత ప్రభావం చూపనున్నాయి.

రేపటి సిబ్బంది సహస్రాబ్ది తరం (మిలేనియల్స్) నుంచే రాబోతున్నారు. 1980-2000 సంవత్సరాల మధ్యలో జన్మించిన వారిని సహస్రాబ్ది తరమంటున్నారు. ఈ నవ యువతరం జీవనశైలి, పని విధానం, అలవాట్లు, హాబీలు, ఆశలు, ఆశయాలు పాత తరాలకు పూర్తి భిన్నంగా ఉంటాయి. వీరు రోజులో సగటున ఆరున్నర గంటలపాటు అంతర్జాలంలో, సామాజిక మాధ్యమాల్లో గడిపేస్తున్నారు. అమెరికన్ మిలేనియల్స్ రోజులో 18 గంటలసేపు వివిధ రకాలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని అంచనా. అయితే యువజనులు ఎక్కువగా ఫేస్‌బుక్‌ను ఉపయోగిస్తే మానసిక వ్యాకులతకు గురవుతున్నట్లు మిషిగన్ విశ్వవిద్యాలయ అధ్యయనంలో తేలింది. ఇలాంటి అంశాలు రేపు యువ శ్రామికులు, సిబ్బంది పని తీరును, ఉత్పత్తినీ ప్రభావితం చేస్తాయి. పనిలో మనసును లగ్నం చేయగలుగుతున్నామని చెప్పిన మిలేనియల్స్ 28.9 శాతమేనని 2015లో జరిగిన గ్యాలప్ సర్వే తెలిపింది. అందుకే చాలామంది సహస్రాబ్ది తరంవారు మధ్యలోనే ఉద్యోగాలు వదిలేసి, ప్రాజెక్టులను ఫ్రీలాన్స్ ప్రాతిపదికపై సొంతంగా చేస్తున్నారు. నవకల్పనల సత్తాఉన్నవారైతే సొంత వ్యాపారాలు చేసుకొంటున్నారు. స్వేచ్ఛను కోరుకునే ఈ యువజనులు ఏదో ఒక ఉద్యోగంలో కుదురుకోవడానికి ఇష్టపడటం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వల్ల అటువంటి అవకాశాలూ తగ్గిపోతూ, నవీనంగా ఆలోచించగలిగే వ్యక్తులు, సంస్థలకు మంచి రోజులు వస్తున్నాయి. సహస్రాబ్ది తరంలో సృజనశీల సిబ్బంది జీవన, పని శైలులకు అనువైన కార్య వాతావరణాన్ని కల్పించే సంస్థలు, వారిని పెద్ద సంఖ్యలో ఆకర్షించగలుగుతాయి. పని దారి పనిదే, తమ జీవితాలు తమవే అంటున్న తరమిది, రోజులో ఎక్కువ కాలం ఉద్యోగాలకే అంకితం చేసి వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయడం కుదరదంటోంది ఈ తరం. ప్రతీ నలుగురు సహస్రాబ్ది



ఉద్యోగాలకు ఎసరు

యువతీయువకుల్లో ముగ్గురు పని-వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత ఉండాలని కోరినట్లు 2015లో అమెరికా వాణిజ్య మండలి వెలువరించిన నివేదిక తెలిపింది. రోజంతా పనికే అంటిపెట్టుకు పోకుండా తమకంటూ సొంత సమయం ఉండాలని వీరు కోరుకొంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీలు అవసరాన్ని బట్టి మార్చుకోగల పని గంటలనూ, ఇంటి నుంచి పని చేసే వెసులుబాటునూ, లక్షిత పనులను సకాలంలో పూర్తిచేయడం, మంచి ఫలితాలు చూపడం వంటి అంశాల ఆధారంగా పనితీరును మూల్యాంకనం చేసే విధానాన్ని అందిస్తున్నాయి. ఏదైనా సరే సాధించగలమనే ధీమానూ, నవీకరణ సత్తానూ ప్రదర్శించే యువజనులకు పెద్ద పీట వేస్తున్నాయి. సహస్రాబ్ది తరం తమ జీవితాల్లో అధిక భాగాన్ని డిజిటల్ సీమలోనే గడిపేస్తున్నారు. కార్య స్థలాల్లో కూడా సామాజిక మాధ్యమాలనూ, తక్షణ సందేశాలనూ, వీడియో ఆన్ డిమాండ్ బ్లాగులనూ, వికీలనూ వాడుకునే వెసులుబాటును ఆశిస్తున్నారు.

ఐబీఎం, నోవార్టిస్, ఏడీపీ, ఇంగర్సాల్ ర్యాండ్ వంటి సంస్థలు తమ ఉద్యోగులకు ఇప్పటికే అలాంటి వాతావరణాన్ని కల్పించాయి. ఫేస్‌బుక్, ట్విటర్ లతోపాటు యామర్, జైవ్, చాటర్ వంటి టూల్స్‌నూ ఉపయోగించుకోవడానికి అనుమతిస్తున్నాయి. దీనివల్ల సాటివారితో సంప్రదిస్తూ తమ నవీకరణ సత్తాకు పదునుపెట్టుకునే అవకాశం మిలీనియల్స్‌కు దక్కుతుంది. నిజానికి సహస్రాబ్ది యువజనులతోపాటు సామాన్య ప్రజలూ ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లు లేనిదే జీవితం గడపలేని పరిస్థితి వచ్చేస్తోంది. ఇటీవల 23 దేశాల్లో 18,180 మందిని సర్వే చేయగా మూడింట రెండు వంతులమంది అంతర్జాలం లేని జీవితాన్ని ఊహించలేమన్నారు. అన్ని దేశాల్లోకి అత్యధికంగా భారత్‌లో 82 శాతం మంది ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా అమెరికాలో 73 శాతమే ఆ మాట అన్నారు.

కొత్త వాతావరణం

ఎక్కడి నుంచైనా పనిచేసే సౌలభ్యం ఉన్నప్పుడు కార్యాలయానికి వచ్చేవారి సంఖ్య తగ్గి, కార్యాలయాలు తక్కువ స్థలంలో కుదురుకుంటాయి. 2020 చివరికల్లా కార్య స్థానాల విస్తీర్ణం 17 శాతం మేరకు తగ్గనున్నది. 29 శాతం సిబ్బంది కార్యాలయాల్లో కూర్చుని పనిచేయరు. ఇంటి దగ్గర నుంచి చేయవీల్లేని పనులు చేయడం కోసం, తోటివారితో కలసి పనిచేయడం ద్వారా ప్రేరణోత్తేజాలను పొందడం కోసం ఆఫీసుకు వచ్చే సిబ్బంది ఎప్పుడూ ఉంటారు. ఏది ఏమైనా ప్రతి ఉద్యోగికీ వేరుగా బల్ల వేయాల్సిన అవసరముండదు. 2020 కల్లా ప్రతి పదిమంది సిబ్బందికి ఏడు బల్లలు వేస్తే సరిపోతుంది. అంటే పరిమిత స్థలంలోనే మునుపటికన్నా ఎక్కువ పని నడుస్తుందన్న మాట. మున్ముందు దాదాపు 64 శాతం సిబ్బంది ఇంటి నుంచో, ఇతర చోట్ల నుంచో ఆఫీసు పనులు చేస్తారని అంచనా. ఇంకా అనేక మంది ప్రాజెక్టు స్థలాల్లో, ఖాతాదారుల ఆఫీసులలో, భాగస్వాముల కార్యాలయాలలో కూర్చుని పనిచేస్తారు. మొత్తంమీద కార్యాలయాలు కళాశాల ప్రాంగణాలను తలపించినా ఆశ్చర్యం లేదు. ఆంక్షలు, అరమరికలు లేకుండా అంతా కలసిమెలసి పనిచేసుకునే ప్రాంగణ వాతావరణం ఆఫీసుల్లోనూ వెల్లివిరియనుంది. ఉద్యోగులు ఆఫీసుల్లో కాక ఎక్కడెక్కడి నుంచో పనిచేయబోతున్నారు కనుక వారికి కావలసిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడానికి కంపెనీలు తగు ఏర్పాట్లు చేసుకోనున్నాయి. సహస్రాబ్ది తరాన్ని సృజనశీలంగా, ఉత్సాహంగా పనిచేసే సిబ్బందిగా తీర్చిదిద్దడానికి కంపెనీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మారుతున్న కాలానికి తగ్గట్టు తమనుతాము మలచుకోవాలి. సిబ్బందికీ సంస్థకూ ప్రయోజనకరమైన పని వాతావరణాన్ని సృష్టించుకున్న 80 శాతం కంపెనీలు 30 నుంచి 40 శాతం వరకు ఖర్చులు తగ్గించుకొని, చేసిన వ్యయానికి తగిన ఫలితాలు పొందాయని మెకిన్సే సర్వే నిర్ధారించింది.

- డాక్టర్ కె.బాలాజీ రెడ్డి

వసంత పంచమి

మాఘ శుద్ధ పంచమిని 'వసంత పంచమి'గా వ్యవహరిస్తారు. రుతు సంబంధమైన పండుగ కావడంతో, దీనికి ఆ పేరు వచ్చింది. ఈ పర్వదినాన్ని శ్రీపంచమి, మదన పంచమి, సరస్వతీ జయంతి అనే పేర్లతోనూ పిలుస్తారు. మకర సంక్రాంతి తరవాత, వసంత రుతువు లక్షణాలు ప్రకృతిలో కనిపిస్తాయి. చెట్లు చిగురించడం, పూలు పూయడం వంటి శుభ సంకేతాలు ఇదే రుతువులో ఆరంభమవుతాయి. వసంతుడికి ఆహ్వానం పలుకుతూ ప్రకృతి కాంత శోభాయమానంగా విరాజిల్లుతుంది.

వసంతం అందరికీ ఎనలేని ఆనందం కలిగిస్తుంది. హరి పూజ, నూతన వస్త్రధారణను విధులుగా భావిస్తారు. రంగులు చల్లుకుంటారు. కొత్త ధాన్యం వచ్చే రోజులు కాబట్టి, బియ్యంతో పాయసం వండి నైవేద్యం పెడతారు. ఈ వసంత పంచమిని రాజస్థాన్‌లో విశేషంగా ఆచరిస్తారు. వంగ దేశంలో శ్రీ పంచమి పేరుతో నిర్వర్తిస్తారు. సరస్వతి జన్మించిన రోజుగా భావించి, ఆ దేవిని భక్తి ప్రపత్తులతో కొలుస్తారు. గ్రంథాలను ఆ ప్రతిమ దగ్గర ఉంచి, పూజించి, సాయంకాలం ఊరేగింపుగా వెళ్లి జలాశయంలో నిమజ్జనం చేస్తారు.

ప్రాచీన కాలంలో రోమనులు సైతం ఈ ఉత్సవం జరిపేవారని చరిత్ర చెబుతోంది. 'బ్రహ్మ వైవర్త పురాణం' వసంత పంచమినాడే సరస్వతిని పూజించాలంటుంది.

రతీదేవికి, కామదేవుడికి, వసంతుడికి పూజలు చేస్తారు. ముగ్గురూ ఒక్కరోజునే పూజలందుకుంటారు.

వసంతోత్సవాల్ని వేర్వేరు పేర్లతో, పలు విధాలుగా ఆచరిస్తుంటారు. ఇది శీతకాలానికి, వేసవి కాలానికి సంధికాలం కావడంతో ప్రజలకు ఈ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కొత్త పంటలు వచ్చే కాలం ఇది. పశువులకు గ్రాసం పుష్కలంగా లభిస్తుంది. 'కృత్యసార సముచ్చయం' లో వసంత పంచమి గురించిన సమగ్ర విశ్లేషణ ఉంది.

చైత్ర-వైశాఖాల్లో వచ్చే వసంతుడికి మాఘ-ఫాల్గుణ మాసాల్లోనే స్వాగతోపచారాలు మొదలవుతుండటం బట్టి ఈ పంచమి ప్రాముఖ్యం, వైశిష్ట్యం అందరికీ అవగతమవుతుంది. అంటే, శిశిర రుతువే వసంత రుతువుకు పరమానందంతో స్వాగతం చెబుతోందన్న మాట!

వసంత పంచమినాడే సరస్వతీ జయంతి కావడంతో, ఈ పర్వదినం అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. అక్షరానికి ఆమె అధిదేవత. ప్రణవ స్వరూపిణి, జ్ఞానానంద శక్తి, లౌకిక-అలౌకిక విజ్ఞాన ప్రదాయిని ఆమె. శ్రీవాణి కృప లేకుంటే, లోకానికి మనుగడే లేదు. వాగ్దేవి ఉపాసన వల్ల వాల్మీకి రామాయణ రచన చేశాడంటారు. శారద దీక్ష స్వీకరించి, వ్యాసుడు వేదవిభజన చేయగలిగాడంటారు. ఆదిశేషువు, బృహస్పతి, ఆదిశంకరులు, యాజ్ఞవల్క్యుడు వంటి ఎందరో శారదానుగ్రహం కారణంగా జ్ఞాన సంపన్నులయ్యారు. వ్యాసుడు గోదావరీ తీరాన సైకతమూర్తి రూపంలో వాణిని ప్రతిష్ఠించాడని పురాణ కథనం. ఆ క్షేత్రమే వ్యాసపురిగా, బాసరగా ప్రసిద్ధి చెందింది.



అంతర్యామి

సరస్వతి శబ్దానికి 'ప్రవాహ రూపంలో ఉండే జ్ఞానం' అని అర్థం. వసంత రుతు శోభలకు వసంత పంచమి స్వాగతం పలుకుతుంది. శుద్ధ సత్వగుణ శోభిత సరస్వతి, శ్వేత వస్త్రాలంకృతగా హంసవాహినిగా తామర పుష్పం మీద కొలువుతీరి జ్ఞాన క్రతువు నిర్వహిస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

వేదాలు సరస్వతీ మాత నుంచే వెలువడ్డాయని 'గాయత్రీ హృదయం' గ్రంథం అభివర్ణించింది. సరస్వతీ నది అంతర్ముఖీనమై గంగ యమునలతో కలిసి 'త్రివేణి'గా విరాజిల్లింది. దేశ విదేశాల్లో గీర్వాణి ఆరాధనలందుకుంటోంది. సరస్వతీదేవి వద్ద ఆయుధాలుండవు. గ్రీకులు, రోమనులు ఆమెను జ్ఞానదేవతగా పూజిస్తారు. వసంత పంచమిని విద్యారంభ దినంగా పరిగణిస్తారు.

వసంత శోభను మహనీయులెందరో హృదయంగమంగా వర్ణించారు. సకల కళామయిగా సరస్వతిని కావ్యాల్లో స్తుతించారు. మార్కండేయ, స్కంద పురాణాలు; 'ధర్మసింధు' శ్రీవాణీ స్తుతిని రసరమ్యంగా వెలయించాయి.

- చిమ్మపూడి శ్రీరామమూర్తి

వారెవ్వా!

కరీంనగర్, సోమవారం జనవరి 22, 2018 ■ varevva@eenadu.in ఈనాడు

నులక మంచం యాబైవేలు



నులక మంచం ధర యాభైవేలా.. వేలాకోళమా అనుకోకండి. ఇది నులకల సాక్షిగా నిజం. మనం నులకమంచం ఎరా దాటి నవారు మంచం జమానాను వదిలేసి మరికాస్త ముందుకొచ్చాం. ఇప్పుడు మళ్లీ మన పాత కొత్తయింది. డేనియల్ బ్లూరే అనే ఓ ఆస్ట్రేలియన్ మన వారసత్వ సంపద అయిన నులకమంచాన్ని ఆన్‌లైన్‌లో అమ్ముతున్నాడు. మార్కెటింగ్‌లో భాగంగా ఇటీవలే ట్విటర్‌లో ఓ పాంప్లెట్‌నూ పోస్ట్ చేశాడు. 'ట్రెడిషనల్ ఇండియన్ బెడ్ చార్‌పాయ్ ధర 990 డాలర్లకు అమ్ముతున్నా. మంచం పొడవు(2100ఎమ్.ఎమ్), వెడల్పు(1130ఎమ్.ఎమ్), ఎత్తు(630ఎమ్.ఎమ్) ఉంటుంది. కంఫర్ట్ ఉండే ఈ మంచాన్ని కేవలం సిడ్నీ పరిసర ప్రాంతాల్లో హోమ్ డెలివరీ చేస్తాన'ని ఆ కరపత్రంలో రాసుంది. ఇది చూసి మనోళ్లు కోపంతో 'బ్లడీహెల్, మనకి సిగ్గుచేటు'.. అంటూ ట్వీట్ చేశారు. కొందరైతే మనదేశ మంచానికి ఇలా అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని ఆశ్చర్యపోతున్నారు.

విదేశీ విచిత్రం

ఈ నులకమంచాన్ని తయారు చేయాలని డేనియల్ బ్లూ ఎప్పుడూ అనుకోలేదు. రెండేళ్ల క్రితం ఆస్ట్రేలియా నుంచి పంజాబ్‌కి పనిమీద వచ్చాడు. పంజాబీ డాబాల దగ్గర భోజనానికి వెళ్లినపుడు అనుకోకుండా మంచంపై సేద తీరాడు. హాయిగా అనిపించిందతనికి. వెంటనే నులక మంచం గురించి ఆరాతీశాడు. మంచాలను అల్లే నిపుణుడి సాయంతో ఆర్నెళ్లు కష్టపడి నేర్చుకున్నాడు. ఆస్ట్రేలియాకు వెళ్లాక మంచం కోళ్లను బిగించి నులకను అల్లాడు. అలా నులక మంచానికి డేనియల్ బ్లూరే కేరాఫ్ అడ్రస్సయ్యాడు. 'వారంలో ఒక మంచాన్ని అల్లుతాను. చెక్క, నులక కలిపి తక్కువ ధర అయినా శ్రమ ఎక్కువ. అందుకే యాభైవేల ధరకు అమ్ముతున్నా'అంటాడు డేనియల్ బ్లూరే.

రంగుల కళ

'మక్తా'మనోహరం



హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉండే బస్తీ ప్రాంతం మక్తా. ఇక్కడి వీధుల్ని కొందరు స్ట్రీట్ ఆర్టిస్టులు వర్ణరంజితం చేశారు. ఇరుకైన గల్లీల ఇళ్ల గోడలపై పసుపుపచ్చ, గులాబీ, నీలం రంగులతో వేసిన వాల్‌పెయింటింగ్స్ అబ్బురపరుస్తున్నాయి. ఈ పెయింటింగ్స్‌ను చూడటానికి చాలామంది మక్తా బాట పడుతున్నారు. ఆ వీధుల్లో పిల్లల కోలాహలం రెట్టింపయ్యింది. ఆ గోడల దగ్గర సెల్ఫీలు తీసుకునేవాళ్ల సంఖ్య ఎక్కువైంది. పాతగోడలకు కొత్త వన్నెలద్దిన ఆర్టిస్టులను అందరూ మెచ్చుకుంటున్నారు. 'మక్తాకి కళొచ్చింది. అంతా వాళ్ల పుణ్యమే' అని మురిసిపోతున్నారు. మక్తా వీధులతో మొదలయ్యే ఈ వాల్ పెయింటింగ్స్ నెక్లెస్ రోడ్ దాకా మనల్ని తీసుకెళ్తాయి. గల్లీలకు సరికొత్త అందాన్ని ఇచ్చిన కళాకారులకు హ్యాట్సాఫ్ అంటున్నారు అంతా.





పాతికేళ్ల క్రితం మాట... బీటెక్ చదివితే చాలు బంగారం లాంటి భవిష్యత్తు, అమెరికాకు రెక్కలు కట్టుకుపోయే అవకాశం కాళ్ల ముందు..

అలాంటిది.. అతనికి చేతిలో బీటెక్‌పట్టానే కాదు, వెనకాల 160 ఎకరాల ఆస్తీ ఉంది.

అందుకే అందరిలానే కంప్యూటర్ సైన్స్ చదివి, విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం గురించి చాలా కలలు కన్నాడు. స్నేహితులంతా ఒకరి తర్వాత ఒకరు అమెరికా బాట పట్టేస్తుంటే నేను కూడా వస్తున్నా.. కొద్దిరోజుల్లోనే అనేవాడు. మరి ఏం జరిగింది...???





ఆస్తంతా కరిగించి.. ఆపన్నులను నడిపించి

ప్రస్తుతం ఓ మారుమూల పల్లెటూరు. మాసిన గడ్డంతో.. ఆధ్యాత్మిక చింతనతో.. సేవా భావంతో.. వికలాంగులకు సేవ చేసే వ్యక్తి జగదీష్‌బాబు. శ్రీగురుదేవ ట్రస్ట్ పేరుతో ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పోయిన వారికి ఉచితంగా కృత్రిమ అవయవాలు అమరుస్తూ మానవసేవలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లోని 25,000 కుటుంబాల్లో వెలుగులు నింపారు. జగదీష్‌బాబుది విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెం. అసలు అమెరికాకి వెళ్లిపోవాలనుకున్న అతను అవయవ దానకర్ణుడిగా ఎలా మారిపోయాడు, అతని జీవితం ఇలాంటి మలుపెందుకు తిరిగింది? అనే ప్రశ్నలకు సమాధానాలు ఆయన మాటల్లోనే...

'జీవితం మన చేతుల్లో ఉన్నట్టే ఉంటుంది.. కాని ఉండదు. ఇదే నిజం.. జీవితంలో ఊహించని మలుపుల్ని దాటక తప్పదు. మాది జమిందారీ వంశం. మా తాతల కాలం నాటికి సుమారుగా 160 ఎకరాల భూముండేది. అమ్మా, నాన్నలిద్దరికీ దైవభక్తి ఎక్కువ. దాంతో ఇంట్లో ఎప్పుడూ ఆధ్యాత్మిక వాతావరణం ఉండేది. ఆ వాతావరణం నుంచి బయటపడటానికేమో.... బాగా చదువుకోవాలి, అమెరికాలో మంచి ఉద్యోగం సంపాదించాలనుకునేవాడిని. బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటరు సైన్స్‌లో ఇంజినీరింగు పట్టా పుచ్చుకున్నా. వీసా కూడా సిద్ధం అయ్యింది. అలాంటి సమయంలో నాకో ఫోన్ కాల్. ఏటా పుణ్యక్షేత్రాలకు వెళ్లివచ్చే నాన్నగారు తిరిగి రాలేదనేది దాని సారాంశం. అదే సమయంలో అమ్మకు క్యాన్సర్. ఎంత పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లినా ఆమె బతకడం కష్టమనేవారు. లక్షల్లో ఖర్చు. స్థిరాస్తులున్నా... చేతిలో అంత డబ్బుండేది కాదు. తెలిసినవారు మొదట్లో స్పందించినా తర్వాతర్వాత ఎవరూ పలకరించేవారే కాదు. అమ్మమాత్రం "నాన్నా.. బాధపడకు.. బాగున్నప్పుడు అందరూ పక్కనుంటార్రా. కష్టాల్లో ఉన్నప్పుడు వెంట ఉన్నవాళ్లే నిజమైన ఆత్మీయులు" అంది. మొత్తానికి అమ్మ ఆరోగ్యం కుదుటపడింది. క్యాన్సర్‌ని జయించింది. కానీ అమ్మ మాటల్లో అసలు అర్థం అప్పుడే తెలిసింది. ఇంత ఆస్తి ఉన్న నా పరిస్థితే ఇలా ఉంటే పేదరికంలో ఉండేవారికి కష్టాలొస్తే ఎవరు ఆదుకుంటున్నారన్న ప్రశ్న నాలో నాటుకుపోయింది. దాంతో అమెరికాని పక్కన పెట్టేశాను. పేదవారి కోసం ఆలోచించడం మొదలుపెట్టాను.



ఆఖరికి మిగిలేది ఆరడుగుల నేలేగా

'దేశం వదిలిపోవాలనుకున్న నేను ఇప్పుడు ఇక్కడ ఇలా ఉన్నానంటే నాకే ఆశ్చర్యం అనిపిస్తుంది. నా ప్రయాణంలో అన్నిటికంటే ముఖ్యమైంది అమ్మ చెప్పిన మాటలు. ఎకరాలకు ఎకరాలు అమ్మేసినా ఆమె ఏమీ అనలేదు. సేవా కార్యక్రమాలకే కదా చేస్తున్నావు మంచిదే అని ప్రోత్సహించింది. ఎంత దాచాలని ప్రయత్నించినా చివరికి మిగిలేది ఆరడుగుల నేలేగా'..

– రాపర్తి జగదీష్‌బాబు, వ్యవస్థాపకుడు, శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్

ఏకధాటిగా ఏడ్చిన తరుణం...



స్వామి సుఖబోధానంద సూచనలతో సేవకి నాంది పలికారు జగదీష్. వారసత్వంగా సంక్రమించిన ఆస్తుల్ని అమ్మేసి వచ్చిన డబ్బుతో పాఠశాలలు, కళాశాలలు, సేవా సంస్థలకు ఆర్థిక సాయం అందించడం మొదలుపెట్టారు. అదే సమయంలో జగదీష్‌బాబు స్నేహితుడు రాజశేఖర్ రహదారి ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్నారు. అతనికి జైపూర్ తీసుకెళ్లి కృత్రిమ కాలు వేయించాలనుకున్నా వీలవ్వలేదు. రాజశేఖర్ జైపూర్ సొంతంగా వెళ్లే ప్రయత్నంలో రైలు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయారు. అది జగదీష్‌బాబుని కలచివేసింది. ఎక్కడ వికలాంగులు కనిపించినా తన స్నేహితుడే గుర్తొచ్చి ఏడ్చేసేవారు. అదే సమయంలో ప్రమాదాల్లో కాళ్లు, చేతులు కోల్పోతున్న వికలాంగులు పడే అవస్థలేంటో తెలుసుకున్నారు. కృత్రిమ కాలో, చెయ్యో అమర్చుకోవాలనుకున్నా దానికయ్యే వ్యయం భరించలేక వేలాది మంది అలాగే ఉండిపోతున్నారని తెలుసుకున్నారు. పైగా ఎక్కడో హైదరాబాద్, కటక్(ఒడిశా), జైపూర్(రాజస్థాన్)ల్లో మాత్రమే కృత్రిమ అవయవాలు అమర్చే కేంద్రాలుండడంతో అక్కడి వరకూ వెళ్లలేక వికలాంగులు పడే కష్టాలు చూసి తాను సేవ చేయాల్సింది వారికేనని నిర్ణయించుకున్నారు.

మిత్రుడి మరణంతో మరో కుదుపు...

మొదట్లో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే వికలాంగులకి మనోధైర్యాన్నిచ్చి దగ్గరుండి హైదరాబాద్ తీసుకెళ్లి కృత్రిమ అవయవాలు వేయించేవారు. ఆ క్రమంలోనే అక్కడ పనిచేసే నళినేష్‌బాబు అనే కృత్రిమ అవయవాలు అమర్చే ఉద్యోగితో పరిచయమైంది. ఆయన కూడా వికలాంగుడే. కానీ కృత్రిమ అవయవాల తయారీలో రాష్ట్రపతి అవార్డు అందుకొన్న గొప్పవ్యక్తి. ఆయన చొరవతోనే మంగళపాలెంలో క్యాంపులు పెట్టి హైదరాబాద్‌లో అవయవాలు తయారుచేసి తెచ్చి బిగించడం మొదలుపెట్టారు. 2004లో నళినేష్‌బాబు సూచనతో అదే ఊర్లో ఒక అవయవ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అలా శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్‌కి శ్రీకారం చుట్టారు. సేవలు విస్తరిస్తున్న సమయంలో నళినేష్‌బాబు గుండెపోటుతో చనిపోయారు. గిట్టనివారు 'ఇంకేముంది అవయవాలు తయారుచేసేవాడే లేడు.. ఇక ట్రస్టు మూసేస్తారు'... అన్న మాటలు బాణాల్లా విసిరారు. అయినా సరే.. వికలాంగులకు అందించే సేవలు కొనసాగించి తీరాలన్న సంకల్పంతో మరో టెక్నీషియన్‌ని నియమించుకుని స్వయంగా అవయవ తయారీని తిరిగి ప్రారంభించారు జగదీష్. ఆ సమయంలో ప్రస్తుత సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కె.వి.చౌదరి ఓ సారి సంస్థను సందర్శించి జగదీష్ చేస్తున్న సేవకు ముగ్ధులై వెన్నుదన్నుగా నిలబడ్డారు. అక్కడి నుంచి ప్రముఖ కార్పొరేట్ సంస్థలు సైతం తమ వంతు సహకారం అందించడం మొదలెట్టాయి.

వేలమందికి ఊతకర్ర....

శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఒక్క ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకే పరిమితం కాకుండా తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల్లో సైతం క్యాంపులు నిర్వహించి కృత్రిమ అవయవదానం చేస్తోంది. ఇప్పటికి దేశవ్యాప్తంగా పాతికవేలమది వికలాంగులకు కాళ్లు, చేతులు, బ్లైండ్ స్టిక్స్, మూడు చక్రాల సైకిళ్లు, పోలియో కాలిపర్స్ వంటి కృత్రిమ అవయవాలు ఉచితంగా తయారు చేసిచ్చి వారందరికీ జగదీష్‌బాబు ఊతకర్రగా మారిపోయారు. తన వద్దకు వచ్చినవారు ఎక్కడున్నా ఎప్పటికప్పుడు వారి యోగక్షేమాలు తెలుసుకుని వారి కుటుంబాన్ని పోషించుకోవడానికి సైతం ఆర్థికంగా సహకరిస్తారాయన.

- జి.వి.వి సత్యనారాయణరెడ్డి, ఈనాడు విజయనగరం

దర్గాలో వసంత పంచమి

సామరస్యం



వసంత పంచమి ఉత్సవాలు హిందూ దేవాలయాల్లో ఘనంగా జరగడం మామూలే! సరస్వతి పూజ, సంగీత వాయిద్యాలు, పుస్తకాలకు పూజ చేయడం ఆనవాయితీ.

అచ్చం అలాగే కాకున్నా... ఇదేరోజు దిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో సూఫీ వసంత పంచమి వేడుకలు జరుగుతాయి. ఇది ఇప్పటి ఆచారం కాదు. దాదాపు ఏడువందల సంవత్సరాలుగా జరుగుతున్నదే. అదే స్ఫూర్తితో మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ దర్గాలోనూ సూఫీ వసంత పంచమి ఉత్సవాలు జరుగుతున్నాయి.

పరమత విశ్వాసాలను, పండగలను గౌరవించడం.. హైదరాబాద్ నగర సామరస్య జీవనానికి ప్రతీక. చార్మినార్ సమీప పత్తర్‌గట్టీ ఉర్దూ గల్లీలోని హజ్రత్ షేక్‌జీ హాలీ అబుల్ ఉలాయి దర్గాలో సూఫీ వసంతపంచమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ దర్గా ప్రధాన నిర్వాహకుడు (సజ్జాదా నసీన్), అఖిలభారత మర్కజీ మజ్లిస్ ఏ చిస్తీ ప్రధాన కార్యదర్శి హజ్రత్ ముజఫర్‌అలీ సూఫీ చిస్తీ ఆధ్వర్యంలో తొలిసారి 2015లో ఈ వేడుకలు జరిగాయి. మైఫిల్ ఏ నిజామి (ఖవ్వాలీ) గీతాలను ఎంతో శ్రావ్యంగా వినిపించే కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం (22వ తేదీ) దర్గాలో సూఫీ వసంతపంచమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్గా హాలులో రంగురంగుల దీపాల జుమ్మర్లను అలంకరించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారం అందిస్తోంది.

12వ శతాబ్దం నుంచే

భారతీయ ముస్లింలు వసంత పంచమి పర్వదినాన్ని భక్తి ప్రపత్తులతో జరపుకోవడం 12వ శతాబ్దంలోనే ఆరంభమైంది. దిల్లీలో సూఫీ ప్రబోధకుడైన హజ్రత్ నిజాముద్దీన్ హయంలో ఈ సంప్రదాయానికి దర్గాలో శ్రీకారం చుట్టారు. మత గురువైన నిజాముద్దీన్ శోకం నుంచి తేరుకోవడానికి అతని శిష్యుడు ప్రముఖ కవి, సితార్ సంగీత విద్వాంసుడు అమీర్‌ఖుస్రో తొలిసారి ఈ కార్యక్రమాలు నిర్వహించారని చెబుతారు. మేనల్లుడి హఠాన్మరణంతో దిగులుగా ఉన్న నిజాముద్దీన్‌ను ఆ బాధ నుంచి బయటకు తీసుకురావాలని అమీర్‌ఖుస్రో వీటిని నిర్వహించారట. అజ్మీర్ దర్గా, దిల్లీలోని హజ్రత్ కుతుబుద్దీన్ ఏ భక్తియార్ పేహరోలి కుతుబ్ దర్గా, పాకిస్థాన్‌లోని హజ్రత్ షరీఫ్‌గంజ్ శక్కర్ పాక్‌పటాన్‌లోనూ సూఫీ వసంతపంచమి కార్యక్రమాలు జరుగుతాయి. ఈ పరంపరలో సామరస్యతను చాటేలా తొలిసారి 2015లో పత్తర్‌గట్టీలోని దర్గాలో ఉత్సవాలు మొదలుపెట్టారు.

– కంభోజు రమేశ్, న్యూస్‌టుడే, చార్మినార్



మూడేళ్లుగా...

సూఫీ సందేశాలను ప్రచారం చేసే గురువు హజ్రత్‌షేక్ జీహలీ అబుల్ ఉలాయి రెండు వందల ఏళ్ల కిందట రాజస్థాన్ నుంచి హైదరాబాద్ వచ్చారు. ఆయన పత్తర్‌గట్టీ ఉర్దూ గల్లీలో పాలరాతితో ఈ దర్గాను నిర్మించారు. సూఫీ సామరస్య సందేశాలను అందించే ఈ దర్గాను వంశపారంపర్యంగా ప్రస్తుతం హజ్రత్‌మహ్మద్ ముజఫర్ అలీ చిస్తీ అబుల్ ఉలాయి నిర్వహిస్తున్నారు. సామరస్యతను చాటిన అమీర్‌ఖుస్రో వసంత పంచమి, సంగీత వాయిద్యాలపై రాసిన కవితలు, పాటలు పత్తర్‌గట్టీలోని దర్గాలోనూ ఆలపిస్తారు.

కంచాల బ్యాంక్



పెళ్లి, పేరంటం, పూజ... కిట్టీ పార్టీ సందర్భం ఏదైనా పేపర్‌ప్లేట్‌లో తిండి, ప్లాస్టిక్ గ్లాసులో నీళ్లు మాత్రం సాధారణం. దాంతో రోజురోజుకి కొండలా పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి చెప్పలేనంత హాని చేస్తున్నాయి. ఈ పరిస్థితుల నుంచి నగరాన్ని కాపాడ్డానికి బెంగళూరులో 'ప్లేట్ బ్యాంకులు' వెలుస్తున్నాయి. ఒకసారి తిని పారేసే ప్లాస్టిక్ డిస్పోజబుల్ కట్‌లరీ స్థానంలో మళ్లీమళ్లీ ఉపయోగించే పాత్రలని ఈ ప్లేట్ బ్యాంకులు అద్దెకు ఇస్తున్నాయి. ఇవి వివిధ సందర్భాలకు స్టీల్ కంచాలు, గ్లాసులు, చెంచాలు అద్దెకిచ్చి.. తిరిగి తీసుకుంటాయి. రెంట్ ఎ కట్‌లరీ సంస్థను స్థాపించిన లక్ష్మీశంకరన్, రిషితా శర్మలు.. స్థానికంగా జరిగే వినాయక చవితి పూజలకు, పెళ్లిళ్లలకు, పూజా కార్యాక్రమాలకు, కార్పొరేట్ సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు కంచాలు, గ్లాసులు, చెంచాలని ఉచితంగా అందిస్తారు. 'పునర్వినియోగం చేయగలిగే వస్తువుల వల్ల.. టన్నుల కొద్దీ వ్యర్థాలు చెత్తగా మారి భూమికి భారం కాకుండా చూస్తున్నాం. అలానే నీటివనరులని కూడా ఆదాచేస్తున్నాం. ఎలా అంటారా? ఒక చిన్న ప్లాస్టిక్ కంచాన్ని తయారుచేయాలన్నా కూడా పదిలీటర్ల నీటిని వినియోగిస్తారు' అంటున్నారు ఈ ప్లేట్ బ్యాంకు నిర్వాహకులు. మరికొన్ని సంస్థలయితే... కొంత అద్దె తీసుకుని చేస్తున్నాయి.

ఈనాడు సినిమా



కాజల్

అందుబాటులోనే నా ఆనందం

చిన్న విషయాల్లోనే సంతృప్తిని వెతుక్కోవడం అలవాటైందని చెబుతోంది కాజల్. దక్షిణాదిన అగ్ర కథానాయికగా కొనసాగుతున్న ఆమె, వృత్తిపరంగా ఎంత పోటీ ఎదురవుతున్నా నేటికీ తన జోరును చూపిస్తోంది. ప్రస్తుతం తెలుగులో కల్యాణ్‌రామ్‌తో కలిసి 'ఎమ్.ఎల్.ఎ'లో నటిస్తోంది. నాని నిర్మిస్తున్న 'అ'లోనూ కీలక పాత్ర పోషించింది. విరామం లేకుండా ఏకధాటిగా పనిచేశాక, ప్రశాంతత కోసమని నచ్చిన ప్రదేశాలకి వెళ్లే కథానాయికల్ని చాలామందినే చూస్తుంటాం. మీరూ అంతేనా అని కాజల్‌ని అడిగితే ఆసక్తికర సమాధానం ఇస్తోంది. "నా ఆనందాలన్నీ అందుబాటులోనే ఉంటాయి. కచ్చితంగా ఫలానా ప్రదేశానికి వెళ్తేనే సంతోషంగా ఉంటుందనేమీ లేదు. ఇంటికి వెళ్లి కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆ తర్వాత అక్కడే నచ్చిన సినిమా చూసేసి, మళ్లీ సాయంత్రం స్నేహితులకి కాల్ చేసి బయటికి బయల్దేరామంటే చాలు. ఇంకేదీ గుర్తుండదు. అలాఅని విహారం కోసం విదేశాలకి వెళ్లనని కాదు. అక్కడో రకమైన ప్రశాంతత, ఆనందం అంతే. వేరే రంగాలతో పోలిస్తే సినిమా భిన్నం. పతాక స్థాయి సృజనాత్మకత ఇక్కడ కనిపిస్తుంటుంది. ఒప్పుకొన్న సినిమాల కోసం కొన్నిసార్లు నిర్విరామంగా పనిచేయాల్సి వస్తుంది. కొన్ని కథలు, చేసే పాత్రలు నిద్రలోనూ వెంటాడుతుంటాయి. ఆ ఒత్తిడి నుంచి అప్పుడప్పుడు బయటికి రావల్సిందే. అలాంటి సందర్భాల్లోనే నాకు నచ్చిన పనులన్నీ చేస్తుంటా. అంతే తప్ప ప్రశాంతత, సంతోషం కోసమని ప్రతిసారీ ప్రత్యేకంగా ఖరీదైన కలలు కనను" అని చెప్పుకొచ్చింది కాజల్.

ఆస్కార్ కోసం ప్రియాంక



బాలీవుడ్ నుంచి హాలీవుడ్‌కు వెళ్లి సత్తా చాటుతున్న ప్రియాంక చోప్రా మరో ఘనత సాధించింది. ఈ ఏడాదికిగానూ ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల కోసం నామినేషన్లను ప్రకటించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. హాలీవుడ్ తారలు రొసారియో డాసన్, మిషెల్ రొడ్రిగజ్, రెబెల్ విల్సన్‌లతో కలసి ప్రియాంక మంగళవారం నామినేషన్లను ప్రకటించనుంది. ఈ విషయాన్ని ఆస్కార్ అకాడెమీ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అధికారికంగా ప్రకటించింది. గతేడాది ఆస్కార్ వేడుకలో రెడ్ కార్పెట్‌పై నడిచి అలరించింది ప్రియాంక. ఇప్పుడు ఈ అవకాశం ఆమెకు దక్కడం హాలీవుడ్‌లో ఆమె హవాకు నిదర్శనంగా నిలిచింది. జిమ్మీ కెమ్మెల్ ప్రయోక్తగా 90వ ఆస్కార్ వేడుక మార్చి 4న జరగనుంది. ప్రస్తుతం ప్రియాంక 'క్వాంటికో' టీవీ సిరీస్‌తో పాటు మరో రెండు హాలీవుడ్ చిత్రాలతో బిజీగా గడపుతోంది.



రవీందర్, ప్రమోద్, విక్కీ, అశోక్, అనుష్క, మనోజ్ పరమహంస, అల్లు అరవింద్, నాని

నేను తప్ప ఎవరు చేసినా బాధపడేదాన్ని

అనుష్క ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకుడు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. ఈనెల 26న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా అనుష్క మాట్లాడుతూ "2012లో ఈ కథ విన్నా. ఇన్నేళ్ల పాటు దర్శకుడు, నిర్మాతలు నా కోసం ఎదురుచూశారు. నేను కాకుండా వేరే ఎవరైనా ఈ సినిమా చేసుంటే నేను బాధ పడేదాన్ని. ఎందుకంటే నా మనసుకి అంత దగ్గరైన కథ ఇది. ఇది కేవలం అనుష్క సినిమా అని చెప్పను. చాలా పాత్రలు ఉన్నాయి. ప్రతి పాత్రకీ స్థానం ఉంది. ఈ కథని ఈ స్థాయిలో తీసుకురావడానికి సాంకేతిక నిపుణులు కారణం. వాళ్ల కృషి తెరపై కనిపిస్తుంద"న్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "ట్రైలర్ చూడగానే భయం వేసింది. తప్పకుండా పెద్ద సినిమా అవుతుందనిపిస్తోంది. చిత్రసీమలో ఎవ్వరికీ లేనంత ఓపిక అనుష్కకి ఉంది. తాను బొమ్మాళీగా ఎంత పేరు తెచ్చుకుందో 'భాగమతి' కూడా అంతే పేరు తెస్తుంద"న్నారు. నాని మాట్లాడుతూ "ఈ ఏడాది అన్ని అవార్డులూ అనుష్కకి దక్కుతాయని అనిపిస్తోంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. అశోక్‌ని ఇప్పటి వరకూ 'పిల్ల జమిందార్ అశోక్' అని పిలుస్తున్నారు. ఇప్పటి నుంచి 'భాగమతి అశోక్' అంటార"న్నారు. మారుతి మాట్లాడుతూ "చేసిన పని మాత్రమే మాట్లాడాలి అనుకునే నిర్మాతలు ఈ చిత్రానికి దొరికారు. దర్శకుడు తీసుకొచ్చిన కథకి పూర్తిగా న్యాయం చేసే సంస్థ యూవీ క్రియేషన్స్. ఈ కథపై రెండు మూడేళ్లుగా ప్రయాణం చేస్తున్నారు. దానికి తగిన మంచి టీమ్ కుదిరింది. చాలా రోజుల తరవాత అనుష్క పూర్తి స్థాయి ప్రదర్శన ఈ చిత్రంలో చూడొచ్చనిపిస్తోంద"న్నారు. అశోక్ మాట్లాడుతూ "గెలవాలనుకున్నప్పుడు కష్టం మొదలవుతుంది.. ఎలాగైనా గెలవాలనుకుంటే మోసం మొదలవుతుంది. తాను గెలుస్తూ.. గెలిపించాలన్న తపన ఉన్న వ్యక్తి ప్రభాస్. ఈ కథ ముందుగా విన్నది ప్రభాస్. ఈ కథని ఇక్కడి వరకూ నడిపించడానికి కారణం ప్రభాస్. నిర్మాతలు వంశీ, ప్రమోద్, విక్కీ త్రిమూర్తుల్లా కనిపించారు. సినిమాని ఓ బిడ్డలా చూసే నిర్మాతలు వీళ్లు. ఈ కథకు అనుష్క ప్రాణ ప్రతిష్ఠ చేసింది. భాగమతి బంగ్లా కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించింది. అంత పెద్ద సెట్ వేసిన కళా దర్శకుడు రవీందర్ కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించినట్టు లెక్క" అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు రవీందర్, మేర్లపాక గాంధీ, ప్రభాస్ శీను, ధనరాజ్, మనోజ్ పరమహంస తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికీ నచ్చింది



'మనసుకి నచ్చింది'లో సందీప్‌కిషన్, అమైరా దస్తూర్

సందీప్‌కిషన్, అమైరా దస్తూర్, త్రిధా చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. సంజయ్ స్వరూప్, పి.కిరణ్ నిర్మాతలు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 16న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ప్రేక్షకుల్లో ఒక కొత్త అనుభూతిని నింపే చిత్రమిది. తాజాదనంతో కూడిన కథ, సన్నివేశాలు, రాధన్ సంగీతం చిత్రానికి ప్రధానబలం. ప్రేక్షకులకు మంచి సినిమా చూశామనే తృప్తిని కలగజేస్తుంది. ఒక ప్రేమ జంటకి ఏం నచ్చింది? ఏం చేశారనే విషయాల్ని తెరపైనే చూడాలి" అన్నారు. ప్రియదర్శి, పునర్ణవి భూపాలం, నాజర్, అరుణ్ ఆదిత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కూర్పు: సతీష్ సూర్య, కళ: హరి వర్మ, ఛాయాగ్రహణం: రవియాదవ్, సంభాషణలు: సాయి మాధవ్ బుర్రా.



తమన్, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, రాశీ ఖన్నా, వెంకీ అట్లూరి, వరుణ్‌తేజ్, అల్లు అరవింద్, ప్రియదర్శి, దిల్ రాజు, భోగవల్లి బాపినీడు

తొలి ప్రేమ... గీతాలాపన

"ఈ సినిమాకి 'తొలి ప్రేమ' అనే టైటిల్ పెడదామంటే ముందు భయపడ్డాను. ఆ టైటిల్ అంటే నాకు చాలా ఇష్టం. కానీ ఏమైనా తేడా వస్తే ఏమవుతుందో నాకు తెలుసు. కానీ.. ఈ చిత్రాన్ని అందరి అంచనాలకు తగ్గట్టుగా దర్శకుడు తెరకెక్కించాడ"న్నారు వరుణ్ తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'తొలి ప్రేమ'. రాశీ ఖన్నా కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మాత. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు హైదరాబాద్‌లో విడుదలయ్యాయి. తొలిసీడీని అల్లు అరవింద్ ఆవిష్కరించారు. దిల్‌రాజు స్వీకరించారు. అనంతరం వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "లోఫర్', 'ఫిదా' సినిమాలకంటే ముందే ఈ కథ విన్నా. చాలా బాగా నచ్చింది. సినిమా చూశా. ఎవ్వరినీ నిరాశ పరచదు. సాధారణంగా నా పక్కన నటించడానికి కథానాయికల్ని వెదికి పట్టుకోవడం కష్టం. ఎందుకంటే నా ఎత్తుకి ఎవరూ సరిపోరు. కానీ రాశీఖన్నా చక్కగా కుదిరింద"న్నారు. "పరిశ్రమలోకి వచ్చిన కొత్తలో దిల్‌రాజు ప్రోత్సాహం అందించారు. నాపై నేను నమ్మకం కోల్పోతున్న తరుణంలో వరుణ్‌తేజ్ ధైర్యాన్ని ఇచ్చారు. తమన్ సంగీతం తప్పకుండా ఆకట్టుకుంటుంది. అందాల భామగా రాశీ ఖన్నాని ఇది వరకే చూశారు. ఇప్పుడు తనలోని నటిని చూస్తార"న్నారు దర్శకుడు. "పవన్ కల్యాణ్‌కి 'తొలిప్రేమ' ఎంత మంచి విజయాన్ని అందించిందో, వరుణ్‌కి ఈ 'తొలిప్రేమ' అలాంటి ఆనందాన్ని కలిగించాలి. రెండో సినిమా నుంచే.. తనకు నచ్చిన కథల్ని ఎంచుకుని ప్రయాణం చేస్తున్నాడు వరుణ్. తమన్ చాలా చక్కని సంగీతాన్ని అందించాడ"న్నారు అరవింద్. దిల్‌రాజు మాట్లాడుతూ "చాలా చక్కటి కథ ఇది. మా సంస్థలోనే తెరకెక్కించాల్సింది. కానీ కుదర్లేదు. వరుణ్‌తేజ్ - రాశీ ఖన్నాల మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింద"న్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, ప్రియదర్శి, భోగవల్లి బాపినీడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ సూటు...అదిరేట్టు

బాలీవుడ్ యువ కథానాయకుల్లో ఫ్యాషన్ ఐకాన్ ఎవరంటే రణ్‌వీర్ సింగ్ పేరే గుర్తొస్తుంది. తెర మీదే కాదు.. సినిమా వేడుకల్లోనూ తనదైన శైలి వస్త్రధారణతో ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంటాడాయన. తాజాగా ముంబయిలో జరిగిన ఫిలింఫేర్ వేడుకలోనూ ఓ సరికొత్త డ్రెస్‌లో సందడి చేసి తన అభిరుచిని చాటుకున్నాడు. 80, 90 దశకాల్లో వచ్చిన బాలీవుడ్ సూపర్‌హిట్ చిత్రాల పోస్టర్‌లతో రూపొందించిన ప్రత్యేక సూట్ ధరించి వేదికపై అలరించాడు రణ్‌వీర్. చిన్నప్పట్నుంచి సినిమాలను, కథానాయకులను ఆరాధిస్తూ పెరిగిన రణ్‌వీర్, వారిపై తన గుండెల్లో ఉన్న అభిమానాన్ని గుడ్డగా మార్చి ఈ డ్రెస్ డిజైన్ చేయించుకున్నట్లుంది. 'దీవార్', 'రామ్ లఖన్', 'బాజీఘర్', 'ఘాయల్', 'ఆంఖే', 'వాస్తవ్' లాంటి అలనాటి చిత్రాల పోస్టర్‌లు రణ్‌వీర్ సూట్‌కు హంగులు తీసుకొచ్చాయి.

గీతోపదేశం

ఎంత ఎదిగినా ఒదగాలన్నది
చెట్టును చూసి నేర్చుకో
క్రమశిక్షణతో మెలగాలన్నది
చీమను చూసి నేర్చుకో
చిరునవ్వులతో బ్రతకాలన్నది
పువ్వును చూసి నేర్చుకో

గీతం: డోంట్‌కేర్...
చిత్రం: చెన్నకేశవరెడ్డి
రచన: చంద్రబోస్
- పంపినవారు: జఫరుల్లా ఖాన్, మహబూబ్‌నగర్

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

'దివ్య మణి' పాటలొచ్చాయ్!



కిమాయ, సురేష్ కమల్, అరుణ, యామిని కృష్ణమూర్తి, సాయికుమార్, బలభద్రపాత్రుని రమణి, గిరిధర్ గోపాల్

సురేష్ కమల్, వైశాలి, కిమాయ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'దివ్య మణి'. గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. స్టీవ్ శ్రీధర్‌తో కలిసి గిరిధర్ గోపాల్ స్వరాలు సమకూర్చారు. హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. ప్రముఖ నృత్యకారిణి యామిని కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై తొలి సీడీని విడుదల చేశారు. సురేష్ కమల్ మాట్లాడుతూ "యోగా నేర్పడం కోసం ప్రపంచమంతా తిరుగుతున్నప్పటికీ, నాకు ఈ తెలుగు నేలంటే ఎంతో ఇష్టం. గిరిధర్ మంచి కథని చెప్పారు. స్ఫూర్తిని నింపేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఇందులోని యాక్షన్ సన్నివేశాల్లో డూప్ లేకుండా నటించా" అన్నారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "పాటలు బాగున్నాయని మెచ్చుకొంటున్నారంతా. సినిమా అందరినీ అలరించేలా ఉంటుంది. ఈ సినిమా తర్వాత యామిని కృష్ణమూర్తి జీవిత చరిత్రని తెరకెక్కించబోతున్నాం" అన్నారు. "ఒక అద్భుతమైన కళని, ప్రతిభని చూడాలంటే 'దివ్యమణి' చూడాల్సిందే. సురేష్ కమల్‌తో పనిచేయడం మా అదృష్టమ"న్నారు రామ్‌లక్ష్మణ్. "నా భాష, నా మనుషుల మధ్య ఈ వేడుకని జరుపుకోవడం ఆనందంగా ఉంది. గిరిధర్ గోపాల్‌కి ఈ చిత్రంతో విజయం లభిస్తుంది" అన్నారు యామిని కృష్ణమూర్తి. కార్యక్రమంలో సాయికుమార్, బలభద్రపాత్రుని రమణి, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.



అభిషేక్‌తో తాప్సి



అభిషేక్‌బచ్చన్ గతేడాది ఒక్క చిత్రంలోనూ నటించలేదు. ఏడాది విరామం తర్వాత ఇప్పుడు తన కొత్త సినిమాను పట్టాలెక్కించబోతున్నాడు. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో.. మరో దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాప్సీ కథానాయికగా నటిస్తుండగా మరో ప్రధాన పాత్రలో విక్కీ కౌశల్ కనిపించబోతున్నాడు. అభిషేక్, తాప్సీ జంటగా నటించడం ఇదే తొలిసారి. ఈ సినిమాకు 'మన్ మర్‌జియాన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. చక్కని భావోద్వేగాలతో కూడుకున్న ఓ అందమైన ప్రేమ కథగా 'మన్‌మర్‌జియాన్' తెరకెక్కబోతున్నట్లు సమాచారం. ఫిబ్రవరి నుంచి పంజాబ్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుంది.

పంచ్ డైలాగ్

పేరు పెట్టి పిలిస్తే పిలుపు ఉంటుంది. బంధుత్వంతో పిలిస్తే బంధం ఉంటుంది!

చిత్రం: శతమానం భవతి
- పంపినవారు: పి.విజయ్‌గౌడ్, అవుకు, కర్నూలు



నిమ్మనీళ్లూ... యాపిల్‌ముక్కలు

ఇంట్లోకి రాగానే అగరుబత్తీ సువాసన లేదా పూల పరిమళం వస్తే.. ఆ హాయే వేరు కదా.. అయితే ఎప్పుడూ అవే కాదు.. అలాగని రూంఫ్రెషనర్లని వాడమనీ కాదు. మనకు అందుబాటులో ఉండే పదార్థాలతోనే ఇంటిని పరిమళభరితం చేయొచ్చు. అదెలాగో తెలుసుకోండి మరి.

◆ ఓ గిన్నెలో నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టి మరగనివ్వాలి. దానిలో రెండు నిమ్మచెక్కలు, రెండు చుక్కల యూకలిప్టస్ నూనె వేసి మరగనివ్వాలి. ఆ నీటి నుంచి వచ్చే సువాసన ఇల్లంతా వ్యాపిస్తుంది. అలాగే పెనంమీద రెండు దాల్చిన చెక్క ముక్కల్ని కూడా వేయించుకోవచ్చు.



◆ మరుగుతున్న నీళ్లలో దాల్చినచెక్కా, ఎండబెట్టిన యాపిల్ ముక్కలూ, కొద్దిగా లావెండర్ వేయాలి. ఆ నీళ్లు బాగా మరిగి సగం అయ్యాక గాజుసీసాలోకి తీసుకుని గదిలో ఎక్కడ పెట్టినా చాలు.

◆ అరోమా కొవ్వొత్తులది సువాసనల్లో ప్రత్యేక స్థానం. అందమైన ఆకృతుల్లో ఉండే వీటిని ఇంటి నలుమూలలా ఉంచితే ఆ హాయే వేరు. వీటిని వెలిగించి వార్డ్‌రోబ్‌కి దగ్గరగా ఉంచితే లెనిన్ వస్త్రాలు ఆ వాసనను పీల్చుకుని సువాసనలు వెదజల్లుతాయి.

◆ సహజమైన సువాసనలు అందించడంలో మొక్కలు ముందుంటాయి. ఇంటి లోపల తగినంత వెలుతురులోనూ పెంచుకోగలిగే జిరానియం, అరేబియన్ జాస్మిన్, గార్డేనియా, కోర్సేజ్ ఆర్కిడ్ వంటివి ఇల్లుని పరిమళభరితం చేస్తాయి.

అవకాశం వస్తే నిల్చోండి

మన దినచర్యలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే బరువు అదుపులో ఉండటమే కాదు.. శరీరానికి మంచి వ్యాయామం కూడా అందినట్లే. అదెలాగో చూద్దామా...

● బస్సు కోసమో, స్నేహితుల కోసమో ఎదురు చూస్తున్నపుడు ఎక్కడో ఒక చోట స్థలం చూసుకొని కూర్చుండిపోవద్దు. వీలైనంత ఎక్కువ సేపు నిలబడేలా చూసుకోవాలి. దీనివల్ల గంటకు యాభై కెలొరీలు ఖర్చవుతాయి. ఇదీ ఒక తరహా వ్యాయామమే.

● మనం తినే విధానంలో కూడా కాస్త మార్పు చేసుకుంటే ఫలితం ఉంటుంది. నెమ్మదిగా తినడం వల్ల మెదడు.. ఆకలి తీరిందనే సందేశాన్ని శరీరానికి పంపుతుంది. అదే గబగబా తినేస్తే అది సాధ్యం కాదు. పైగా అవసరానికి మించి ఎక్కువగా తినేస్తాం. అంటే అధిక కెలొరీలు పొట్టలో చేరినట్లే.



● నడకా, పరుగెత్తడం వంటి వాటికన్నా ఇంట్లో ఉండి తేలిగ్గా చేసే స్ట్రెచింగ్ తరహా వ్యాయామాలతోనూ కెలొరీలు ఎక్కువగా కరుగుతాయి. బయటికెళ్లడం వీలుకాకపోతే వీటినే కాస్త ఎక్కువ సేపు ఇంట్లో చేయడానికి వీలవుతుంది. చిన్న చిన్న అవసరాలకు బండీ, కారు వాడకుండా.. దగ్గర్లో ఏదైనా పనుంటే నడకకే ప్రాధాన్యం ఇచ్చి చూడండి. మార్పు మీకే తెలుస్తుంది.

స్నేహితురాలి పుట్టినరోజు పార్టీ.. డ్రెస్ ఒకే కానీ దానికి నిండుదనం రావాలంటే కొత్త హెయిర్‌స్టయిల్ ప్రయత్నించాలి.. జుట్టు వదిలేసుకుంటున్నప్పుడు స్ట్రెయిటనింగ్ చేయించుకుంటేనే అందం... అప్పుడప్పుడూ కర్లింగ్ చేయించుకోవడమే ఫ్యాషన్ తెలుసా... ఇదీ కేశాలంకరణకు సంబంధించి ఈతరం అమ్మాయిల ఆలోచన. ఆకట్టుకునేలా కనిపించడం మంచిదే కానీ.. అదే జుట్టు రాలిపోవడం నుంచీ మరికొన్ని సమస్యల్ని తెచ్చి పెడుతుంది. మరి వాటిని అధిగమించాలంటే ఏం చేయాలి.. మనం చేసే పొరపాట్లూ తెలుసుకోవాలి. సరిదిద్దుకునేందుకు ప్రయత్నించాలి.

ఫ్యాషన్ తెచ్చే పరేషాన్!



సాధారణంగా జుట్టు రాలిపోవడానికి, ఎండుగడ్డిలా కనిపించడానికి అనారోగ్య పరిస్థితులూ, పోషకాహార లోపం వంటివే కాదు... అతి శీతల, వేడి వాతావరణంతోపాటు పొడిగాలీ, బలమైన గాలులు కూడా కారణం అవుతాయి. వీటికితోడు స్టయిలింగ్ పేరుతో మనం చేసే మార్పులూ జుట్టుకు సమస్యలు తెచ్చిపెడతాయి. ముఖ్యంగా ఎలాంటి సమస్యలంటే...

రంగు వేసే ముందు...



ఫ్యాషన్‌గా కనిపించాలనుకున్నా...కొద్దిగా నెరసిన జుట్టును నల్లబరచాలనుకున్నా.. తరచూ రంగు వేసుకునే అలవాటును తగ్గించుకోవడం మంచిది. వీటిల్లో దాదాపు 5000 రకాల రసాయనాలు ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వాటిల్లో హానికరమైన పీపీడీ, అమ్మోనియా, హైడ్రోజెన్ పెరాక్సైడ్, ఆరోమాటిక్ అమైన్స్, కాస్మొటిక్స్ వంటివి మనకి హానికరం. వీటిని దీర్ఘకాలం వాడితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. దీనికి బదులు సహజంగా ఉండే గోరింటాకుని ఎంచుకోవడమే మేలు. లేదా అమోనియా లేని రంగుల్ని ఎంచుకోవడమే మంచిది.

తలస్నానం... రోజూనా?

తల జిడ్డుగా కనిపించకుండా ఉండేందుకు రోజూ షాంపూ పెట్టుకుంటారు కొందరు. అలా ఏ షాంపూలు పడితే అవి వాడితే మాడుపై ఉండే సహజనూనెలు పోయి జుట్టు ఎండుగడ్డిలా మారుతుంది. ఆ సంకేతాలు కనిపిస్తోంటే తక్కువ గాఢత, పీహెచ్ 5.5. ఉన్న నాణ్యమైన షాంపూను మాత్రమే ఎంచుకోవాలి. రోజు విడిచి రోజూ లేదా రెండు రోజులకోసారి చేయడం మంచిది. కనీసం వారంలో ఒకసారైనా స్వచ్ఛమైన కొబ్బరినూనెతో తలకు మర్దన చేసుకోవడం తప్పనిసరి. అలానే తలకి స్టయిలింగ్ కోసం జెల్స్ వాడేటప్పుడు కుదుళ్లకు తగలనివ్వకూడదు. తడిగా ఉన్నప్పుడే జుట్టు స్టయిలింగ్‌కి అనుకూలం అనుకుంటారు చాలామంది. దాంతో ఆరకుండానే ప్రయోగాలు చేస్తుంటారు. ఇది కూడా ఒకవిధంగా జుట్టుకు హాని చేయొచ్చు. అలానే మరీ జుట్టు అట్టలా ఉన్నప్పుడే స్టయిలింగ్ చేయకపోవడం మంచిది. ముందు జుట్టు పూర్తిగా ఆరనివ్వాలి. వెడల్పాటి పళ్లున్న దువ్వెనతో దువ్వుకోవాలి.

బ్లో డ్రయ్యర్ వాడుతున్నారా...

ఉరుకుల పరుగుల జీవితంలో తడి తలను సహజంగా ఆరబెట్టుకునే సమయం మనలో చాలామందికి ఉండదు. దీనికి తోడు ప్రతిరోజూ తలస్నానం చేసేవాళ్లు పెరగడంతో బ్లో డ్రయ్యర్‌ని ఉపయోగించే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే తలస్నానం చేసిన ప్రతీసారి దాన్ని వాడటం మాత్రం పొరపాటే. దాన్నుంచి వచ్చే వేడిగాలికి జుట్టు పొడిబారుతుంది. సహజంగా ఉండే మెరుపు తగ్గుతుంది. దాంతో చిట్లిపోయే అవకాశాలు ఎక్కువ. ఆ సమస్యలు లేకుండా ఉండాలంటే తడితలని కాస్త ఆరనిచ్చి అప్పుడు డ్రయ్యర్‌ని వాడితే మేలు. అలానే హీట్‌ప్రొటెక్షన్ స్ప్రేలు బజార్లో దొరుకుతాయి. వాటిని ఎంచుకోవడం మంచిది. హెయిర్ సీరమ్‌లలో ఉండే గ్లిజరిన్, ప్రొప్లీన్ గ్లైకాల్ వంటివి జుట్టు చిట్లకుండా రక్షణగా ఉంటాయి. ఒకవేళ తప్పనిసరిగా డ్రయ్యర్‌ని వాడాల్సి వస్తే... జుట్టుకు కాస్త దూరంగా ఉంచడం మంచిది. వేడి కూడా వీలైనంత తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

స్ట్రెయిటనింగ్ చేయించుకుంటున్నారా...

అమ్మాయిలు తమ సహజ అందాన్ని మెరుగుపరుచుకునేందుకు అవకాశాలు పెరిగాయి.



జుట్టుని రింగులు తిప్పడానికీ, స్ట్రెయిట్‌గా మార్చడానికీ ఉపయోగించే ఐరనింగ్ సాధనాలవల్ల తాత్కాలికంగా మనం కోరుకున్నట్లుగా జుట్టు కనిపించొచ్చు. కానీ అదే పనిగా చేయడంవల్ల జుట్టు పల్చగా మారుతుంది. సహజ మెరుపూ తగ్గుతుంది. మాడు కూడా పొడిబారుతుంది. కొన్నిసార్లు వాటివల్ల చర్మానికీ హాని జరగొచ్చు. మరి ఈ సమస్యని తగ్గించడానికి మార్గమే లేదా అంటారా? పూర్తిగా కాకపోయినా కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు. స్ట్రెయిటనింగ్ చేయడానికి ముందు నాణ్యమైన షాంపూతో తలస్నానం చేయాలి. కండిషనర్‌నీ తప్పనిసరిగా ఉపయోగించాలి. దీనివల్ల కండిషనర్‌లో ఉండే సెట్రియమోనియం క్లోరైడ్ వంటివి ఐరనింగ్ వల్ల వచ్చే డ్యామేజ్‌ని నిరోధిస్తాయి. ఐరనింగ్ చేయడానికి సిలికాన్ కోటింగ్ ఉన్నవాటిని ఉపయోగించడం వల్ల కూడా వేడి తక్కువగా వస్తుంది. వీటిని మరీ తప్పనిసరి అనుకున్నప్పుడే ఎంచుకోవాలి. ఈ రెండింటితోపాటూ కాలేజీ అమ్మాయిలు స్టయిలింగ్ ఉత్పత్తులకీ ప్రాధాన్యం ఇస్తారు. సింథటిక్ స్టయిలింగ్ ఉత్పత్తులైన జెల్స్, మ్యూట్‌లు వంటివన్నీ ఇలాంటివే. ల్యాబ్రికెంట్లూ, క్రిమిసంహారకాలూ, మండే గ్యాస్ వంటివన్నీ జుట్టుకు హానిచేస్తాయి. ఇవి కొన్నిసార్లు నేరుగా చర్మంలోంచి రక్తంలో కలిసిపోతాయి. క్యాన్సర్‌లూ, అలర్జీలు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.

అప్పుడప్పుడూ హెయిర్ ఎక్స్‌టెన్షన్లా...

తలకట్టు అందంగా కనిపించాలనో లేక పలుచగా ఉన్న జుట్టు మందంగా కనిపించాలనో చాలామంది హెయిర్ ఎక్స్‌టెన్షన్స్ పెట్టుకుంటారు. వీటిని క్లిప్, వెల్‌క్రోల ద్వారా అమరుస్తారు. దీనివల్ల తల్లో అక్కడక్కడా జుట్టు రాలి ప్యాచుల్లా కనిపిస్తుంది. తలనొప్పి రావచ్చు. అందుకే అవసరమైతే తప్ప వాడకూడదు. దీన్ని ఉపయోగించే ముందురోజు కొబ్బరినూనెతో తలకు మర్దన చేసుకోవాలి. మర్నాడు తలస్నానం చేయాలి. అప్పుడే జుట్టు బలంగా ఉంటుంది.



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజిషియన్

పిన్ని నా డబ్బులు తీసేసుకుంటోంది...!

? నాకు ఇరవై ఒక్క సంవత్సరాలు. అమ్మ చిన్నప్పుడే చనిపోయింది. నాన్న రెండో పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు నాకు పిన్ని తమ్ముడిని ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటున్నారు. నాకు ఇష్టం లేదు. ఏ రోజూ ఆవిడ నన్ను కూతురిగా చూడలేదు. ప్రస్తుతం నేను ఉద్యోగం చేస్తున్నా... కానీ ఆర్థిక స్వేచ్ఛ లేదు. నా ఏటీఎం కార్డు కూడా ఆవిడ దగ్గరే ఉంచుకుంటుంది. అడిగితే 'నీ పెళ్లికే డబ్బులు దాస్తున్నా' అంటోంది. ఒక్కోసారి ఇంటి నుంచి పారిపోవాలనిపిస్తుంది. నేను కేసు పెడితే ఈ పెళ్లి నుంచి తప్పించుకోవచ్చా. చట్టం నాకేవిధంగా సాయం చేస్తుంది?

- ఓ సోదరి


డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

✔ మీరు మేజర్ కాబట్టి ఇష్టంలేని పెళ్లి ఎవరూ చేయడానికి లేదు. హిందూ వివాహ చట్టం సెక్షన్ 5(2) ప్రకారం పెళ్లి అనేది ఇద్దరి అంగీకారంతో జరగాలి. మీకు ఇష్టంలేని పెళ్లిని బలవంతంగా నిర్ణయించినా, చేసినా మీరు పోలీసులను ఆశ్రయించొచ్చు. ఇక ఆర్థిక స్వేచ్ఛ విషయానికొస్తే మీరు సంపాదించే మొత్తం మీద హక్కు మీదే. వాటిని మీ పెళ్లికి దాస్తున్నా అని మీ పిన్ని తీసుకోవడంలో తప్పులేదు. కానీ నిజంగానే దాస్తున్నారా లేదా అన్నది చూసుకోవాలి. చిన్నపిల్లల చేతుల్లో డబ్బు తొందరగా ఖర్చయి పోతుందనో, ఆర్థిక స్వేచ్ఛ మిమ్మల్ని చెడు అలవాట్ల వైపు తీసుకెళ్తుందనో భయంతో ఇలా చేస్తుండొచ్చు. మీరే సొంతంగా పొదుపు పథకాల ద్వారా దాచుకునే అవకాశం ఉంటే జీతం నుంచి నేరుగా ఆ ఖాతాలోకి డబ్బు వెళ్లేలా చూసుకోండి. ఇప్పటిదాకా మీరు సంపాదించిన డబ్బు ఎలా దాస్తున్నారో అడిగి తెలుసుకోండి. మిమ్మల్ని ఆవిడ వేధిస్తుంటే గృహహింస నిరోధక చట్టం ద్వారా ప్రొటెక్షన్ ఆర్డర్‌ను మీరు కోర్టు ద్వారా పొందవచ్చు. ఇంట్లోంచి పారిపోవాలనే ఆలోచన మానుకోండి. బయటికి వచ్చి ఆడపిల్లలు ఎలా ఇబ్బందులు పడుతున్నారో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. పెళ్లి విషయంపై నాన్నగారినీ, మీ పిన్నిని కూర్చోబెట్టి చట్టం గురించి వివరించండి. మేజర్ అయిన ఆడపిల్లలకు పెళ్లీ, విడాకులూ, దత్తతలాంటి విషయాల్లో స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే అధికారం ఉంటుంది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి మనిషి తాను కోరుకున్న విధంగా జీవించే హక్కు ఉంటుంది. మీవల్ల సమస్య పరిష్కారం కాకపోతే ఏదైనా కౌన్సెలింగ్ సెంటర్, లేదా మహిళా సంఘాల సాయం తీసుకోవచ్చు.

దుస్తులు ఎన్ని ఉన్నా.. ఒక్కోసారి ఏవీ లేవు.. ఏం వేసుకెళ్లాలి అని మథనపడుతుంటాం. దాంతో అవసరానికి మించి కొనేస్తుంటాం. ఈసారి దుస్తుల్ని కొనేముందు.. ఒక్కసారి మీ అల్మారాను ఇలా సర్దుకుని చూడండి. కొనాలా వద్దా అనే స్పష్టత మీకే వస్తుంది.



పొందిగ్గా... సర్దేద్దామా

◗ అల్మారాలో ఎన్ని దుస్తులున్నా ఏం వేసుకోవాలో అర్థం కావట్లేదా? ఉన్నవాటిని ఒకసారి ఇవతలకు తీయండి. రకాలు, రంగులను బట్టి వేర్వేరుగా చేసుకుని చక్కగా సర్దుకుని చూడండి.

◗ కొన్ని డ్రెస్సులు ఎప్పటికో గానీ వేసుకోం. కానీ వాటిని తీసేయాలంటే బాధగానే ఉంటుంది. అలాంటివి ఏమైనా ఉంటే ఒకసారి చూసుకోండి. సంవత్సరం కన్నా ఎక్కువ రోజుల నుంచి మీరు వాటిని వేసుకోకపోతే ఇకమీదట కూడా వేసుకోరని అర్థం. అలాంటి వాటిని వెంటనే తీసేయడం మంచిది.

◗ అన్ని తరహా దుస్తులు ఒకే దగ్గర పెట్టేస్తే గందరగోళంగా ఉంటుంది. ఆఫీసుకూ, వేడుకలకూ, రోజూ వేసుకోడానికి.. ఇలా విభజించుకొని వరుసల్లో సర్దుకోండి. కొనుగోళ్లకు వెళ్లేటప్పుడు ఏ రకం దుస్తులు మీకు ఎక్కువగా ఉన్నాయో.. వేటి అవసరం ఎక్కువగా ఉందో తేలికగా తెలిసిపోతుంది.


◗ రంగులవారీగా సర్దుకుంటే కూడా దుస్తుల ఎంపిక తేలికవుతుంది. మనకు తెలియకుండానే కొన్ని రంగుల దుస్తుల్ని ఎక్కువగా కొనేస్తాం. ఇలా పెట్టుకోవడం వల్ల మనకు స్పష్టత వస్తుంది.

◗ చున్నీలూ, లెగ్గింగ్‌లు విపరీతంగా కొనేస్తున్నారా... వాటన్నింటినీ ఒక దగ్గర విడిగా సర్ది చూడండి. కొత్తగా ఏవైనా కొంటే వాటికి ఏమైనా సరిపోతాయేమో సులువుగా పోల్చుకోవచ్చు.

◗ ఒక వరసలో కొన్ని హ్యాంగర్లకే స్థలం సరిపోతుంది. అలాంటప్పుడు హ్యాంగర్లకు లింక్స్ అని దొరుకుతాయి. వాటిని తగిలించుకుంటే ఒకదానికే రెండు జతల దుస్తుల్ని వేలాడదీయొచ్చు.



వసంత



పాతచిత్రం

నిత్యశ్రీ మహదేవన్, ఉన్ని కృష్ణన్, బాంబే జయశ్రీ.. సినిమాల ద్వారా తెలుగుకి పరిచయమైన శాస్త్రీయ సంగీత కళాకారులు! నేడు ప్రపంచవ్యాప్త గుర్తింపు సాధించిన ఈ కళాకారులందరికీ తొలి వేదిక కల్పించిన ఘనత.. ఆ తెలుగు సభది! కర్ణాటక సంగీత ప్రపంచాన మకుటంలేని ఏలికలైన ఎమ్మెస్ సుబ్బలక్ష్మీ, డీకే పట్టమ్మాళ్, మంగళంపల్లి బాలమురళి అభిమానం చవిచూసిన సంస్థ ఇది. అంతేకాదు.. చెన్నైలోని తెలుగు సంస్కృతీ ప్రతీకలు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జానకీ, సామవేదం షణ్ముఖశర్మ వంటివాళ్లతో కళాబాంధవ్యమున్న సభ కూడా! అలా 'శర్వాణి సంగీత సభ'ని ఓ యజ్ఞంలా నడుపుతున్నారు ఆ మహిళలు! ఎవరు వాళ్లు?

చెన్నైలో తెలుగు కీర్తి.. శర్వాణి!

వాళ్లని పరిచయం చేసుకునేముందు.. చెన్నైలోని సంగీత సభల తీరూ, ఆ వాతావరణం గురించి కొద్దిగా తెలుసుకోవాలి. కర్ణాటక సంగీతానికి సంబంధించినంత వరకూ మద్రాసుని ఓ 'మెక్కా' అనే పిలుస్తారు అభిమానులు! ముఖ్యంగా నవంబర్ నుంచి రెండునెలలపాటు సాగే మార్గశిర సంగీతోత్సవాలకి('సీజన్' అని పిలుస్తారు ఇక్కడ!) ప్రపంచ నలుమూలల నుంచి సంగీతప్రియులు వస్తుంటారు. మద్రాసు మహానగరంలో ఈ 'సీజన్' 80 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. నాలుగు సభలతో(సంఘాలు) మొదలైన ఈ ఉత్సవాలు.. ఇప్పుడు వందలాదిగా పెరిగి కళకళలాడుతున్నాయి. ముందు నుంచీ ఈ నగరంలోని సభలన్నీ ఎక్కువగా పురుషుల నిర్వహణలోనే ఉన్నాయి. ఆ తీరు మారాలని తపించారు సూరి వసంత అనే సంగీతాభిమాని. కేవలం అభిమానే కాదు ఆమె వైణికురాలు కూడా. కొంతకాలం సెన్సార్‌బోర్డు సభ్యురాలిగానూ చేశారు. అలా కేవలం స్త్రీలు మాత్రమే నిర్వహించే ఓ సభని ఏర్పాటు చేయాలనుకున్నారామె. చెన్నైలో ఆంధ్ర బాలానందం పాఠశాల నిర్వాహకురాలు దామెర్ల జోగులాంబ, తన ఇతర స్నేహితులు మనోరమా, మణీ, సరస్వతిని కూడా కలుపుకొని ఓ కమిటీ ఏర్పాటుచేశారు. శర్వాణీ సంగీత సభ అని పేరు పెట్టి 1985లో సంగీత కార్యక్రమాల నిర్వహణకి శ్రీకారం చుట్టారు. వైవిధ్యమైన సంగీత సౌరభాల్ని రుచి చూపిస్తున్నారు.

ఏమిటా వైవిధ్యం? సాధారణంగా మద్రాసులో మార్గశిర నెలలో ఉత్సవాలుంటాయని చెప్పుకున్నాం కదా! కానీ, శర్వాణీ సంగీత సభలో ఏడాదంతా కార్యక్రమాలుంటాయి.. ఒక్క మార్గశిరంలో తప్ప. అదీ సీజన్ పూర్తయ్యాక జనవరిలో త్యాగరాజ ఆరాధనోత్సవాల తర్వాత ఐదురోజులపాటు చేసే ఉత్సవాలకి బాగా పేరొచ్చింది. అందరూ స్త్రీలే నిర్వహించే సభ కాబట్టి.. ఎమ్మెస్ సుబ్బలక్ష్మి, డీకే పట్టమ్మాళ్ వంటి కర్ణాటక సంగీత రారాణులు దీనిపై ప్రత్యేక అభిమానం కురిపించారు. పేరు ప్రఖ్యాతలు సాధించినవాళ్లేకాదు.. సంగీత సాధనలో చిన్నప్పుడే అద్భుతాలు చేస్తున్నవారినీ ప్రోత్సహించాలని భావించింది శర్వాణీ సభ. 'బాంబే' జయశ్రీ, అరుణా సాయిరాం, నిత్యశ్రీ మహదేవన్, ప్రియా సిస్టర్స్ వంటివాళ్లు పరికిణీ ఓణీ ప్రాయంలో ఉన్నప్పుడే.. ఈ సభవాళ్లకి పాడే అవకాశాన్నిచ్చింది! 'మేం నిక్కర్లు వేసుకునేటప్పుడే మాకంటూ ఓ వేదికనిచ్చింది శర్వాణీ..' అని చెప్పుకుంటారు నేటి ప్రఖ్యాత గాయకులు టీఎం కృష్ణ, ఉన్నికృష్ణన్ లాంటివాళ్లు! ఇప్పటికీ పది నుంచి పద్దెనిమిదేళ్ల వయస్సువాళ్లకి ప్రతి ఏటా జులైలో 'అఖండం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

విభిన్న కార్యాక్రమాలతో..

'రికార్డింగుల్లోనైతే తప్పు దొర్లితే సరిచేసుకోవచ్చు. కానీ పూర్తిస్థాయి కచేరీల్లో అలా చేయలేం. పైగా ఇక్కడ శ్రోతలందరూ శాస్త్రీయ సంగీత ప్రియులు.. అందుకే సన్నగా వణుకొస్తోంది. అయినా ప్రయత్నిస్తాను!' - ఈ మాటలు ఎవరో కొత్తకళాకారుడివి కావు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానివి. జగమెరిగిన ఈ గాయకుడు ఎక్కడా ఎప్పుడూ పూర్తి భక్తి గీతాలతో కచేరీ చేసింది లేదు. ఆయనకి అలాంటి అరుదైన అవకాశం కల్పించింది శర్వాణీయే. అలా 2002లో రమేశ్ నాయుడు స్వరపరచిన అన్నమాచార్య గీతాలని తొలిసారి ఓ కచేరీగా ఆలపించారాయన. ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మ రూపకల్పన చేసిన 'శివపదం' ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వాళ్లందరికీ సుపరిచితం. ఆ కార్యక్రమానికి తొలి వేదిక కల్పించింది కూడా శర్వాణీయే. వసంతకి ఇప్పుడు 90 ఏళ్లు. ఇప్పటికీ శర్వాణీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. చెన్నై కర్ణాటక సంగీత ప్రపంచంలో తెలుగు స్త్రీల కార్యనిర్వహణ దక్షతకి నిలువెత్తు రూపంగా నిలుస్తున్నారు.

- **మాధురి**, వేళచ్చేరి, న్యూస్‌టుడే

క్యాన్సర్ ముప్పు పెంచవు

మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల రొమ్ముక్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ముందుగా ఆహార పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిపుణులు చెబుతున్నారిలా.



▮ ఆలివ్‌నూనెకున్న గుణాలు రొమ్ముక్యాన్సర్ వచ్చే అవకాశాల్ని తగ్గిస్తాయి. తాజాగా చేసిన ఓ అధ్యయనంలో రోజూ నాలుగు టేబుల్ స్పూన్ల ఆలివ్‌నూనె చేర్చుకోవడం వల్ల ఈ క్యాన్సర్ వచ్చే ముప్పు 68 శాతం తగ్గుతుందని తేలింది. అలాగే 3500 మహిళల మీద చేసిన మరో అధ్యయనం కూడా ఇంచుమించు ఇలాంటి ఫలితాలే చెప్పింది. రోజూ కనీసం ఒకటిన్నర టేబుల్‌స్పూన్ల ఆలివ్‌నూనె చేర్చుకున్నా క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని చాలామటుకూ తగ్గించుకోవచ్చు.



▮ ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే చేపలూ, వాల్‌నట్లూ, గింజలను ఆహారంలో చేర్చుకోవాలి. వీటికి రోగనిరోధక శక్తి పెంచే లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. అవి పరోక్షంగా క్యాన్సర్ వచ్చే తీవ్రతను తగ్గిస్తాయి.

▮ ఎక్కువగా శాకాహారం తినడం వల్ల రొమ్ముక్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుందట. వాటిలో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లూ, పీచు దీనికి ముఖ్య కారణం. క్యాబేజీ, క్యారెట్, క్యాలీఫ్లవర్, ఉల్లీ, వెల్లుల్లీ, పుట్టగొడుగుల్లో కూడా క్యాన్సర్‌ను నిరోధించే పోషకాలుంటాయి. అయితే చక్కెర స్థాయులు ఎక్కువగా ఉండే అరటిపండ్లూ, అనాస, మామిడి వంటి వాటిని దూరంగా ఉంచాలి.

▮ సోయాలో ఉండే ఈస్ట్రోజెన్ క్యాన్సర్ వచ్చే అవకాశాల్ని పెంచుతుందన్న అపోహ ఉంటుంది. అయితే రోజూ వారి ఆహారంలో కాస్త సోయా చేర్చుకోవడం మంచిదేనని చెబుతున్నారు నిపుణులు. సోయాతో తయారు చేసే ప్రాసెస్డ్ ఆహారానికి దూరంగా ఉండాలి.

చదువు

ఈనాడు కరీంనగర్ 8
సోమవారం జనవరి 22, 2018 ■ e-mail: edc@eenadu.in

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఎనిమిది వేలకు పైగా ఖాళీలతో క్లరికల్ (జూనియర్ అసోసియేట్స్) నోటిఫికేషన్ వెలువడింది. వీటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో 400, తెలంగాణలో 255 ఖాళీలు భర్తీ చేయనున్నారు. సాధారణ డిగ్రీ అర్హతతో దేశంలోనే అతిపెద్ద బ్యాంకులో ఉద్యోగం సాధించుకునే మంచి అవకాశం ఇది. అకడమిక్ పరిజ్ఞానంతో సంబంధం లేకుండా సరైన ప్రణాళికతో ప్రాక్టీస్ చేస్తే ఉద్యోగాన్ని సంపాదించుకోవచ్చు.



అతిపెద్ద బ్యాంకులో కోరుకున్న కొలువు!



దేశ వాణిజ్య బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ ప్రథమస్థానంలో ఉండటమే కాకుండా, ప్రపంచంలోని మొదటి 100 బ్యాంకుల్లో ఒకటిగా ఉంది. ఇతర బ్యాంకులతో పోలిస్తే జీతభత్యాలు కూడా ఇందులో ఎక్కువే. అన్ని బ్యాంకుల కంటే ఎక్కువగా 18 వేలకు పైగా బ్రాంచ్‌లు కలిగి ఉండటం వల్ల తమ ప్రాంతాలకు దగ్గరగా పనిచేసే అవకాశం కూడా అభ్యర్థులకు లభిస్తుంది. ఈ ప్రత్యేకతల వల్ల సహజంగా అభ్యర్థులు ఎస్‌బీఐ నోటిఫికేషన్ పట్ల అత్యంత ఆసక్తిగా ఉంటారు. అందుకే పోటీ కూడా తీవ్రంగా ఉంటుంది.

ప్రిలిమినరీ పరీక్షలో ప్రధాన మార్పు

2016లో విడుదలైన నోటిఫికేషన్‌తో పోలిస్తే ఒకే తరహాలో రెండంచెల రాత పరీక్ష ఉంది. సబ్జెక్టులు, ప్రశ్నల సంఖ్య, పరీక్షకు కేటాయించిన మొత్తం సమయంలో ఎలాంటి మార్పు లేదు. అయితే ప్రిలిమినరీ పరీక్షలో మాత్రం మొదటిసారిగా

> మొత్తం ఖాళీలు: **8301**
> దరఖాస్తు ప్రారంభం: **జనవరి 20, 2018** (ఆన్‌లైన్‌లో)
> చివరి తేదీ: **ఫిబ్రవరి 10, 2018**


మొత్తం 60 నిమిషాల సమయాన్ని విభాగాల వారీగా 20 నిమిషాల చొప్పున మూడు విభాగాలకు కేటాయించారు. దీని వల్ల అభ్యర్థులు ఏదైనా విభాగాన్ని మొదలుపెడితే, దానికి నిర్దేశించిన సమయం పూర్తయిన తర్వాతే మరొక విభాగంలోకి వెళ్లాల్సి ఉంటుంది. కొన్ని ప్రశ్నల తర్వాత వేరే విభాగంలోకి వెళ్లే అవకాశం ఉండదు. దీనివల్ల తేలికగా ఉండే విభాగాన్ని త్వరగా పూర్తిచేసి తద్వారా మిగిలిన సమయాన్ని ఇతర కఠిన సబ్జెక్టులోని ప్రశ్నలు సాధించడానికి ఉపయోగించుకునే వెసులుబాటు ఈ పరీక్షలో ఉండదు.

న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్‌లు కీలకం

ప్రిలిమినరీ పరీక్షలో సమయాన్ని విభాగాలవారీగా కేటాయించడం వల్ల న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ సబ్జెక్టుల్లో ఒక్కోదానిలో ఉండే 35 ప్రశ్నలను 20 నిమిషాల్లో పూర్తి చేయాలి. అంటే ఒక్కో ప్రశ్నకు సగటున 34 సెకన్ల సమయం మాత్రమే ఉంటుంది. ఇది అత్యంత తక్కువ సమయం. అందువల్ల ఈ రెండు విభాగాలను ఎవరైతే వేగంగా పూర్తిచేయగలుగుతారో వారే మిగిలిన అభ్యర్థుల కంటే మెరుగైన ప్రతిభను ప్రదర్శించగలుగుతారు.

అయిదు సబ్జెక్టులూ ముఖ్యమే!

ప్రాథమిక, ప్రధాన పరీక్షలు రెండింటిలో ఉండే అయిదు సబ్జెక్టులన్నీ వేటికవే ముఖ్యమైనవి.



క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఎబిలిటీ: ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలు రెండింటిలో ఉండే విభాగమిది. న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లోని ప్రధాన భేదం ప్రశ్నల స్థాయి. సిలబస్‌లో పెద్దగా తేడా లేకపోయినా వాటికి సంబంధించిన ప్రశ్నల స్థాయి న్యూమరికల్ ఎబిలిటీలో తక్కువగా, క్వాంటిటేటివ్ ఎబిలిటీలో ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేట్ వాల్యూస్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా సఫిషియన్సీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, అరిథ్‌మెటిక్‌లోని వివిధ టాపిక్స్ నుంచి ప్రశ్నలుంటాయి. అయితే న్యూమరికల్ ఎబిలిటీలో సింప్లిఫికేషన్స్ నుంచి, క్వాంటిటేటివ్ ఎబిలిటీలో డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ సమయం పట్టే విభాగం కాబట్టి లెక్కలు వేగంగా చేయగలిగే విధంగా బాగా సాధన చేయాలి. నంబర్ సిరీస్ ప్రశ్నల్లో సంఖ్యల మధ్య సంబంధం వెంటనే స్ఫురిస్తే ఆ ప్రశ్నను సాధించాలి. లేకపోతే ఎక్కువ కాలయాపన చేయకుండా వాటిని వదిలేయాలి. అదే విధంగా కఠినంగా అనిపించే ప్రశ్నలపై కూడా ఎక్కువ కాలయాపన మంచిది కాదు. తేలికపాటి ప్రశ్నలు ముందుగా పూర్తిచేసి సమయం ఉంటే కఠినమైన ప్రశ్నలు ప్రయత్నించాలి.

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్: సాధారణంగా జనరల్ అవేర్‌నెస్‌గా పేర్కొనే ఈ విభాగాన్ని ఈ పరీక్షలో జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్ అంటారు. జనరల్ అవేర్‌నెస్‌గా వ్యవహరించినప్పుడు కూడా ఫైనాన్షియల్, బ్యాంకింగ్ రంగాలకు సంబంధించిన విషయాలపైనే ఎక్కువ ప్రశ్నలు ఉండేవి. అందువల్ల ఇప్పుడు జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్‌గా ఇవ్వడం వల్ల సబ్జెక్టు కొత్తగా మారిందేమీ లేదు.



డా. జి.ఎస్. గిరిధర్
డైరెక్టర్, RACE

ఈ విభాగంలో ప్రశ్నలు సాధారణంగా ఎకానమీ, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాలకు సంబంధించిన వర్తమానాంశాలపై ఉంటాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, సాధారణ బడ్జెట్‌లపై ప్రశ్నలు వస్తాయి. జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, అవార్డులు, పుస్తకాలు-రచయితలు, వార్తల్లోని వ్యక్తులు, స్థలాలు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ మొదలైన వాటి నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యమైన రోజులు గుర్తుంచుకోవాలి. సాధారణంగా పరీక్షా సమయానికి 5, 6 నెలల ముందు వరకు ఉండే వర్తమానాంశాలపైనే ఎక్కువ ప్రశ్నలు వస్తుంటాయి.

అదేవిధంగా బ్యాంకింగ్ టెర్మినాలజీ తెలుసుకోవాలి. వివిధ బ్యాంకులు, వాటి ట్యాగ్‌లైన్/క్యాప్షన్లు గుర్తుపెట్టుకోవాలి. ఈ విభాగంలో ప్రశ్నలు వచ్చే అంశాల ప్రాధాన్యాన్ని తెలుసుకొని సన్నద్ధమైతే ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

రీజనింగ్: అకడమిక్ పరీక్షల్లో ఎప్పుడూ చదవనిదీ, ఆసక్తికరంగా, సులభంగా ఉండేది రీజనింగ్. ఈమధ్య పరీక్షల్లో ఈ విభాగం ప్రశ్నలు కాస్త కఠినంగా ఉంటున్నాయి. కాబట్టి ఎక్కువ ప్రాక్టీస్ చేయాలి. దీనిలో కోడింగ్-డీకోడింగ్, అల్ఫాబెట్-నంబర్ సిరీస్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, వెన్ డయాగ్రమ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సిలాజిజమ్ మొదలైన వాటితోపాటు అనలిటికల్ రీజనింగ్‌లోని స్టేట్‌మెంట్ సంబంధ ప్రశ్నలు, కాజ్-ఎఫెక్ట్, ఇన్‌పుట్-అవుట్‌పుట్, పజిల్ టెస్ట్, ఎలిజిబిలిటీ టెస్ట్ మొదలైన వాటి నుంచి సాధారణంగా ప్రశ్నలు ఉంటాయి. బాగా సాధన చేస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా సరైన జవాబు గుర్తించవచ్చు.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: బ్యాంకు పరీక్షల్లో ఎక్కువమంది ఫెయిలయ్యే విభాగమిది. దీనికి సరైన ప్రాధాన్యం ఇచ్చి తగిన విధంగా సిద్ధం కాకపోవడమే ప్రధాన కారణం. అయితే ఈ విభాగంలో వస్తున్న ప్రశ్నల సరళిని గమనించి తదనుగుణంగా ప్రిపేర్ అయితే ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు. దీనిలో గ్రామర్ ఆధారంగా ఉండే సెంటెన్స్ కంప్లిషన్, పేరా జంబుల్డ్, ఫిల్లర్స్, క్లోజ్ టెస్ట్, గ్రమెటికల్ ఎర్రర్స్, రీ-అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్ మొదలైన వాటి నుంచే దాదాపు 40-50 ప్రశ్నలుంటాయి. ఈ తరహా ప్రశ్నలు బాగా సాధన చేయాలి. వీటితోపాటు కాంప్రహెన్షన్, ఒకాబ్యులరీ ప్రశ్నలుంటాయి. వేగంగా చదవడం ప్రాక్టీస్ చేస్తే కాంప్రహెన్షన్‌లో ప్రశ్నలు త్వరగా సాధించవచ్చు.

కంప్యూటర్ నాలెడ్జ్: అభ్యర్థులందరూ ఎక్కువ మార్కులు సాధించగలిగే సబ్జెక్ట్ ఇది. ఎవల్యూషన్ ఆఫ్ కంప్యూటర్, బేసిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, వివిధ కాంపోనెంట్స్, డివైజెస్-వాటి ఉపయోగాలు, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఎమ్మెస్ ఆఫీస్, నెట్ వర్కింగ్, ఇంటర్నెట్, ఇ-కామర్స్, కంప్యూటర్ టెర్మినాలజీ, డీబీఎంఎస్, కంప్యూటర్ రంగంలోని తాజా పరిణామాలు తదితరాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

పరీక్ష విధానం

ప్రిలిమ్స్

సబ్జెక్టు	మార్కులు	ప్రశ్నలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30
న్యూమరికల్ ఎబిలిటీ	35	35
రీజనింగ్ ఎబిలిటీ	35	35
మొత్తం	**100**	**100**

★ ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం కాలవ్యవధి ఒక గంట.

మెయిన్స్

సబ్జెక్టు	ప్రశ్నల సంఖ్య	మార్కులు	కాలవ్యవధి (నిమిషాల్లో)
జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50	50	35
జనరల్ ఇంగ్లిష్	40	40	35
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ అండ్	50	50	45
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50	60	45
మొత్తం	**190**	**200**	**160**

తరచూ తలెత్తే ప్రశ్నలు

■ **నేను నాన్-మ్యాథ్స్ అభ్యర్థిని. బ్యాంక్ ఉద్యోగం సాధించగలనా?**

జ: బ్యాంక్ పరీక్షలు పదో తరగతి స్థాయిలోనే ఉంటాయి. అదేవిధంగా వీటిలోని సబ్జెక్టులన్నీ జనరల్ సబ్జెక్టులు. కేవలం అరిథ్‌మెటిక్ మాత్రమే ఇంతకు ముందు చదివి ఉంటారు. అది కూడా పాఠశాల స్థాయిలోనిదే. అందువల్ల ఆర్ట్స్, కామర్స్, సైన్స్, మేథ్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ మొదలైన ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చినా అందరూ బ్యాంక్ ఉద్యోగం సాధించుకోవచ్చు.

■ **బ్యాంక్ పరీక్షకు ఉన్న ఈ రెండు నెలల సమయం సరిపోతుందా?**

జ: పరీక్షలో ఉండే విభాగాలన్నింటి కాన్సెప్ట్స్ నేర్చుకోవడానికి నెలరోజులు సరిపోతాయి. మిగిలిన సమయం వివిధ రకాల ప్రశ్నలు, మాదిరి ప్రశ్నపత్రాలు సాధించడానికి ఉపయోగిస్తే సమయం సరిపోతుంది.

■ **రోజూ ప్రిపరేషన్ కోసం ఎన్ని గంటలు కేటాయించాలి?**

జ: ఇక్కడ ఎన్ని గంటల సమయం అని కాకుండా ఎంత క్వాలిటీ సమయం కేటాయించారనేది ముఖ్యం. సబ్జెక్టులన్నింటికీ రెండు నెలల సమయంలో సిద్ధం కావాలంటే రోజుకి 8 నుంచి 10 గంటల సమయం కేటాయించాలి.

■ **తెలుగు మాధ్యమం అభ్యర్థులు ఈ ఉద్యోగం సాధించగలరా? ఇంగ్లిష్ మీడియం వారితో పోటీ పడగలరా?**

జ: పరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది కాబట్టి తెలుగు మీడియం అభ్యర్థులు సబ్జెక్టులన్నీ ఇంగ్లిష్‌లోనే నేర్చుకోవాలి. తెలుగులో నేర్చుకున్న పదాలన్నింటికీ ముందుగా ఇంగ్లిష్ పదాలు తెలుసుకోవాలి. ఇంగ్లిష్‌లోనే చదువుతూ ప్రాక్టీస్ చేస్తారు కాబట్టి అలవాటు పడతారు. అయితే ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులతో పోలిస్తే ఎక్కువ సమయం కేటాయించుకోవడం మంచిది. సబ్జెక్టులన్నీ అందరికీ ఒకటే కాబట్టి ఎవరు బాగా సాధన చేస్తే వారికే అవకాశం ఉంటుంది.

■ **పరీక్షలో ఏ సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి?**

జ: బ్యాంక్ పరీక్షలోని అన్ని సబ్జెక్టుల్లో విడివిడిగా ఉత్తీర్ణులవ్వాలి. కాబట్టి సబ్జెక్టులన్నింటికీ సమ ప్రాధాన్యం ఇవ్వాలి.

సన్నద్ధత ఏ విధంగా?

ప్రిలిమ్స్ పరీక్ష మార్చి/ఏప్రిల్‌లో, మెయిన్స్ పరీక్ష మే 12న జరుగుతాయి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఒకే సబ్జెక్టులు ఉన్నాయి కాబట్టి అభ్యర్థులు వీటికి విడివిడిగా కాకుండా ఒకేసారి ప్రిపరేషన్ మొదలుపెట్టాలి. మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతూ దాని అధ్యయనాన్ని ప్రిలిమ్స్ జరిగేలోగా పూర్తిచేయాలి. కనీసం ప్రిలిమ్స్‌లో కామన్‌గా ఉండే మూడు సబ్జెక్టులనైనా చదివేయాలి. కొత్తగా పరీక్ష రాసే సబ్జెక్టుల్లోని టాపిక్‌లను ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించాలి. ఆపై వివిధ స్థాయుల్లోని ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. అదేవిధంగా వీలైనన్ని పూర్తిస్థాయి మోడల్ పేపర్లను సమయం నిర్దేశించుకుని సాధన చేయాలి. ఎప్పటికప్పుడు సాధించగలిగే ప్రశ్నల సంఖ్య పెరిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

మరిన్ని వివరాలు, స్టడీమెటీరియల్, ఆన్‌లైన్ పరీక్షలు, ప్రీవియస్, మోడల్ పేపర్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్
పోస్టు: కన్సల్టెంట్
ఖాళీలు: 01
అర్హత: డిగ్రీ/ పీజీ. 20 సంవత్సరాల అనుభవం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ తేది: 27.02.2018
దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరితేది:** 15.02.2018
వెబ్‌సైట్: http://www.nird.org.in/

ఐఐఐటీ, చిత్తూరు
పోస్టు: సీనియర్ మేనేజర్ - స్టూడెంట్ అఫైర్స్ **ఖాళీలు:** 01
అర్హత: డిగ్రీతోపాటు హెచ్‌ఆర్ లేదా జనరల్ మేనేజ్‌మెంట్‌లో పీజీ.
ఎంపిక: రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ **దరఖాస్తు:** రెజ్యూమేను ఈమెయిల్ చేయాలి.
చివరితేది: 31.01.2018
ఈమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: http://www.iiits.ac.in/

ప్రవేశాలు

ఐఐటీ, ఖరగ్‌పూర్
1) ఎల్ఎల్‌బీ (మూడేళ్లు)
అర్హత: డిగ్రీ/ పీజీ.
2) ఎల్ఎల్ఎం (రెండేళ్లు)
అర్హత: డిగ్రీ, ఎల్ఎల్‌బీ/ బీఎల్.
ఎంపిక: ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ద్వారా
ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష తేది: 29.04.2018
దరఖాస్తు: ఆన్‌లైన్ **ఫీజు:** రూ.2500
చివరితేది: 28.03.2018
వెబ్‌సైట్: http://www.iitkgp.ac.in/

ఎంఎంఎం యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, గోరఖ్‌పూర్
కోర్సులు: బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ ఫిజిక్స్ (ఎలక్ట్రానిక్స్), ఎంటెక్, పీహెచ్‌డీ.
అర్హత: ఇంటర్/ డిగ్రీ/ బీఈ/ బీటెక్/ ఎంటెక్/ పీజీ ఉత్తీర్ణత.
ఎంపిక: మాలవీయ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎంఈటీ) - 2018 ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
ఫీజు: రూ.1500 **చివరితేది:** 31.03.2018
https://www.onlinemmmut.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్
పోస్టు: రెసిడెంట్ ఇంజినీర్/ డ్రాఫ్ట్స్‌మన్
ఖాళీలు: 02 **అర్హత:** సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ/ డిప్లొమా.
ఎంపిక: ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్
ఇంటర్వ్యూ తేది: 27.01.2018
వేదిక: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్, సీఎంఆర్ఎల్ డిపో, చెన్నై.
http://chennaimetrorail.org/

స్విమ్స్, తిరుపతి
పోస్టు: సీనియర్ రిసెర్చ్ ఫెలో
ఖాళీలు: 01 **అర్హత:** ఎంఎస్సీ/ ఎంటెక్, నెట్/ గేట్.
ఇంటర్వ్యూ తేది: 27.01.2018.
వేదిక: స్విమ్స్, తిరుపతి.
వెబ్‌సైట్: http://svimstpt.ap.nic.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

సీఏలో చూపించాడు సత్తా!

రెండు మార్కుల తేడాతో సీపీటీలో అఖిలభారత టాప్ టెన్ ర్యాంకును కోల్పోయాడు. అది జరిగింది 2013లో. 10 మార్కుల తేడాతో సీఏ-ఇంటర్లో టాప్ 50 ర్యాంకు చేజారిపోయింది. ఇది 2014లో. నిరాశతో కుంగిపోకుండా పట్టుదలతో కృషి చేశాడు. మరో మూడేళ్లలోనే సీఏ ఫైనల్‌లో జాతీయస్థాయి నాలుగో ర్యాంకు సాధించాడు. దక్షిణభారత రీజియన్లో ఇతడే అత్యుత్తమ ర్యాంకర్! అభ్యర్థులకు ప్రేరణ కలిగించే ఫణీష్‌రెడ్డి విజయగాథ తన మాటల్లోనే తెలుసుకుందాం!

మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్. పదో తరగతిలో ఉన్నపుడు మొట్టమొదటిసారిగా సీఏ కోర్సు గురించి విన్నాను. విజయవాడలో నేను చదివిన గౌతం పబ్లిక్ స్కూల్లో ఓ కార్యక్రమం నిర్వహించి ఈ కోర్సు గురించి వివరించారు. సమాజం గౌరవించే వృత్తుల్లో సీఏ ఒకటనీ; అవకాశాలూ, ఎదుగుదల విషయంలో ఎదురుండదనీ తెలుసుకున్నపుడు ఆసక్తి కలిగింది. తరగతి గది బోధనకే పరిమితం కాకుండా ఆర్టికల్‌షిప్ ద్వారా పొందే మూడేళ్ల ప్రాక్టికల్ అనుభవం కుతూహలాన్ని పెంచింది. దీంతో మ్యాథ్స్, సైన్స్ సంబంధిత కోర్సులు నా గమ్యం కావనుకున్నాను.

కెరియర్‌లో దూసుకెళ్లడానికి సీఏ విభిన్నమైన మార్గమనిపించింది. టెన్త్ తర్వాత ఐఐటీ శిక్షణలో చేరాలని అమ్మానాన్న, ఉపాధ్యాయులూ ఆశించారు. కానీ భిన్నంగా, మిగతా కోర్సులకంటే కష్టమని చాలామంది భావించే సీఏనే ఎంచుకున్నాను. అందుకే సీఏ పునాది పటిష్ఠంగా ఉండటం కోసం విజయవాడ శ్రీ మేధావి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంఈసీ గ్రూపులో చేరాను. అక్కడే సీపీటీ, ఇంటర్‌లకు శిక్షణ పొందాను.

సీఏ-సీపీటీలో 91 శాతం మార్కులూ, సీఏ ఇంటర్లో 70.43 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాను. సీఏ ఇంటర్ పరీక్షల కోసం సీఏ సంస్థ అయిన ఐసీఏఐ వారి మెటీరియల్ చదివాను. కోచింగ్ సంస్థ అందించిన నోట్సు, మెటీరియల్‌ను కూడా ఉపయోగించుకున్నా. మూడు నెలల సమగ్ర రివిజన్, ఆ సమయంలో ఇంటి దగ్గర రాసిన సెల్ఫ్ టెస్టుల ఫలితంగా మంచి మార్కులు పొందాను.

››› చివరకు ఫైనల్..!

సీఏ-ఇంటర్ ఫలితాల ప్రకటన తర్వాత 2014 అక్టోబరులో విజయవాడలోని ఆడిట్ సంస్థ అయిన ఎం/ఎస్ ఎంఎన్‌రావు అండ్ అసోసియేట్స్, సీఏస్ దగ్గర ఆర్టికల్‌షిప్ శిక్షణలో చేరాను. నా గురువైన సీఏ తుమ్మల శివరామ మోహనరావు గారు నన్నెంతో ప్రోత్సహించారు. అత్యుత్తమ ర్యాంకు కొట్టాలనే ప్రేరణ కలిగించారు. నాకు నిర్దేశించిన ప్రతి టాస్కునూ సమర్థంగా పూర్తిచేయగలిగాను. ఆర్టికల్‌షిప్ 2017 అక్టోబర్‌లో పూర్తయింది. ఆర్టికల్‌షిప్‌లో ఉండగా.. నిబంధనల ప్రకారం ఏప్రిల్ మధ్యకాలం నుంచి అక్టోబరు వరకూ ఆరునెలల పరీక్షల ప్రిపరేషన్ సెలవు తీసుకున్నాను. ఫైనల్ పరీక్షను తర్వాతి నెల్లోనే రాశాను. తొలి ప్రయత్నంలోనే అఖిలభారత స్థాయిలో నాలుగో ర్యాంకు పొందాను.

››› సొంతంగా అధ్యయనం..

ఆర్టికల్‌షిప్‌లో ఉన్నప్పుడు ఏ కోచింగ్ తరగతులకూ హాజరుకాకుండా ఐసీఏఐ మెటీరియల్‌లో సాధ్యమైనన్ని సబ్జెక్టులను సొంతంగా చదవాలని నిశ్చయించుకున్నాను. సీఏ దూరవిద్యాకోర్సు కాబట్టి... తాజా అమెండ్‌మెంట్లు, కొత్త చట్టాల పరిజ్ఞానం సీఏ అర్హత వచ్చాక కూడా ఎప్పటికప్పుడు పెంచుకోవాల్సిందే. ఇలాంటివాటికి కోచింగ్ ఏముంటుంది!



ఎనిమిది సబ్జెక్టుల్లో ఐదింటి తొలి విడత అధ్యయనాన్ని ప్రిపరేషన్ సెలవులకు ముందే ముగించాను. మిగిలిన వాటిని రెండు నెలల్లో పూర్తిచేశాను. అదే సమయంలో ఇగ్నో బీకాం పరీక్షలు కూడా రాసి, మొదటి ప్రయత్నంలోనే పాసయ్యాను. అన్ని 8 సబ్జెక్టుల పునశ్చరణకు (రివిజన్) నాలుగు నెలల సమయం ఉందప్పుడు. మొదటి రివిజన్ సమయంలో తయారుచేసుకున్న షార్ట్ నోట్స్, ఫ్లో చార్టులు స్వల్పసమయంలోనే తుది రివిజన్ పూర్తవటానికి ఉపయోగపడ్డాయి.

రివిజన్ షెడ్యూల్ ప్రణాళికలో, జవాబుల మూల్యాంకనంలో, తగిన సూచనలు ఇస్తూ ముందుకునడపటంలో నా గురువు చేసిన సాయం ఎంతో ఉంది! మూడువిడతల సమగ్ర పునశ్చరణా, రెండు సెట్ల మాక్ టెస్టులూ పూర్తిచేశాను. ఆర్టికల్‌షిప్ సమయంలో రోజుకు రెండేసి గంటల చొప్పున చదివినా, ప్రిపరేషన్ సెలవుల్లో మాత్రం రోజుకు 8 నుంచి 10 గంటలపాటు సన్నద్ధమయ్యాను. మొత్తం సన్నద్ధత, రివిజన్ షెడ్యూల్ సకాలంలో సమర్థంగా పూర్తయ్యేలా ప్రణాళిక వేసుకున్నాను. ఆలిండియా ర్యాంకు సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికను అమలుచేశాను. ఆశించిన ఫలితం వస్తుందన్న ఆత్మవిశ్వాసంతో చదివాను.

> **జాతీయస్థాయి ర్యాంకర్ ఎం. ఫణీష్‌రెడ్డి**
> **తల్లి:** శోభారాణి **తండ్రి:** శ్రీనివాస్ రెడ్డి
> **జన్మస్థలం:** వరంగల్, తెలంగాణ.
> **టెన్త్:** 566/600 **ఇంటర్:** 978/1000
> **సీఏ-సీపీటీ:** 182/200 మార్కులు
> **సీఏ-ఇంటర్:** 493/700 మార్కులు
> **సీఏ ఫైనల్:** 556 మార్కులు. (నాలుగో ర్యాంకు)

సీఏ ఫైనల్ కోసం ఐసీఏఐ అకడమిక్ ఇన్‌పుట్స్ మొత్తం **(స్టడీమెటీరియల్, ప్రాక్టీస్ మాన్యువల్స్, రివిజన్ టెస్ట్ పేపర్లు, సజెస్టెడ్ ఆన్సర్స్ ఫర్ ప్రీవియస్ ఎగ్జామ్ పేపర్లు, మాక్ టెస్ట్ పేపర్లు అండ్ కాప్స్యూల్స్)** చదివాను.

సీఏగా సమాజంలో మంచి పేరు తెచ్చుకుని, ప్రాక్టీసుకు అవసరమైన అన్నిరకాల నైపుణ్యాలూ నేర్చుకోవటం నా లక్ష్యం. ఫోరెన్సిక్ ఆడిట్, జీఎస్‌టీ అండ్ బ్యాంక్ ఆడిట్స్‌లో పోస్ట్ క్వాలిఫికేషన్ కోర్సులు చేయాలని భావిస్తున్నాను.

››› సీఏ అభ్యర్థులకు నా సూచనలు

✦ గణనీయ ఎదుగుదల, అవకాశాలను అందించే మంచి కోర్సుల్లో సీఏ ఒకటి. నిజమైన ఆసక్తి ఉంటేనే ఈ కెరియర్‌ను ఎంచుకోండి. ✦ సీఏ కోర్సులో ఆర్టికల్‌షిప్ చాలా ప్రాముఖ్యమైంది. విద్యార్థి సీఏ ప్రొఫెషనల్‌గా మారేది ఈ దశలోనే! దీన్ని సమర్థంగా చేస్తే అది ఫైనల్ సన్నద్ధతకూ, తర్వాత వృత్తిపరంగా ఉపకరిస్తుంది. ✦ ఫైనల్ కోసం ముందస్తు ప్రణాళిక వేసుకోవాలి. ఆర్టికల్‌షిప్ సమయంలోనే వీలైనన్ని సబ్జెక్టులను చదివితే, సెలవులను సమగ్ర రివిజన్‌కు సమర్థంగా వినియోగించుకోవచ్చు. ✦ వేసుకున్న ప్రణాళికను అమలుచేయటానికి పూర్తిగా కృషి చేయాలి. ✦ అనుకున్న ర్యాంకును సాధిస్తామనే ఆత్మవిశ్వాసం చివరిదాకా నిలుపుకోవాలి.

పావు ఎకరముంటేే పైసలిస్తారా?

- ఎకరానికి రూ.4 వేల పథకంపై రైతుల ఆరా
- 62 శాతం మందికి అందేది రూ.10వేలలోపే
- భూముల విస్తీర్ణం లెక్కలపై వ్యవసాయశాఖ కసరత్తు
- 17 లక్షల రెవెన్యూ ఖాతాలపై తేలని పరిష్కారం

ఈనాడు - హైదరాబాద్

ఎకరానికి రూ.4 వేల పెట్టుబడి పథకంపై అతి తక్కువ విస్తీర్ణం ఉన్న అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్రంలో అతి తక్కువ విస్తీర్ణమున్న కమతాలే అధికం. వీటికి సరిగ్గా లెక్కచూసి డబ్బులిస్తారా అని గ్రామాల్లో రైతులు వ్యవసాయాధికారులను అడుగుతున్నారు. మొత్తం కమతాల్లో 61.96 శాతం విస్తీర్ణం కేవలం హెక్టారు(2.47 ఎకరాలు)లోపేనని వ్యవసాయశాఖ తెలిపింది. ఈ 61.96 శాతం కమతాల్లో అర హెక్టారు నుంచి హెక్టారు వరకు ఉన్నవే రెవెన్యూ రికార్డుల్లో నమోదయ్యాయి. కొందరికి పావు ఎకరం కూడా ఉంది. వారి లెక్కలు పక్కాగా లేవు. ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇస్తే హెక్టారుకు.. అంటే అత్యధికశాతం రైతులకు గరిష్ఠంగా రూ.10 వేలకు మించి డబ్బురాదు. పైగా చాలా చోట్ల కుటుంబాల పంపకాల్లో భాగంగా ఒక్కో రైతు పేరుతో 1 నుంచి 40 గుంటల లోపు వ్యవసాయ భూమి మాత్రమే ఉంది. ఎకరానికి 40 గుంటల విస్తీర్ణంగా లెక్క. ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినందున ఒక్కో గుంటకు రూ.100 చొప్పున విభజించి ఇవ్వాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ ప్రతిపాదించింది. ఈ లెక్కన ప్రతి రైతుకు ఉండే భూమిని ఎకరాల్లో కాకుండా ఎన్ని గుంటలు అనేది పరిశీలించి అన్ని రూ.వందల చొప్పున లెక్క చూసి చెక్కు రాయాల్సి ఉంటుంది. ఇందుకోసం భూముల వివరాలను రెవెన్యూ రికార్డుల నుంచి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. చెక్కులు చేతి రాతతో కాకుండా ఆన్‌లైన్‌లోనే సొమ్ము గణాంకాలను ప్రింట్ చేసి తీసుకోనున్నారు. ఇలా ప్రతి చెక్కుపై రైతుకుండే భూ విస్తీర్ణం ప్రకారం డబ్బు అందాలంటే పేరు, భూ విస్తీర్ణం, ఎంత ఇవ్వాలనే వివరాలు ఆన్‌లైన్‌లో ముందుగానే నమోదు చేయాలి. ఈ పనులు పూర్తిచేయడానికి వ్యవసాయశాఖ సిబ్బంది అంతా కలసి పని చేసినా నెలరోజుల సమయం సులభంగా పడుతుందని అంచనా. పైగా గత జూన్‌లో వ్యవసాయాధికారులు పల్లెల్లో తిరిగి చేసిన సమగ్ర సర్వే పత్రాల ప్రకారం చూస్తే 9 లక్షల మంది రైతుల వివరాలు సరిగా లేవు. వారి భూములపై వివాదాలున్నాయని వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా పక్కన పెట్టారు. మరో వైపు గత 3 నెలల్లో రెవెన్యూశాఖ రికార్డుల పరిశీలన చేసినప్పుడు మొత్తం 71 లక్షల రైతులకున్న 1.42 కోట్ల ఎకరాల వివరాలు స్పష్టంగా ఉన్నాయని తెలిపింది. ఇవి కాకుండా మరో 17 లక్షల రెవెన్యూ ఖాతాలకు సంబంధించిన భూములపై పలు రకాల వివాదాలున్నాయని పక్కన పెట్టింది. ఈ వివాదాస్పద ఖాతాల్లో సైతం కొన్ని వ్యవసాయ భూములున్నాయి. మరి ఈ రైతుల వివరాలు అధికారికంగా ప్రకటించకపోతే వీటి యజమానులకు సొమ్ము ఇస్తారా లేదా అన్నది తేలాల్సి ఉంది. ఇప్పటివరకైతే అంతా సవ్యంగా ఉన్న 71 లక్షల మంది రైతుల భూములకే రూ.4 వేల చొప్పున ఇవ్వాలని వ్యవసాయశాఖ నిధుల కోసం ప్రతిపాదనలు పంపింది. దీన్నిబట్టి వివాదాస్పద భూముల జోలికి వెళ్లడం లేదని అర్థమవుతోంది. వాటి రైతులు చెక్కుల పంపిణీ సందర్భంగా అధికారులను అడిగితే ఏం చేయాలనేది దానిపై వ్యవసాయశాఖ చర్చిస్తోంది. వీరితో పాటు, ఎకరంలోపు గుంటల స్థాయి విస్తీర్ణంలో భూమి ఉన్నవారితో సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. వీరికిచ్చే సొమ్మును పక్కాగా పంపిణీ చేసేందుకు రెవెన్యూ శాఖను వివరాలు అడిగి జాబితాలు సిద్ధం చేస్తామని వ్యవసాయ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్మోహన్ 'ఈనాడు'కు చెప్పారు.

ఆదర్శంగా తెలంగాణ పోలీసు వ్యవస్థ

- రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే చర్యలతో తెలంగాణ పోలీసు వ్యవస్థ దేశంలోనే మొదటి స్థానంలో ఉండి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి ఆదివారం ఆయన భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నాయిని మాట్లాడుతూ.. నేరం జరిగిన కొన్ని గంటల్లోనే నేరస్థులను అదుపులోకి తీసుకునేలా పోలీసు వ్యవస్థ కమాండ్ కంట్రోల్ విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ట్రాఫిక్ పోలీసులకు బాడీ కెమెరాల విధానం అమెరికా తర్వాత హైదరాబాద్‌లోనే ఉందన్నారు. రాష్ట్ర శాసనసభా సమావేశాలు జరుగుతున్న సమయంలో హైదరాబాద్‌లో ఓ ఉన్నతాధికారి అపహరణకు యత్నించిన వ్యక్తిని 24 గంటల్లో పట్టుకోవడం మన పోలీసుల కృషికి నిదర్శనమన్నారు. శాంతిభద్రతలు ఉంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించిన ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసు శాఖ పటిష్ఠతకు చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, డీజీపీ మహేందర్‌రెడ్డి, పోలీసు గృహనిర్మాణ సంస్థ అధ్యక్షులు కోలేటి దామోదర్, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, శాసనసభ్యులు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు

నేరరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: డీజీపీ

ఉట్నూరు, న్యూస్‌టుడే: రాబోయే రోజుల్లో తెలంగాణను దేశంలోనే నేరరహిత రాష్ట్రంగాను..భద్రత కలిగిన సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చేరుకున్నారు. ఐజీ నాగిరెడ్డి, డీఐజీ ప్రమోద్‌కుమార్, జిల్లా పాలనాధికారి దివ్య, ఎస్పీ విష్ణు వారియర్‌లతో కలిసి ఇక్కడి పీఎమ్మార్సీ భవనంలో ఆదిలాబాద్, కుమురం భీం, నిర్మల్ జిల్లా పోలీసు అధికారులతో శాంతిభద్రతలు, పోలీసుశాఖ చేపట్టే కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. సాంకేతికతను విస్తారంగా వాడుకుంటూ పోలీసుశాఖలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకొస్తూ ముందుకెళ్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేస్తూ వారి సంక్షేమానికి పాటుపడాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. స్నేహపూరిత పోలీసు విధానాన్ని కొనసాగించడంలో భాగంగా ఠాణాలకు వచ్చే ఫిర్యాదుదారులకు నమ్మకం కలిగేలా అన్నివేళ్లలో ఒకే విధంగా స్పందించాలన్నారు.

ఔను అమ్మాయిలిద్దరూ ప్రేమించుకున్నారు!

అనంతపురం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు యువతులు ప్రేమించుకున్నారు.. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఓ లేఖ రాసి ఊరు వదిలి వెళ్లిపోయారు. జిల్లాకు చెందిన ఇద్దరు యువతులు అనంతపురం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. ఇందులో ఒకరు సీనియర్ కాగా.. మరొకరు జూనియర్. వీరిద్దరు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. "తాము ప్రేమించుకుంటున్నాం.. పెళ్లి చేసుకునేందుకు తిరుపతికి వెళుతున్నాం. ఎవరూ వెతకొద్దంటూ" ఓ లేఖ రాసి శనివారం అదృశ్యమయ్యారు. ఈ విషయం కళాశాల యాజమాన్యానికి తెలియడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు అనంత పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టారు. యువతుల వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా వారు తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు ఆదివారం తిరుపతికి చేరుకుని ఇద్దరు అమ్మాయిల జాడ కనుక్కున్నారు. ప్రస్తుతం వారిని అనంతపురం తీసుకొస్తున్నారు.

పెట్టుబడి వ్యయం తగ్గించడంపై దృష్టి సారించాలి: మంత్రి పోచారం

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించే దిశగా రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులకు సూచించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆదివారం జరిగిన కిసాన్ కాల్ సెంటర్ పదిహేనేళ్ల వేడుకల్లో మంత్రి ప్రసంగించారు. రైతులు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచితే నగరంలో సగం ఆసుపత్రులు మూతపడతాయని, రైతులకు పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులూ పెరుగుతాయన్నారు. కిసాన్ కాల్ సెంటర్లు 14 ప్రాంతాల్లో పనిచేస్తూ..22 భాషల్లో రైతులకు సేవలు అందిస్తున్నాయన్నారు. రైతులకు అవసరమైన విద్యుత్తు, నీటిసరఫరా, విత్తనాల పంపిణీ, పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో అధికారులు అందుబాటులో ఉండేలా రైతు వేదికలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పసుపు, మిర్చి పంటలను రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి..వాటి పొడులు తయారు చేసి విక్రయించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సైబర్ నేరగాళ్ల బారిన శాసనమండలి సభ్యుడు

- రూ.35 వేలు కాజేసిన దుండగుడు

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకు ప్రతినిధులమంటూ ఫోన్లు చేసి బాధితుల్ని నిండా ముంచుతున్న సైబర్ నేరగాళ్లు ఏకంగా ఓ శాసనమండలి సభ్యుడినే బురిడీ కొట్టించారు. ఆర్‌బీఐ ప్రతినిధులుగా చెప్పుకొని క్రెడిట్ కార్డు వివరాల్ని తస్కరించిన దుండగులు రూ.35 వేలను కాజేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన వివరాలిలా.. భాజపా ఎమ్మెల్సీ రాంచందర్‌రావు చరవాణికి జనవరి 1న ఓ ఆగంతుకుడు ఫోన్ చేసి ఆర్‌బీఐ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి క్రెడిట్‌కార్డు గడువు ముగుస్తున్నందున అప్‌గ్రేడ్ చేయాలన్నాడు. తన చిరునామా వివరాలు సరిగానేచెప్పడంతో నిజమేనని నమ్మి ఆగంతుకుడు అడిగినమేరకు కార్డువెనక ఉన్న సీవీవీ నంబరుతోపాటు చరవాణికివచ్చిన ఓటీపీ నంబరును చెప్పేశారు. ఈక్రమంలో రెండు దఫాలుగా దుండగుడు రూ.35 వేలను కొట్టేశాడు. నగదుబదిలీ అయినట్లు చరవాణికి సంక్షిప్త సందేశం రావడంతో అనుమానం వచ్చిన ఎమ్మెల్సీ దబాయించడంతో ఆగంతుకుడు ఫోన్ కట్‌చేశాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించి వెంటనే తన క్రెడిట్‌కార్డు ఖాతాను రాంచందర్‌రావు స్తంభింపజేశారు. మరుసటిరోజు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హామీలు అటకెక్కాయి: లక్ష్మణ్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో తెరాస ఇచ్చిన హామీలు అటకెక్కడంతో.. కులం, మతం పేరిట రాజకీయ పబ్బం గడిపేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో సామాజిక మాధ్యమాలను ప్రధాన అస్త్రంగా చేసుకుని ముందుకెళ్లనున్నట్లు తెలిపారు. ఆదివారమిక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భాజపా ఐటీ విభాగం రాష్ట్ర స్థాయి కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ.. మోదీ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు పట్టం కడుతున్నారని.. మూడేళ్ల క్రితం ఐదు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భాజపా.. ఇప్పుడు 19 రాష్ట్రాలకు విస్తరించడమే దీనికి నిదర్శనమ న్నారు.

పరోక్ష ఎన్నికలతో బీసీలు, ఎస్సీలకు నష్టం: దత్తాత్రేయ

ఈనాడు, హైదరాబాద్: గ్రామపంచాయతీలకు పరోక్ష ఎన్నికల కోసం తెరాస ప్రభుత్వం చట్టసవరణకు ప్రయత్నం చేస్తోందని, దీనివల్ల ఆర్థికంగా ధనవంతులకే ప్రయోజనం ఉంటుందని.. బీసీలు, ఎస్సీలు పదవులపరంగా నష్టపోతారని కేంద్ర మాజీమంత్రి దత్తాత్రేయ ఆందోళన వ్యక్తంచేశారు. భాజపా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అన్నిపార్టీల అభిప్రాయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీచేస్తానని, గవర్నర్‌గా రాజ్‌భవన్‌లో ఉండననీ.. ఎప్పటికీ ప్రజాభవన్‌లోనే ఉంటానని ఓ ప్రశ్నకు బదులుగా వ్యాఖ్యానించారు.

దిల్లీకి రండి.. మాట్లాడుదాం

నాగంతో కేంద్ర సహాయమంత్రి గంగారాం అహీర్

భాజపాను విడిచిపెట్టి వెళ్లొద్దని, పార్టీలోనే కొనసాగాలని నాగం జనార్దన్‌రెడ్డిని కేంద్రహోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహీర్ కోరినట్లు సమాచారం. నాగంతో ఆయన నివాసంలో శనివారం రాత్రి భేటీ అయ్యారు. ఉగాది తర్వాత నిర్ణయం ప్రకటిస్తానని ఇటీవల నాగం ప్రకటించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీకి మీలాంటి నేతల అవసరముందని హన్స్‌రాజ్ అన్నట్లు తెలిసింది. పార్టీ భవిష్యత్తుపై నియోజకవర్గ కార్యకర్తల్లో అసహనం ఉందని, తనపై ఒత్తిడి చేస్తున్నారని నాగం చెప్పారు. దిల్లీలో మాట్లాడుకుందామని ఆహ్వానించగా.. దిల్లీ నాయకత్వంతో తనకు ఇబ్బంది లేదని ఆయన బదులిచ్చినట్లు తెలిసింది.

తెలంగాణకు 50కి పైగా డీఎన్‌బీ సీట్లు

వైద్యాధికారులతో ఎన్‌బీఈ అధ్యక్షుడి భేటీ

తెలంగాణలోని జిల్లా ఆసుపత్రుల్లో సుమారు 50కి పైగా డిప్లొమాట్ నేషనల్ బోర్డు (డీఎన్‌బీ) సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను తెలంగాణ సర్కారు ఇప్పటికే జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌బీఈ)కి పంపించింది. దీనిపై త్వరలోనే నిర్ణయం వెలువరిస్తామని ఎన్‌బీఈ అధ్యక్షులు డాక్టర్ అభిజాత్‌సేథ్ తెలిపారు. సచివాలయంలో వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి, వైద్యవిధాన పరిషత్ ఉన్నతాధికారి డా.రాజశేఖర్‌లతో ఆయన భేటీ అయ్యారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, అనస్తీషియా, గైనకాలజీ, పిడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ తదితర కోర్సుల్లో సీట్లు మంజూరు చేసే అవకాశాలున్నాయి. ఖమ్మం, తాండూరు, సంగారెడ్డి, కరీంనగర్, నల్గొండ జిల్లా ఆసుపత్రుల్లో డీఎన్‌బీ కోర్సులను ప్రవేశపెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

ప్రశ్నించాల్సింది పోయి... అద్భుతమంటారా?

- 30 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుల్ని రూ.లక్ష కోట్లకు పెంచారు
- ప్యాకేజీల వారీగా సమీక్షించాలి.. లేదంటే రాష్ట్రపతిని కలుస్తాం
- మీలా రాజ్యాంగాన్ని అవమానించలేదు.. గవర్నర్‌పై భట్టి విక్రమార్క ధ్వజం
- ప్రాజెక్టుల్లో అవినీతి జరిగింది: వీహెచ్

ఈనాడు, హైదరాబాద్: "మరో రూ.30 వేల కోట్లు ఖర్చుచేస్తే పూర్తయ్యే ప్రాజెక్టులకు పేర్లు, ఆకృతులు మార్చి తెరాస ప్రభుత్వం వాటి ఖర్చును రూ. లక్ష కోట్లకు పెంచింది. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం ఎందుకు పెరిగిందో.. మిగిలిన రూ.70 వేల కోట్లు ఎక్కడకు వెళ్లాయో గవర్నర్ నరసింహన్ ప్యాకేజీల వారీగా విచారణ జరిపించాలి. లేదంటే రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పార్టీ సీనియర్ నేతలు వీహెచ్, శ్రీధర్‌బాబులతో కలిసి ఆదివారమిక్కడ గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం సందర్శనలో సీఎం కేసీఆర్‌ను, మంత్రిని పొగుడుతూ గవర్నర్ చేసిన వ్యాఖ్యలు ఆ హోదాను కించపరిచేలా ఉన్నాయన్నారు.

"అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పేరును కాళేశ్వరంగా మారిస్తే ఎందుకు అడగలేదు? కాంగ్రెస్ హయాంలో రూ.38,500 కోట్ల అంచనాతో రూపొందించి రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాం. రూ.28 వేలకోట్ల ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.80 వేలకోట్లకు పెంచారు. రూ.50 వేల కోట్లు ఎక్కడకు వెళుతున్నాయో అడగకుండా.. ప్రాజెక్టు అద్భుతం.. కేసీఆర్ ఇక కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు, హరీశ్‌రావును కాళేశ్వరరావుగా కితాబివ్వడం బాధ కలిగిస్తోంది" అని భట్టి పేర్కొన్నారు. "ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్లు ఖర్చుచేస్తే పూర్తయ్యేవి. సీతారామ ప్రాజెక్టుగా మార్చి రూ.10వేల కోట్లకు పెంచారు. తెదేపాలో ఉన్న తలసానిని మంత్రిగా, ఏపీలో విపక్ష నలుగురు ఎమ్మెల్యేలను తెదేపా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించి రాజ్యాంగాన్ని మలినం చేశారు. దేశంలో మీలాంటి గవర్నర్‌ను ఎక్కడా చూడలేదంటూ" ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతిని కలిసి తెలంగాణ ప్రభుత్వంపై, గవర్నర్‌పై పాత్రపై వివరిస్తామని భట్టి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడుతోందని వీహెచ్ ఆరోపించారు. మొత్తంగా రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందన్నారు.

కరీంనగర్ జిల్లా గంగాధరలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. పథకాలు బాగుంటే ప్రభుత్వాన్ని అభినందించాలే కానీ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌ను పొగడటం సరైంది కాదన్నారు.

సిరిసిల్ల నేత కార్మికులను పరామర్శించండి: చాడ

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కితాబునిస్తూ గవర్నర్ పొగడడం కాదని... సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుల కుటుంబాలను పరామర్శించి వారి స్థితిగతులను తెలుసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిని ఇలా పొగిడే గవర్నర్ ఎక్కడా ఉండరన్నారు.



శ్రీరాంనగర్ బస్తీలో మాట్లాడుతున్న ఎల్.రమణ. చిత్రంలో రావుల చంద్రశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి

ఎన్నికల్లో తెదేపా జెండా ఎగురవేస్తాం: రమణ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. తమతో కలిసొచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని, లేదంటే ఒంటరిగానే 119 శాసనసభ స్థానాల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గం శ్రీరాంనగర్ బస్తీలో ఇంటింటికి తెదేపా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజలు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిజాం తరహా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ అభివృద్ధి అంతా ఆయన కలల్లోనే ఉందని, క్షేత్రస్థాయిలో లేదన్నారు. రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రోజుకో హామీ ఇస్తూ ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగిస్తున్నారన్నారు. ఓయూ విద్యార్థి మురళి ఆత్మహత్యకు పాల్పడితే తమ పార్టీ నేత ఒంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించేందుకు వెళ్తే అక్రమంగా అరెస్టు చేసి జైలులో వేశారన్నారు.

ప్రజాస్వామ్య తెలంగాణ కోసమే వరంగల్ డిక్లరేషన్

- విరసం నేత వరవరరావు

వరంగల్, న్యూశాయంపేట, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య తెలంగాణ కోసమే వరంగల్ డిక్లరేషన్ సభ ఏర్పాటు చేశామని విరసం నేత వరవరరావు తెలిపారు. ఆదివారం వరంగల్ జిల్లా హన్మకొండలో ఉద్రిక్తతల నడుమ తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆధ్వర్యంలో 2018 వరంగల్ డిక్లరేషన్ సభ నిర్వహించారు. అమరుల స్థూపం వద్దకు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని వరవరరావుతో పాటూ 48 మంది టీపీఎఫ్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.. అనంతరం వారిని వదిలేశారు. తర్వాత సభలో వరవరరావు 'వరంగల్ డిక్లరేషన్ 2018' ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందన్నారు. హక్కుల కోసం గొంతు ఎత్తితే అణచివేతకు గురిచేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు అమలు చేసిన విధానాలనే ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ అవలంబిస్తున్నారని వివరించారు. నియంత పోకడలు కొనసాగిస్తే మరోసారి ప్రజాస్వామ్య తెలంగాణ ఉద్యమం పుడుతుందన్నారు. పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. నిర్బంధంలోనే నుంచే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చిందన్నారు. రాష్ట్రంలో సభలు, ర్యాలీలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతులు తీసుకోవాలనే విధానం తొలగించాలని డిమాండ్ చేశారు.



'వరంగల్ డిక్లరేషన్ 2018' పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న వరవరరావు, తదితరులు


పెళ్లి కూతురు కాబోతున్న ఆమ్రపాలి



ఈనాడు, వరంగల్: వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారిని ఆమ్రపాలి వివాహం చేసుకోబోతున్నారు. ప్రస్తుతం ఆయన ఎస్పీగా పని చేస్తున్నట్లు సమాచారం. ఫిబ్రవరి 18న వీరి వివాహం పెద్దల సమక్షంలో జరగనుంది. ఈ నెల 27 నుంచి ఆమ్రపాలి సెలవులో వెళ్తున్నట్లు తెలిసింది. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత వరంగల్ అర్బన్ కలెక్టర్‌గా ఆమ్రపాలి 2016 అక్టోబరు 11న బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి పాలనలో తనదైన ముద్ర వేస్తూ వరంగల్‌ను ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. కేంద్రం నుంచి పలు అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం రూరల్ జిల్లాకు కూడా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వివాహ విషయంపై ఆమ్రపాలిని 'ఈనాడు' సంప్రదించగా ధ్రువీకరించారు.

'జ్యూరిచ్ నల్లా సందేశాని'కి కేటీఆర్ ఫిదా

మిషన్ భగీరథలోనూ దీన్ని అమలుచేస్తామని వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: 'స్వచ్ఛం.. ఆరోగ్యకరం.. ఏ మాత్రం షుగర్ ఉండదు. కొవ్వు రహితం.. తాజా, సేంద్రియం.. తాగడానికి సురక్షితం.. జ్యూరీ నీటిని ఆస్వాదించండి''.. స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్ జ్యూరిచ్‌లో బస చేసిన హోటల్‌లో తాగునీటి నల్లా మీద గల సందేశమిది. దీన్ని చూసి కేటీఆర్ అబ్బురపడ్డారు. జ్యూరిచ్ నగరం నల్లాల నీటిపై ఉన్న ప్రేమాభిమానాలను గర్వంగా, ఆత్మవిశ్వాసంతో చాటుకుందని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పథకం ఈ ఏడాది పూర్తవుతుంది. మా ప్రభుత్వం సైతం ఇలాంటి సూచికలనే కోటి ఇళ్లలోని నల్లాల వద్ద పెడతుంది" అని పేర్కొన్నారు.

దావోస్‌లో తెలంగాణ ప్రగతి ప్రస్తావన..: దావోస్‌లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో తెలంగాణ ఆర్థిక ప్రగతిని మంత్రి కేటీఆర్ వివరించనున్నారు. టీహబ్, అంకుర పరిశ్రమలకు ప్రోత్సాహం, వైద్య పరికరాల ఉత్పత్తి పార్కు, కాకతీయ మెగా జౌళి పార్కు తదితర అంశాలను వివరిస్తానని కేటీఆర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



ఆదిలాబాద్‌లో రిమ్స్ సిబ్బంది నివాస గృహాలకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రులు సి.లక్ష్మారెడ్డి, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి

త్వరలో గ్రామీణ స్థాయిలోనూ రక్తశుద్ధి సేవలు: మంత్రి లక్ష్మారెడ్డి

ఎదులాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 40 డయాలసిస్ (రక్తశుద్ధి) కేంద్రాలు ఏర్పాటు చేశామని, త్వరలో వీటిని గ్రామీణ స్థాయికి విస్తరించటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూరు ప్రాంతాల్లో ఆయన మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ఆదివారం పర్యటించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో డయాలసిస్ కేంద్రం, సిబ్బంది నివాస గృహాలు, సిటీస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, పిల్లల ఐసీయూ, చెల్లింపు గదులు, టెలీమెడిసిన్, అతిథిగృహం, ఉట్నూర్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో వైద్యారోగ్య శాఖలో ఉన్న ఖాళీలన్నీ కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో పని చేయడానికి వైద్యులు ముందుకు వచ్చే వారు కాదన్నారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వల్ల పలువురు వైద్యులు ఈ ప్రాంతాల్లో పని చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తూ ముందుకొస్తున్నారన్నారు.

సీపీఎస్ రద్దుకు సీఎం సానుకూలమే: ఎంపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను విధానం(సీపీఎస్) రద్దు విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని తెరాస లోక్‌సభా పక్ష నేత జితేందర్‌రెడ్డి తెలిపారు. సీపీఎస్‌కు వ్యతిరేకంగా పీఆర్టీయూ ఆందోళనలు చేస్తుంటే ఎంపీలూ పాల్గొనాలని సీఎం సూచించారని చెప్పారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సమస్యను మరోమారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీఇచ్చారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల విషయంలో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుందని, న్యాయపరంగా కొన్ని సమస్యలు వచ్చాయని చెప్పారు. దిల్లీకి ఎమ్మెల్సీలు వస్తే పార్లమెంట్ సమావేశాల్లో సమస్యను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రానికి సర్వశిక్షా అభియాన్ ద్వారా ఇచ్చే నిధులను సైతం పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నామని తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను పూర్తిస్థాయిలో తీసుకొస్తామన్నారు.

కేసీఆర్ కుటుంబం కోసమే రాష్ట్రం రాలేదు: కోదండరాం

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కేసీఆర్ కుటుంబం కోసమే రాష్ట్రం రాలేదని ఐకాస ఛైర్మన్ కోదండరాం అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో ఐకాస హైదరాబాద్ జిల్లా స్థాయి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెరాసతోనే తెలంగాణ ఏర్పడలేదని, సకల జనులు పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నారని స్పష్టం చేశారు. 1969 నుంచి ఉద్యమం సాగిందని, అందులో ప్రజలు, విద్యార్థులు, యువత ఆత్మబలిదానాలు ఉన్నాయని చెప్పారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పాలన సాగించడంలేదన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించేవారిపై అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో అంకెలగారడితో ప్రజలను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు.

అన్ని దారులూ అమ్మల సన్నిధికే

మేడారం, న్యూస్‌టుడే: మహాజాతర ఇంకా అధికారికంగా ప్రారంభం కాకముందే రహదారులన్నీ మేడారం తరలి వస్తున్న భక్తులతో నిండిపోతున్నాయి. ఆదివారం సెలవుదినం కావడంతో సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చారు. వేకువజాము నుంచే జంపన్నవాగులో స్నానఘట్టాలు రద్దీగా మారాయి. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ భక్తులు వస్తున్నారు.

గతంలో ఏన్నడూ లేనివిధంగా జాతరకు 10 రోజుల ముందే భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఆదివారం తెల్లవారేసరికి వాహనాల తాకిడి మరింత తీవ్రమైంది. ట్రాఫిక్ అదుపు తప్పింది. పస్రా-మేడారం మార్గంలో దాదాపు 10 కిలోమీటర్ల మేరలో వాహనాలు నిలిచిపోగా ప్రత్యామ్నాయ మార్గమైన ఎలుబాక పడిగాపూర్ మీదుగా మళ్లించారు. ఊరట్టం క్రాస్ రోడ్డు నుంచి మేడారం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ముందుకు కదిలే పరిస్థితి లేకపోవడంతో భక్తులు పంట పొలాల మీదుగా తాత్కాలికంగా వేసిన రోడ్లపై నడుస్తూ గద్దెల ప్రాంగణానికి చేరుకున్నారు. తాడ్వాయి మార్గంలోనూ 10 కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. భక్తులు కిలోమీటర్ల దూరం నుంచే వాహనాల వదిలి నడిచి వనదేవతల సన్నిధికి చేరుకోవాల్సి వచ్చింది. మేడారం చేరుకొన్న తర్వాత ముందుగా జంపన్నవాగు స్నాన ఘట్టాలలో ఎక్కువ మంది జల్లు స్నానాలు చేశారు. అనంతరం కల్యాణ కట్టలపై తలనీలాల మొక్కులు సమర్పించుకొని అమ్మల దర్శనానికి బయలుదేరారు. వనదేవతల దర్శనం ఆలస్యం కావడంతో తిరుగు ప్రయాణంలో రోడ్డు వెంబడి చెట్ల నీడలో బసచేసి ఆహార పదార్థాలు తింటూ సేదదీరారు. ఆదివారం ఒక్క రోజే 3 లక్షల మందికిపైగా భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారని దేవాదాయశాఖ అధికారులు చెప్పారు.

వైభవంగా 'మల్లన్న' బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొమురవెల్లి జాతరకు పోటెత్తిన భక్తులు



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

చేర్యాల, న్యూస్‌టుడే: ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు(జాతర) ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో మొదలయ్యే ఈ జాతర మూడు నెలల పాటు జరుగుతుంది. ఉగాది పండుగకు ముందు వచ్చే ఆదివారం అర్ధరాత్రి నిర్వహించే అగ్నిగుండాలతో జాతర ముగుస్తుంది. 'పట్నం వారం'గా పిలిచే జాతరలోని మొదటి ఆదివారం రోజున భారీగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యం వండి, ఆ పాత్రలను రంగులతో అందంగా అలంకరించి నెత్తిన పెట్టుకొని పూనకాలతో ఊగిపోతూ వెళ్లి స్వామివారికి, కొండపై ఉన్న 'మల్లన్న' తోబుట్టువు రేణుకాఎల్లమ్మ దేవతకు సమర్పించారు. ఈ మహాజాతరకు రాష్ట్రం నలుమూలలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం సుమారు 75 వేల మంది భక్తులు ఆలయానికి వచ్చారని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావు, పాలక మండలి ఛైర్మన్ బద్దిపడగ క్రిష్ణారెడ్డి తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న ప్రముఖుల్లో మల్కాజిగిరి ఎంపీ మల్లారెడ్డి ఉన్నారు.

రైతు ప్రాణానికేదీ 'పరిహారం'

వరంగల్, జనగామ జిల్లాల నుంచి
'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

కష్టాలొచ్చినా, నష్టాలే మిగులుతున్నా
సాగుకు వెనుకాడని అన్నదాత మొండి ధైర్యం..
అప్పులకుప్పల ముందు నిలవలేకపోతోంది.

వానొచ్చినా, వరదొచ్చినా,
పురుగూపుట్రా పోటెత్తినా తిప్పికొట్టే
రైతన్న గుండె దిటవు..
ఆర్థిక ఇబ్బందులను గెలవలేకపోతోంది.

భార్య పుస్తెలతాడు కూడా
తాకట్టుపెట్టి సాగు చేస్తే
దిగుబడి కరవైపోతోంది.

అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని పోషించలేక
పురుగులమందు డబ్బాకో, ఉరికొయ్యకో
అన్నదాత జీవితం బలయిపోతోంది.

ఫలితం.. ఆ కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. పంట అమ్మితే వచ్చిన సొమ్ము ఇంటి యజమాని కర్మకాండకే చాలడం లేదు. పేరుకుపోయిన అప్పులు, బతుకుబండి ఎలా లాగాలన్న సందిగ్ధం ఆ కుటుంబాలను కలవరపెడుతున్నాయి. బాధిత కుటుంబాలకు కనీస సాయం అందించడానికి కూడా మండల స్థాయి అధికారులు అరిగోస పెడుతున్నారు. పరిహారం మాట దేవుడెరుగు.. కనీసం రైతు ఆత్మహత్యకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 'అధికారిక గుర్తింపు పత్రం' ఇవ్వడానికి కూడా వారికి తీరిక ఉండటం లేదు. సాయం కోసం ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా కనికరించడం లేదు. ఆత్మహత్య చేసుకున్న ఆర్నెల్ల తర్వాతయినా వారి మరణం పంటల అప్పుల వల్లే అని ధ్రువీకరించడం లేదు. వీరు విచారణ పూర్తి చేసి గుర్తింపు ఇవ్వకపోతే ప్రభుత్వం నుంచి నయాపైసా సాయం అందదు.

- ఉదాహరణకు ఖమ్మం జిల్లాలో 2014 నుంచి 2017 వరకూ 92 మంది రైతులు అప్పుల బాధలతో ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో 47 మంది పంటల అప్పులతో మరణించలేదని మండల అధికారుల కమిటీ తిరస్కరించింది. మిగతా 45 మందిలో 40 మందికే ఇప్పటికి పరిహారం విడుదలైంది.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2014, 2015, 2016లో మొత్తం 37 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే త్రిసభ్య కమిటీ 11 మందికే పరిహారం ఇచ్చింది. గతేడాది ఐదుగురు మరణించగా ఇంకా విచారణే పూర్తి కాలేదని జిల్లా అధికారులు తెలిపారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యల గణాంకాలను ఎప్పటికప్పుడు తాజా వివరాలను ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రకటించడం లేదు. వ్యవసాయశాఖ ఆత్మహత్యలతో తమకెలాంటి సంబంధం లేదని మిన్నకుంటోంది. రెవెన్యూ శాఖకు కలెక్టర్లు పంపిన వివరాల ఆధారంగానే ప్రభుత్వం లెక్కలు ప్రకటిస్తోంది. అవీ ఎప్పటికప్పుడు బయటకు వెల్లడించడం లేదు. మండల కమిటీలు అధికారికంగా గుర్తించిన ఆత్మహత్యల్లో 457 కుటుంబాలకు రూ.6 లక్షల చొప్పున రూ.27.42 కోట్ల పరిహారాన్ని గత అక్టోబరు 9న రెవెన్యూ శాఖ విడుదల చేసింది. ఇవి ఇంకా బాధితుల చేతికి పూర్తిగా అందించలేదు. ఈ 457 మంది ఎప్పటి నుంచి ఎప్పటి వరకూ ఆత్మహత్య చేసుకున్నారనే వివరాలను ఈ ఉత్తర్వుల్లో వివరించలేదు. దీనివల్ల ఇంకా వందలాది కుటుంబాలు తమకు పరిహారం వస్తుందనే నమ్మకంతో ఆశగా ఎదురుచూస్తున్నాయి.

పరిహారం గుట్టు విప్పని కలెక్టర్లు

ఆత్మహత్య చేసుకున్న కుటుంబాల్లో ఎంతమందికి పరిహారం ఇచ్చారు, ఇంకెంతమందికి ఇవ్వాలనే వివరాలన్నీ కలెక్టర్లు, తహసీల్దార్ల వద్దనే ఉంటున్నాయి. వీటిపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇస్తే పరిహారం రాదని తేలినవారు కనీసం ఆశలు వదిలేసుకుంటారు. ఈ స్పష్టత లేక బాధిత కుటుంబాలు ప్రభుత్వం రూ.6 లక్షల పరిహారం ఇస్తుంది, మీ బాకీ తీర్చేస్తాం అని అప్పులిచ్చిన వారికి నచ్చజెబుతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా వారి మొర ఆలకించేవారు లేరు.

- ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 185 మంది చనిపోయారు. వారిలో 143 మందికి పరిహారం రూ.6 లక్షల చొప్పున అందజేశారు. ఇంకా 42 కుటుంబాలకు పరిహారం రావాల్సి ఉంది. అయితే ఈ జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న అన్నదాతలు 500 మందికి పైగానే ఉంటారని రైతుసంఘాలు చెబుతున్నాయి.
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2016- 17లో అధికారికంగా 16 మంది చనిపోయినట్లు గుర్తించారు. ఇందులో మూడు రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందింది. అనధికారికంగా చూస్తే ఈ జిల్లాలో గడిచిన సంవత్సరంలో 20 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2014 నుంచి 2017 డిసెంబరు 15 వరకు 355 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వీటిలో అధికారుల కమిటీ కేవలం 30 మందిని మాత్రమే గుర్తించింది. అందులో 14 కుటుంబాలకు రూ.6 లక్షల పరిహారం అందించారు. మరో పది బలవన్మరణాలపై విచారణ కొనసాగుతోంది.

విచారణ పూర్తయినా అందని పరిహారం



పోచాలు మృతదేహం

పెద్దపల్లి జిల్లా మియాపూర్‌కు చెందిన మ్యాకల పోచాలు (58) అనే రైతు తనకున్న రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. రెండేళ్లుగా దిగుబడి సరిగారాక.. పంట పెట్టుబడికి చేసిన అప్పు రూ.4 లక్షలు తీర్చలేని పరిస్థితి. 2016 సెప్టెంబరు 7న రాత్రి ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రిసభ్య కమిటీ విచారణ పూర్తయింది. ఏడాదిన్నర గడుస్తున్నా ఆ కుటుంబానికి పరిహారం అందనేలేదు.

నిర్లక్ష్యానికి ఏడాది నిండింది



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటకు చెందిన **గోపిడి రమేష్‌రెడ్డి** (45) నాలుగెకరాల్లో పత్తి, మిర్చి సాగు చేశారు. వర్షాభావంతో దిగుబడి రాలేదు. పెట్టుబడికి తెచ్చిన రూ.6 లక్షల అప్పు కట్టలేక 2016 డిసెంబర్ 10న పొలంలోనే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఏడాది గడిచినా త్రిసభ్య కమిటీ విచారణే పూర్తి కాలేదు.



నాలుగెకరాల పత్తి సాగు.. ఐదు క్వింటాళ్ల దిగుబడి

గత వానాకాలంలో నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాం. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం. సెప్టెంబరులో వర్షాలకు పైరు దెబ్బతిని ఐదు క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. ఈ పంటతో అప్పులు ఎలా తీర్చాలని నా భర్త మల్లాజీ సెప్టెంబరు 17న ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదేళ్లుగా పత్తి సాగు చేస్తున్నాం. రూ.8 లక్షలు అప్పులయ్యాయి. ఏడాది క్రితం నా భర్తకు కాలు విరిగితే ఆయన వైద్యానికి, కుటుంబ పోషణకు మరిన్ని అప్పులు చేశాం. ఇంతవరకూ పరిహారం రాలేదు. అధికారులెవరూ సాయం చేయలేదు. అడిగితే విచారణ ఇంకా పూర్తికాలేదని చెబుతున్నారు.

– పద్మ, రఘునాథ్‌పల్లి, జఫర్‌గఢ్ మండలం, జనగామ జిల్లా

ఐదేళ్ల సాగు.. నాలుగు లక్షల అప్పు



వరంగల్ జిల్లా వంగపల్లికి చెందిన **కొత్తకొండ ఐలయ్య** (65)కు 30 గుంటల భూమి ఉంది. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని ఐదేళ్లుగా సాగు చేస్తున్నాడు. దాదాపు రూ.4 లక్షలు అప్పులయ్యాయి. వీటికి తోడు ఈసారి కొంత పంట నష్టపోవటం, పత్తికి గిట్టుబాటు ధర లేకపోవటంతో నవంబర్ 2న పురుగులమందు తాగి చనిపోయాడు. త్రిసభ్య కమిటీ విచారణ పూర్తికాలేదు. ఇప్పటికీ సాయం అందలేదు.

అన్నదాత బలవన్మరణం

నాంపల్లి, న్యూస్‌టుడే: అప్పుల బాధతో నల్గొండ జిల్లాలో ఓ అన్నదాత బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాంపల్లి మండలం దేవత్‌పల్లి పంచాయతీ పరిధిలోని శరబాపురం గ్రామానికి చెందిన ఆడెపు అంజయ్య(49) తన కున్న నాలుగెకరాలతో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. దిగుబడి రాక పెట్టుబడి కోసం చేసిన రూ.5.50లక్షలు తీర్చే మార్గం లేక మనస్తాపంతో శనివారం రాత్రి పొలం వద్దనే పురుగు మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో అంజయ్య మృతి చెందాడు.

కన్న తండ్రే కాలయముడు

- 5 నెలల కుమార్తె దారుణహత్య
- నీళ్ల బకెట్‌లో ముంచి మరీ ఘాతుకం



మరణించిన చిన్నారి

ఉండవల్లి, న్యూస్‌టుడే: అయిదు నెలల పసికందును కన్నతండ్రే అత్యంత పాశవికంగా హత్య చేసిన ఘటన జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలో ఆదివారం జరిగింది. పుల్లూరుకు చెందిన కుర్వ విజయ్‌కుమార్‌కు, వెన్నెలతో రెండేళ్ల క్రితం రెండో వివాహమైంది. వీరికి 5 నెలల కుమార్తె. ప్రసవానికి పుట్టింటికి వెళ్లిన వెన్నెల శనివారమే కుమార్తెతోపాటు పుల్లూరుకు వచ్చింది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో పాపను భర్తకు అప్పగించి పనిమీద బయటకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చింది. అప్పటికే భర్త, కుమార్తె కన్పించకపోవడంతో చుట్టుపక్కల గాలించింది. సమీపంలోని ఆడపడుచు ఇంటికి వెళ్లినట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లింది. ఆ ఇంట్లోని స్నానాల గదిలో ఉన్న నీళ్ల బకెట్‌లో కుమార్తె మునిగి ఉండటాన్ని గుర్తించి హతాశురాలైంది. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి గుండెలవిసేలా రోదించింది. జరిగిన ఘోరాన్ని తెలుసుకున్న గ్రామస్థులు తుంగభద్ర తీరంలో సంచరిస్తున్న విజయ్‌కుమార్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

విపరీత ప్రవర్తనే కారణమా?: విజయ్‌కుమార్ మానసిక స్థితి సరిగా ఉండేది కాదని, ఉన్నట్టుండి ఉన్మాదిగా మారి భార్యపై దాడి చేసేవాడని సమాచారం. ఈ ప్రవర్తన కారణంగానే మొదటి భార్య విడాకులు ఇచ్చినట్టు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ ఉన్మాదంతోనే కుమార్తెను నీళ్ల బకెట్‌లో కూర్చోబెట్టి ఊపిరాడకుండా చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తంచేశారు.

మిత్ర ధర్మాన్ని పాటిద్దాం: చంద్రబాబు

- భాజపాపై అనవసర విమర్శలొద్దు
- ఎన్‌డీఏ, భాజపాతో మనకు విభేదాల్లేవు
- తెదేపా నాయకులకు స్పష్టీకరణ

ఈనాడు అమరావతి: ఒకసారి స్నేహం చేశాక అనవసర విమర్శలు చేయడం తెదేపా చరిత్రలో లేదు.. మిత్రపక్షంగా ఉన్నప్పుడు మిత్ర ధర్మం పాటించాలని ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఉండవల్లిలో ఆదివారం ఆయన తెదేపా కార్యశాలలో మాట్లాడారు. ఎన్డీయే, భాజపాతో మనకు ఎలాంటి విభేదాల్లేవని, అలాగని అన్నింటికీ తలాడించబోమని స్పష్టం చేశారు. 'ఏదైనా అంశంపై భిన్నాభిప్రాయం ఉన్నప్పుడు కచ్చితంగా చెబుతాం. మనం వ్యూహాత్మకంగా ఎక్కడ తప్పటడుగు వేసినా ప్రజలు నష్టపోతారు. రాజకీయాలు శాశ్వతం కాదు. సమాజం, రాష్ట్రం శాశ్వతం. ఒక నమస్కారం పెట్టేసి బయటకు వచ్చేస్తే అది వేరే విషయం. మిత్రపక్షంగా ఉన్నంత కాలం సంయమనంతో ఉండాలి. మీరు దీన్ని అర్థం చేసుకుని నడుచుకోండి. భాజపాపై అనవసర విమర్శలు చేయకండి" అని తెదేపా ప్రజాప్రతినిధులు, నాయకులకు చంద్రబాబు స్పష్టంచేశారు. మిత్రపక్షంగా ఉన్నప్పటికీ ట్రిపుల్ తలాక్ విషయంలో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌ను వ్యతిరేకించామని గుర్తు చేశారు. 'హజ్ యాత్రకు రాయితీ నిలిపివేయడంపైనా విభేదించాం. ఈ అంశంపై ఎన్డీయేతో విభేదించినందుకు తెదేపాకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. సమాజహితం కోసం సిద్ధాంతపరంగా ఎవరితోనైనా విభేదిస్తాం. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం" అని పేర్కొన్నారు. కార్యశాలలో అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ కొంత ఆవేశంగా మాట్లాడారు. "ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే చివరి బడ్జెట్ ఇదే. వచ్చే ఏడాది ఓటాన్ అకౌంట్ బడ్జెట్టే ఉంటుంది. మనకు రావలసిన వాటిలో కొన్నయినా ఈ బడ్జెట్‌లో పెట్టేలా ఒత్తిడి తేవాలి. మీరు కేవలం తెదేపా జాతీయ అధ్యక్షుడే కాదు. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రతినిధి. మీరు పదే పదే దిల్లీ వెళ్లి వాళ్ల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా, తగ్గి మాట్లాడినా ప్రయోజనం ఉండటం లేదు. మన హక్కు మనం సాధించుకోవాలి. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌తో పాటు భాజపాపైనా కసిగా ఉన్నారు. ఆంధ్రులు సౌమ్యులు. కానీ సమయం వచ్చినప్పుడు తడాఖా చూపిస్తారు" అని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. "నేను ఇప్పుడూ రాజీ పడటం లేదు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరిగేంత వరకు ఎన్నిసార్లయినా దిల్లీకి వెళతా. నేను అకౌంట్ క్లోజ్ చేయలేదు. తెరిచే ఉంచుతున్నా. రాజకీయంగా ఎవరు తప్పటడుగు వేసినా నమ్ముకున్న ప్రజలు నష్టపోతారు. కేంద్రంతో గొడవ పడాల్సిన అవసరం లేదు. ప్రజల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అడుగేయాలి. మీరు కూడా అలాగే నడుచుకోవాలి" అని సూచించారు.

25 పార్లమెంటు, 175 శాసనసభ స్థానాల్లో మనదే విజయం

ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించేందుకు పనిచేస్తే విజయం అదే వరిస్తుందని చంద్రబాబు అన్నారు. 'మీ రాజకీయ జీవితంలో ఎన్నడూలేని విధంగా ఇప్పుడు పెద్ద ఎత్తున పనులు సాగుతున్నాయి. వీటిని వినియోగించుకుని రాష్ట్రంలోని 25 పార్లమెంటు స్థానాలు, 175 శాసనసభ స్థానాల్లోనూ విజయం సాధించాలి. సమర్థ, సానుకూల నాయకత్వం ఇస్తున్నామా? అనేది ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల'ని శ్రేణులకు పిలుపునిచ్చారు. 'షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది మేలో ఎన్నికలు వస్తాయి. స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంటు, సహకార ఎన్నికలన్నీ ఒకేసారి జరుగుతాయి. 6 నెలల్లో ఎన్నికలన్నింటినీ పూర్తి చేసుకుంటే మిగతా నాలుగున్నరేళ్లు పూర్తిగా అభివృద్ధిపైనే దృష్టి సారించవచ్చ'ని వివరించారు. 'ఇంటింటికీ తెదేపా'లో భాగంగా 95.45 శాతం ఇళ్లను సందర్శించామని, గతంలో ఎన్నడూ ఇంతగా క్షేత్ర స్థాయికి వెళ్లలేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు తెదేపాకు దూరంగా ఉన్న వర్గాలను గుర్తించి చేరువ కావాలని పిలుపునిచ్చారు. వచ్చే మూడు, నాలుగు నెలల్లో ఈ దిశగా రాజకీయ పునరేకీకరణకు శ్రీకారం చుట్టాలని దిశానిర్దేశం చేశారు. సంస్కృతిని కాపాడుకోవడం ముఖ్యమే కానీ ఆ పేరుతో జూదాలను ప్రోత్సహించవద్దని, ఇవి మితిమీరితే వ్యసనాలకు దారి తీస్తాయని హితవు పలికారు. గతంలో సింగరేణి కార్మికులు కొందరు జీతాలు వచ్చాక మద్యం తాగి ఆ మత్తులో కరెన్సీ నోట్లను గాడిదలకు తినిపించేవారని పేర్కొన్నారు. విచ్చలవిడితనాన్ని ప్రోత్సహించరాదని తెలిపారు.



అతిపెద్ద జాతీయ పతాకాన్ని ఈనెల 25న విజయవాడలో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, వైబ్రెంట్స్ ఆఫ్ కలాం ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబును కలిసి పతాకావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించారు. 122 అడుగుల వెడల్పు, 183 అడుగుల పొడవు(22,326 చ.అ) గల జాతీయ పతాకాన్ని గణతంత్ర వేడుకలకు ముందు రోజు ప్రదర్శించనున్నారు.

నేటి నుంచి పవన్‌కల్యాణ్ యాత్ర

- తొలుత కొండగట్టు అంజన్న దర్శనం
- అనంతరం యాత్ర ప్రారంభం

జూబ్లీహిల్స్ – న్యూస్‌టుడే

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో తన ప్రజాయాత్రను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానంతరం యాత్రను ప్రారంభిస్తానని తెలిపారు. ఆదివారం జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని జనసేన కార్యాలయంలో ఆయన యాత్ర వివరాలు వెల్లడించారు. 2009 ఎన్నికల ప్రచార సమయంలో హైఓల్టేజి విద్యుత్తు తీగ తలకు తగిలి దాదాపు ప్రాణం మీదకు వచ్చిందని, కొండగట్టు ఆంజనేయస్వామి వల్లే ఆ ప్రమాదం నుంచి బయటపడ్డానని చెప్పారు. పరిపూర్ణంగా రాజకీయాల్లోకి వచ్చే సమయంలో తన రాజకీయాలు ఇక్కడి నుంచే ప్రారంభిస్తానని అనుకున్నానని వివరించారు. అందుకే యాత్రను కొండగట్టు నుంచి మొదలుపెడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి మూడు, నాలుగు జిల్లాల్లో పర్యటిస్తానని తెలిపారు. ప్రతి మూడు రోజుల యాత్ర ప్రణాళికనూ అంతకుముందు రోజే వెల్లడిస్తానన్నారు. ఎక్కువగా జనాన్ని కలుసుకోవాలనే రోడ్ షో చేస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభలు ఉండవన్నారు. అంతకుముందు ఆదివారం ఉదయం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో పవన్ తన సతీమణి అన్నాతోపాటు పోలాండ్ రాయబారి ఆడమ్ బురాకోవస్కీతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పోలాండ్ ప్రతినిధులతో మాట్లాడారు. పోలాండ్‌లోని వార్సాలో ఉన్న మహారాజ పాఠశాల, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు.



సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న పవన్ కల్యాణ్ దంపతులు, పోలాండ్ రాయబారి ఆడమ్

'మహారాజ' చరిత్ర చెప్పిన పవన్

పోలాండ్‌లో భారతీయతను గుర్తుచేసే మహారాజ పాఠశాల ఉందని దాని గురించి వివరాలను పవన్ చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పోలాండ్‌పై జర్మనీ దాడి చేసిన సమయంలో అనేక మంది చిన్నారులు అనాథలయ్యారు. సోవియట్ రష్యా వచ్చి ఆ పిల్లల దత్తత గురించి పత్రికల్లో ప్రకటన వచ్చినప్పుడు గుజరాత్‌లోని జాంనగర్ మహారాజ దత్తత తీసుకొని వారికి భారత్‌లో ఆశ్రయమిచ్చారు. పిల్లల మాతృసంస్కృతి ప్రకారం చదివించారు. ఇది తెలుసుకున్న పోలాండ్ రాజు మహారాజ అభ్యర్థన మేరకు వార్సాలో మహారాజ పేరుతో పాఠశాలను ఏర్పాటు చేయించారు. ఆడమ్ కూడా ఆ పాఠశాల విద్యార్థేనని వివరించారు. మరోవైపు తెలుగు చిత్రపరిశ్రమ పోలాండ్‌లో సినిమా చిత్రీకరణకు రావాలని పోలాండ్ రాయబారి ఆడమ్ ఆహ్వానించారు. పవన్ స్పందిస్తూ తన సినిమాలోని కొన్ని సన్నివేశాలు బల్గేరియా ప్రాంతంలో తీశామన్నారు. ప్రాంతాల, దేశాల మధ్య అంతరాన్ని తగ్గించడం నటులతో సాధ్యమవుతుందన్నారు.

యాత్ర షెడ్యూల్ ఇదీ..

- సోమవారం ఉదయం 9 గంటల తరువాత హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం నుంచి ప్రారంభమవుతారు. నేరుగా కొండగట్టు ఆలయానికి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో చేరుకుంటారు. పూజల అనంతరం అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం కరీంనగర్‌లో జనసేన స్థానిక ముఖ్య ప్రతినిధులతో మాట్లాడుతారు.
- 23న కరీంనగర్ జిల్లా జగిత్యాల రోడ్‌లో శుభం గార్డెన్స్‌లో 10.45 నిమిషాలకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జనసేన కార్యకర్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం భోజనం అనంతరం కొత్తగూడెం బయలుదేరి వెళ్తారు. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో కొత్తగూడెం చేరుకొని అక్కడే బస చేస్తారు.
- 24న ఉదయం 9.30 గంటలకు కొత్తగూడెం నుంచి ప్రదర్శనగా బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 3 గంటలకు ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్‌లో జరిగే ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. తర్వాత హైదరాబాద్‌కు పయనమవుతారు.

వీసా కార్యకలాపాలు యథాతథం!

- అత్యవసరసేవల విభాగంలో ఉన్నందునే
- కొనసాగుతున్న అమెరికా స్తంభన
- ౩౦ ఏళ్లలో ఇలాంటి పరిస్థితి ఐదోసారి

ఈనాడు, హైదరాబాద్: అమెరికా పరిపాలనా వ్యవస్థ స్తంభించినా వీసా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. వీసా, పాస్‌పోర్టుల సేవలను ఆ దేశం అత్యవసర విభాగంలోకి తీసుకువచ్చిన నేపథ్యంలో ఆయా కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం ఉండదని అమెరికా రాయబార కార్యాలయ వర్గాల సమాచారం.

వినిమయ బిల్లు ఆమోదాన్ని సెనేట్ అడ్డుకోవటంతో అమెరికాలో పరిపాలన వ్యవస్థ స్తంభించిన (షట్‌డౌన్) విషయం తెలిసిందే. ఈ కారణంగా అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని కార్యాలయాల కార్యకలాపాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఆర్థిక వ్యవహారాలు అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి. ఉద్యోగులు అధికారికంగా త్రిశంకు స్వర్గంలో ఉన్నట్లే. విధులు నిర్వహించినా వేతనాలు పొందలేని పరిస్థితి. నిజానికి అమెరికాలో ఇలాంటివి అరుదుగా జరుగుతూనే ఉంటాయి. గడిచిన 30 ఏళ్లలో ఐదుసార్లు ఆ దేశంలో ఇలాంటి పరిస్థితి తలెత్తింది. 2013 తరవాత తాజాగా అలాంటి పరిస్థితి పునరావృతం కాగా..అది ఎంత కాలం కొనసాగుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

'అత్యవసర' నిర్ణయంతో వెసులుబాటు

వీసాలకు అంతగా డిమాండ్ లేని రోజుల్లో ఈ ప్రక్రియపై కూడా ఈ ప్రభావం ఉండేది. గడిచిన 25 ఏళ్లుగా వాటికి గిరాకీ పెరుగుతూ వస్తోంది. గత ఆరేడేళ్ల కాలంలో ఏటా సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల మంది అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేస్తూ వస్తుండగా..ఆ ప్రభుత్వం కూడా 2014 నుంచి జారీలను గణనీయంగా పెంచింది. ఉద్యోగ, విద్యార్థి వీసాలే ఏటా రెండు లక్షలకుపైగా జారీ అవుతున్నాయి. 2017లో అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం ఏటా వీసాల కోసం 15.91 లక్షల దరఖాస్తులు వస్తున్నట్లు సమాచారం. ఈ కారణంగానే న్యూదిల్లీలోని రాయబార కార్యాలయంతోపాటు ముంబయి, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతాల్లోని కాన్సులేట్ కార్యాలయ్యాల్లో హెచ్1బి సహా విద్యార్థి, పర్యాటక వీసాల జారీ ప్రక్రియ సాగుతోంది. 'ఈ పరిస్థితుల దృష్ట్యానే వీసా, పాస్‌పోర్టుల వ్యవహారాలను అమెరికా ప్రభుత్వం అత్యవసర విభాగంలోకి చేర్చింది. అందువల్ల వీసా ఇంటర్వ్యూల ప్రక్రియ యథావిధిగా సాగుతుంది. ఏదేని మార్పులు ఉన్న పక్షంలో దరఖాస్తుదారుకే నేరుగా ఈ-మెయిల్ ద్వారా వర్తమానం వస్తుంది. ఇంటర్వ్యూల ప్రక్రియను నిలుపుదల చేయాలన్న వర్తమానం శ్వేతసౌధం నుంచి మాకు ఇంతవరకు రాలేదు.' అని రాయబార కార్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

డీఈ ఆస్తుల విలువ రూ.1.7 కోట్లు

అక్రమార్జన కేసులో అవినీతి నిరోధకశాఖ(అనిశా) అధికారులకు పట్టుబడ్డ కామారెడ్డి జిల్లా నీటిపారుదలశాఖ డీఈ శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కలప్రకారం రూ.1.7కోట్లుగా తేల్చారు. మార్కెట్ ధర ప్రకారం వీటివిలువ రూ.5 కోట్ల వరకూ ఉంటుందని అధికారుల అంచనా. కామారెడ్డిలో డీఈగా పనిచేస్తున్న శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన కేసులో అనిశా అధికారులు శనివారం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. సోదాల్లో వెలుగు చూసిన ఆస్తుల వివరాలకు సంబంధించి అనిశా డీజీ పూర్ణచంద్రరావు ఆదివారం ఓప్రకటన విడుదల చేశారు.

ఆస్తి	విలువ (రూపాయల్లో)
1) జీడిమెట్ల సుచిత్ర జంక్షన్ వద్ద రెండతస్తుల ఇల్లు	50 లక్షలు
2) బేగంపేటలో 2100 చదరపు అడుగుల ఫ్లాట్	25 లక్షలు
3) జీడిమెట్లలో వాణిజ్య దుకాణం	20 లక్షలు
4) నిజామాబాద్‌లో 34 ఎకరాల వ్యవసాయ భూమి	62,81,500
5) ఆల్వాల్‌లో ఇళ్లస్థలం	2,50,000
6) నిజామాబాద్ జిల్లా పంగ్రా గ్రామంలో ఇళ్లస్థలం	1,33,000
7) మేడ్చల్ వద్ద ఇళ్లస్థలం	15 లక్షలు
8) నిజామాబాద్‌లో ఇళ్లస్థలం	2,40,000
9) 830 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు	14 లక్షలు
10) నగదు	50 వేలు
11) బీమా ప్రీమియం	3 లక్షలు
12) చిట్‌ఫండ్‌లకు చెల్లించింది	11,86,600
13) గృహోపకరణాలు	5 లక్షలు
14) వెర్నా కారు	12 లక్షలు
15) మారుతి రిడ్జ్‌కారు	7 లక్షలు
16) ఇండికా కారు	4 లక్షలు
17) హోండా యాక్టివా ద్విచక్రవాహనం	50 వేలు

వేల్స్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

ఈనాడు, హైదరాబాద్: యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వేల్స్‌లో తెలుగు సంఘం (టీఏడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్డిఫ్‌లోని ఇండియా సెంటర్‌లో జరిగిన ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున తెలుగు కుటుంబాల వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ జరిగింది. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు హాజరైన వారికి విందు ఇచ్చారు. పాల్గొన్న వారందరికీ వేల్స్ తెలుగు సంఘం వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదిలాబాద్ రిమ్స్‌కు నిమ్స్ టెలివైద్యం

ఈనాడు, హైదరాబాద్: మూత్రపిండాల వైఫల్యం, గుండెజబ్బులకు టెలివైద్య విధానం ద్వారా చేయూతనిచ్చేందుకు ఆదిలాబాద్ రిమ్స్‌తో.. నిమ్స్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మూత్రపిండాలు విఫలమైన రోగులకు రక్తశుద్ధి చికిత్సను, అత్యవసర వైద్యం కోసం ఐసీయూలను రిమ్స్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినా. . పూర్తిస్థాయిలో వైద్యనిపుణులు లేకపోవడం సమస్యగా పరిణమించింది. తాజాగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం వల్ల నిమ్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు వారానికోసారి రిమ్స్‌కు వెళ్లి ప్రత్యేకంగా వైద్య సేవలందించి రావడంతో పాటు.. ఎప్పుడు అత్యవసరంగా సంప్రదించాల్సి వచ్చినా టెలివైద్య విధానంలో సహకరిస్తారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు టెలివైద్యం ఉపయోగపడుతుందని వైద్యవర్గాలు భావిస్తున్నాయి.

న్యాయవాద వృత్తికి మరింత నాణ్యత అవసరం

జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు వెల్లడి

దిల్లీ: భారత్‌లో న్యాయవాదులపై మరీ అంతగా మంచి అభిప్రాయాలు లేవని.. ఈ వృత్తికి మరింత నాణ్యత అవసరం ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు అన్నారు. న్యాయ విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాల పట్ల ఆకర్షితులు కావొద్దని.. అసలైన న్యాయవాదులు ఉండాల్సిన స్థలం కోర్టేనని వ్యాఖ్యానించారు. 14వ కేకే లూథ్రా స్మారక మూట్ కోర్టు పోటీ కార్యక్రమంలో ఆదివారం ఆయన ఈ మేరకు ప్రసంగించారు. న్యాయవాద రంగంలోకి అడుగుపెట్టే ముందు వృత్తిపరమైన విధులను తప్పనిసరిగా అర్థం చేసుకోవాలని అన్నారు. ఇటు పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.

కాంగ్రెస్‌తో సీపీఎం పొత్తు కల్ల

ముసాయిదా తీర్మానం ఆమోదం

కోల్‌కతా: కాంగ్రెస్ పార్టీతో సీపీఎం ఎలాంటి ఎన్నికల పొత్తులు, సర్దుబాట్లు చేసుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇలాంటి పొత్తులు, సర్దుబాట్ల ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ సీపీఎం కేంద్ర సంఘం(సీసీ) ఆదివారం ఓ రాజకీయ తీర్మానం ముసాయిదాను ఆమోదించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇక్కడ మూడురోజుల పాటు జరిగిన సీసీ సమావేశం ఆఖరురోజైన ఆదివారం తీర్మానం ముసాయిదాకు ఆమోదముద్ర పడింది. ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరగనున్న సీపీఎం సదస్సులో దీనిపై చర్చించనున్నారు.

కాబూల్‌లో తాలిబన్ల నరమేధం

ఇంటర్‌కాంటినెంటల్ హోటల్‌పై దాడి: 43 మంది బలి

కాబూల్

అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లో తాలిబన్ ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. శనివారం రాత్రి ఆరుగురు సాయుధులు ఇక్కడి ఆరంతస్తుల ఇంటర్‌కాంటినెంటల్ హోటల్‌ను స్వాధీనంలోకి తెచ్చుకొని బీభత్సం సృష్టించారు. భోజనం చేస్తున్న వారిపై కాల్పులు జరపడంతో పాటు, గదుల్లో ఉన్నవారిని బందీలుగా పట్టుకున్నారు. కాల్పుల కారణంగా మంటలు వ్యాపించడంతో అతిథులు దిక్కులేనిస్థితిలో చిక్కుకున్నారు. ఈ దుర్ఘటనలో 43 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఓ మహిళ సహా 14 మంది విదేశీయులు ఉన్నారు. మృతుల్లో 11 మంది అఫ్గాన్‌లోని ప్రయివేటు విమానయాన సంస్థ కామ్‌ఎయిర్‌కు చెందిన ఉద్యోగులు కాగా, ఉక్రెయిన్, జర్మనీ, కజకిస్థాన్, గ్రీకు దేశస్థులూ ఉన్నారు. 41 మంది విదేశీయులు సహా దాదాపు 150 మంది గాయపడ్డారు. హెలికాప్టర్‌లో వచ్చిన ప్రత్యేక దళం సైనికులు తాడు సాయంతో హోటల్ పైభాగంలో దిగి ఉగ్రవాదులను ఎదుర్కొన్నారు. ఉభయపక్షాల మధ్య సుమారు 17 గంటలపాటు కాల్పులు కొనసాగాయి. ఈ దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులంతా హతమయ్యారు.



కాబుల్‌లోని ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ నుంచి ఎగసిపడుతున్న దట్టమైన పొగ. అంతరచిత్రంలో దుప్పట్లనే తాడుగా చేసి కిందకి దిగే ప్రయత్నం చేస్తున్న వినియోగదారులు

దుప్పట్ల సాయంతో తప్పించుకున్నారు

గదుల్లో ఉన్న కొందరు బాల్కనీ నుంచి దుప్పట్ల సాయంతో తప్పించుకునే ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో కొందరు పట్టుతప్పి కిందపడిపోయారు.

వచ్చినవారిలో ఇద్దరు మానవ బాంబులు

చిన్నగుట్టపై ఉన్న ఈ హోటల్ సమావేశాలు, వివాహ వేడుకలకు పెట్టింది పేరు. ఆదివారం జరగాల్సిన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సమావేశంలో పాల్గొనవలసిన పలువురు ఇక్కడే బస చేశారు. శనివారం రాత్రి 9 గంటల సమయంలో తేలికపాటి రైఫిళ్లు, రాకెట్‌తో ప్రయోగించే గ్రనేడ్లు పట్టుకొని, అందమైన దుస్తులు ధరించిన తాలిబన్లు చొరబడ్డారు. వారిలో ఇద్దరు తమ శరీరానికి పేలుడుపదార్థాలను కట్టుకున్న మానవబాంబులు కావడంగమనార్హం. తొలుత వంటగదిలోకి వెళ్లి దాన్ని పేల్చివేశారు. బాంబు వేయడానికిముందు ఒక ఉగ్రవాదయితే అక్కడ భోజనం చేశాడు కూడా. తరువాత గదులవైపు వెళ్లి 'విదేశీయులు ఎక్కడ? మేం అఫ్గాన్లను కాల్చం' అంటూ కేకలు వేశారు. హోటల్‌లో మూడు వారాల క్రితమే ప్రయివేటు భద్రతా సిబ్బందిని నియమించారు. ఉగ్రవాదులు వచ్చిన సమయంలో వారంతా పారిపోయారు. ఉగ్రవాదులకు హోటల్ సిబ్బంది సహకరించి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దాడిని గురువారం రాత్రే జరపాలని అనుకున్నామని, అయితే ఆ రోజు వివాహం జరుగుతుండడంతో వాయిదా వేసుకున్నామని తాలిబన్ల అధికారి ప్రతినిధి ముజాహిద్ పేర్కొన్నాడు.

ఇంటింటికీ వెళ్లి పోలీసుల హతం

ఇదే సమయంలో మిగిలిన చోట్లా తాలిబన్ల దారుణాలు కొనసాగాయి. బాల్క్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 18 మంది పోలీసు అధికారులను బయటకు లాక్కొచ్చి తుపాకీలతో కాల్చారు. హేరాత్‌లో కారు బాంబు పేల్చడంతో 13మంది పౌరులను, ఫారా ప్రాంతంలో ఓ పోలీసుఉన్నతాధికారిని హత్యచేశారు.

> **భారత్ ఖండన**
>
> **దిల్లీ:** కాబూల్‌లో హోటల్‌పై తాలిబన్లు చేసిన దాడిని భారత్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. భారత్, అఫ్గాన్ ఇరు దేశాలకూ పొరుగుదేశంలోని ఉగ్రవాద కేంద్రాలే సమస్యగా మారాయని, వీటిని అరికట్టవలసి ఉందని పేర్కొంది.

బుద్ధి మారని పాకిస్థాన్

- వరుసగా నాలుగో రోజూ కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు
- దీటుగా బదులిస్తున్న భారత జవాన్లు

జమ్ము: పాకిస్థాన్ బుద్ధి మారలేదు. వరుసగా నాలుగో రోజు కాల్పుల విరమణ ఒప్పందానికి పాల్పడింది. జమ్ము కశ్మీరు రాష్ట్రంలో నియంత్రణ రేఖ వెంబడి నౌషెర, రాజౌరి, అఖ్నూర్ సెక్టార్లలో భారీ ఎత్తున పేలుడు గుళ్లతో దాడికి పాల్పడింది. పైగా మీరే కాల్పుల విరమణ ఒప్పందానికి పాల్పడుతున్నారంటూ ఆరోపించింది. రాజౌరి జిల్లాలోని భావని, కరాలి, సైద్, నంబ్, షేర్ మకరి ప్రాంతాల్లో పాకిస్థాన్ భారీ ఎత్తున మోర్టారు గుళ్లతో కాల్పులకు పాల్పడిందని అధికారులు వెల్లడించారు. అఖ్నూర్‌లోనూ ఇదే పరిస్థితి అని భారత జవాన్లు ధీటుగా ఎదురు కాల్పులు జరుపుతున్నారని చెప్పారు. మరోవైపు పాక్ కాల్పుల్లో శనివారం రాత్రి గాయపడిన సైనికుడొకరు ఆదివారం మరణించారు. గురువారం నుంచి సరిహద్దుల్లో కాల్పుల్లో మరణించిన భారత పౌరులు, జవాన్ల సంఖ్య 11కు చేరింది. పాక్ కాల్పుల కారణంగా సరిహద్దుల్లోని భారత శివారు గ్రామాలు, చిన్న పట్టణాల్లో జనసంచారం కనిపించడం లేదు. దాదాపు 40వేల మంది ప్రజలు ఇళ్లు వదిలి వెళ్లిపోయారు. పాక్ మోర్టార్ దాడుల కారణంగా యుద్ధ ప్రాంతంలో ఉన్నామా అన్న భయం వెంటాడుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో గాయపడిన జంతువులు, పగిలిన కిటికీలు కనిపిస్తున్నాయి. గోడలపై పేలుడు గుళ్ల తాలూకూ శకలాలు కనిపిస్తున్నాయి. పాడి పరిశ్రమకు పేరొందిన జియోరా క్షేత్రంలో పేలుళ్ల ధాటికి పాకలకు మంటలు వ్యాపించి పలు పాడిపశువులు మరణించాయి.



పాకిస్థాన్ ప్రయోగించిన మోర్టార్ షెల్స్‌ను చూపిస్తున్న ఆర్.ఎస్.పురా సెక్టార్‌లోని సుచేత్‌గఢ్ గ్రామస్థులు

తొలుత ఇళ్లను వదిలి పెట్టడానికి ఇష్టపడని ప్రజలు పాక్ నుంచి కాల్పులు ఆగకపోవడంతో ప్రాణాలు రక్షించుకోవడానికి ఇళ్లు వదిలి వెళ్లిపోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆర్నియాలో యశ్‌పాల్(80) తన కుటుంబంతో కలిపి ఒక రాత్రి మంచం కింద దాక్కొని బిక్కు బిక్కుమంటూ గడిపారు. రెండు రోజుల పాటు ఏకధాటిగా పాక్ నుంచి కాల్పులు జరగడంతో పాటు శుక్రవారం రాత్రి పరిస్థితి మరింత భయానకంగా తయారయిందని, రెండు గుళ్లు వచ్చి తమ ఇంటిని తాకాయని, ఇల్లు నాశనమయిందని ఆయన తెలిపారు. ఇలాంటి దాడులు 1965, 1971 యుద్ధాల్లో చూశామని, ఇంతటి స్థాయిలో మోర్టారు గుళ్లు ఆర్నియాలో అప్పటి నుంచి ఇప్పటి వరకు పడలేదని ఆయన తెలిపారు. చాలా మంది దూర ప్రాంతాల్లోని తమ బంధువుల వద్దకు వెళ్లగా కొంత మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో తల దాచుకుంటున్నారు. పాక్‌లో భారత డిప్యూటీ హైకమిషనర్ జె.పి.సింగ్‌ను పాక్ వరుసగా నాలుగో రోజు పిలిపించింది. తమ వైపు నుంచి ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే భారత్ కాల్పులకు పాల్పడిందని ఆరోపించింది.

> **శత్రువులపై దాడికి అవసరమైతే సరిహద్దులు దాటుతాం: రాజ్‌నాథ్**
>
> **లఖ్‌నవూ:** శత్రువులను ఎదుర్కొనే విషయమై సరిహద్దులను దాటేందుకు కూడా భారత్ వెనుకాడబోదని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. శత్రువులపై సొంత గడ్డపైనే కాకుండా, అవసరమైతే విదేశీ భూభాగంలోకి వెళ్లి దాడి చేస్తామని తెలిపారు. 'కొన్ని నెలల క్రితం పాకిస్థాన్ పిరికితనంతో వ్యవహరించి మన జవాన్లపై దాడి చేసింది. 17 మంది జవాన్లు అమరులయ్యారు. దీనిపై ప్రధాని మోదీ అందరితో చర్చించారు. అనంతరం భారత సైనికులు పాక్‌లో ప్రవేశించి అక్కడ ఉగ్రవాదులను మట్టుపెట్టార'ని వివరించారు. ఆదివారం ఇక్కడ జరిగిన భారతీయ రైల్వే మాల్‌గోదాం శ్రామిక్ సంఘ్ సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

మిత్రుడు మోదీకి కృతజ్ఞతలు

- ఇజ్రాయెల్ ప్రధాని

జెరుసలేం: భారత్‌లో తాను ఇటీవల జరిపిన పర్యటన చరిత్రాత్మకమని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమెన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఈ పర్యటన.. రెండు దేశాల ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసిందని, అందువల్ల అది చిరస్మరణీయమవుతుందని చెప్పారు. ఆరు రోజుల పర్యటన కోసం నెతన్యాహు ఈ నెల 14న దిల్లీ వచ్చిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి, స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి ఇజ్రాయెల్ ప్రధానికి స్వాగతం పలికారు. యాత్ర ముగించుకొని స్వదేశానికి చేరిన నెతన్యాహు.. తాజాగా వారాంతపు క్యాబినెట్ సమావేశంలో మాట్లాడారు. "భారత్‌లో చరిత్రాత్మక పర్యటన జరిపి గతవారం నేను స్వదేశానికి తిరిగొచ్చా. నాకు అద్భుత స్వాగతం పలికిన నా మిత్రుడు మోదీకి కృతజ్ఞతలు" అని మంత్రివర్గ సహచరులకు తెలిపారు. ఈ పర్యటనలో అనేక ముఖ్య ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. 2008లో ముంబయి ఉగ్రవాద దాడుల సమయంలో.. ఆయాగా పనిచేస్తున్న భారత మహిళ సాయంతో ప్రాణాలు దక్కించుకున్న చిన్నారి మోషెను గుర్తుచేసుకున్నారు.

డార్విన్ సిద్ధాంతంపై మంత్రి వ్యాఖ్యల్ని తప్పుపట్టిన శాస్త్రవేత్తలు

దిల్లీ: మానవ పరిణామక్రమంపై ఛార్లెస్ డార్విన్ రూపొందించిన సిద్ధాంతం అశాస్త్రీయమైనదనీ, దానిని పాఠ్యాంశాలనుంచి తొలగించాలనీ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ చేసిన వ్యాఖ్యల్ని శాస్త్రవేత్తలు తప్పుపట్టారు. మంత్రి ప్రకటనకు శాస్త్రీయ ప్రాతిపదిక ఏదీ లేదని దేశంలోని మూడు ప్రఖ్యాత సంస్థల శాస్త్రవేత్తలు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 'పరిణామ సిద్ధాంతం విషయంలో డార్విన్ చేసిన కృషి అపూర్వం. అది తిరుగులేనిది. అనేక పరిశీలనల్లో రుజువైన ఆ సిద్ధాంతంపై శాస్త్రీయంగా ఎలాంటి విభేదాలూ లేవు. ఈ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించాలనుకోవడం తిరోగమన చర్య. ప్రపంచవ్యాప్తంగా ఈ సిద్ధాంతానికి మద్దతు ఉంది' అని వారు వివరించారు. ఈ ప్రకటనను వెలువరించినవారిలో భారత జాతీయ శాస్త్ర అకాడమీ (దిల్లీ), భారతీయ శాస్త్రాల అకాడమీ (బెంగళూరు), జాతీయ శాస్త్రాల అకాడమీ (అలహాబాద్) శాస్త్రవేత్తలుఉన్నారు. మంత్రి సత్యపాల్‌సింగ్ మాత్రం తన మాటల్ని పునరుద్ఘాటిస్తున్నారు. 'నేను ఆధారాల్లేకుండా మాట్లాడలేదు. నేనేమీ ఆర్ట్స్ నేపథ్యం నుంచి వచ్చినవాడిని కాను. రసాయన శాస్త్రంలో దిల్లీ విశ్వవిద్యాలయంనుంచి పీహెచ్‌డీ పూర్తిచేశాను' అని ఓ ఛానెల్ ముఖాముఖిలో ఆయన చెప్పారు.



అధికారులు తనిఖీలు చేపడుతుండగా బయటకువచ్చిన మొసలి

ఆయుధాల సోదాకు వెళ్తే..

మొసలి ఎదురు

నిందితుడి ఇంట్లో అధికారుల బెంబేలు

మాస్కో: ఆయుధాల కోసం ఓ నిందితుడి ఇంటిలో తనిఖీలు చేపట్టిన పోలీసులు పెద్ద మొసలిని చూసి బెంబేలెత్తారు. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. 'అక్రమ ఆయుధాల చెలామణీ కేసులో నిందితుడి ఇంటికి తనిఖీలకు వెళ్లాం. పురాతన భవనాలతో ప్రఖ్యాతి గడించిన పీటర్‌గ్రాఫ్ ప్రాంతంలో ఈ ఇల్లు ఉంది. దీని అట్టడుగు అంతస్తులో సోదాలు చేపడుతుండగా నీళ్ల మడుగులో నుంచి రెండు మీటర్ల పొడవైన మొసలి బయటకు వచ్చింది. చీకట్లో బురద నీటి మధ్యలో దాన్ని మేం గుర్తించాం. దీంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యాం'అని అధికారులు తెలిపారు. అయితే 2005 నుంచే ఆ మొసలి ఇక్కడే ఉంటోందని పొరుగున నివసించే ఓ వ్యక్తి వెల్లడించారు. ప్రస్తుతం దాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వెంకయ్య ఇంట సంక్రాంతి సంబరం

- పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు
- మన్మోహన్, హమీద్‌అన్సారీ హాజరు

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి నివాసంలో ఆదివారం సాయంత్రం సంక్రాంతి సంబరం సంప్రదాయబద్ధంగా జరిగింది. ప్రధాని నరేంద్రమోదీతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమం దేశ రాజధానిలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించింది. ప్రధాని నరేంద్రమోదీ సుమారు గంటసేపు ఈ కార్యక్రమంలో కూర్చొని సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకయ్యనాయుడు ఎన్నో ఏళ్ల నుంచి దిల్లీలో సంక్రాంతి సంబరాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. స్నేహాన్ని, సంస్కృతిని మేళవించి అద్భుతంగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని, దీనివల్ల దక్షిణ భారతీయులందర్నీ ఒకచోట కలవడానికి వీలవుతోందని కొనియాడారు. 'భారతదేశంలోని పండుగలన్నీ ప్రకృతితో మమేకమవుతాయి. గ్రామీణ సంస్కృతి, రైతాంగ జీవనం వీటితో సమ్మిళితమవుతుంది. పురాతన సంప్రదాయాల ద్వారా ఒకతరం నుంచి మరో తరానికి సంస్కృతి బదిలీ అవుతుంది. ఉపరాష్ట్రపతి కొన్నేళ్ల నుంచి దిల్లీలో స్నేహంతోపాటు సంస్కారాన్ని అద్భుతంగా జోడించి ఉత్సవాన్ని కొనసాగిస్తున్నారు' అని పేర్కొన్నారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నివాసంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న (కుడి నుంచి ఎడమకు వరుసగా) అమిత్‌షా, సుష్మాస్వరాజ్, వెంకయ్యనాయుడు దంపతులు, ప్రధాని మోదీ, హమీద్ అన్సారీ, మన్మోహన్‌సింగ్, పి.జె.కురియన్, నిర్మలా సీతారామన్, అశోక్ గజపతిరాజు

ఈ సందర్భంగా కొందరు కళాకారులు భారతీయ సంప్రదాయ నృత్యంతో యోగాను జోడించి ప్రదర్శించడాన్ని కొనియాడారు. కళాకారులను వేదికపైకి పిలిచి అభినందించారు.

[illegible] నుంచి వచ్చిన సంగీత వాద్యకారులకూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్‌అన్సారీ, రాజ్యసభ ఉపాధ్యక్షుడు పీజే కురియన్, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, భాజపా సీనియర్ నేత ఎల్‌కే అద్వాణి, కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, నిర్మలాసీతారామన్, అశోక్‌గజపతిరాజు, స్మృతిఇరానీ, విజయ్‌గోయల్, జయంత్‌సిన్హా, ఆర్‌కే సింగ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు, అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, కేబినెట్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌సిన్హా, హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గాబా, తెదేపా లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం, ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్, తెరాస ఎంపీ కె.కేశవరావు, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలచారి, తెలంగాణ భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి, సీవీసీ కేవీ చౌదరి, కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్‌తోపాటు కేంద్రంలో పనిచేస్తున్న ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులు, జాతీయ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి అయ్యాక నిర్వహించిన తొలి సంక్రాంతి సంబరం కావడంతో దిల్లీలోని దక్షిణ భారతీయులంతా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన అందరినీ ఆప్యాయంగా పలుకరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతితో ఫొటోలు, సెల్ఫీలు దిగడానికి యువత పోటీపడింది. ఈ కార్యక్రమానికి వెంకయ్య కూతురు దీప వ్యాఖ్యాతగా వ్యవహరించారు. తెలుగు సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. ఏటా సంక్రాంతి ఉత్సవాలు సొంతూరులో చేసుకునే వెంకయ్యనాయుడు దక్షిణ భారతీయుల కోసం సంక్రాంతి అనంతర సంబరాలను దిల్లీలో నిర్వహించడాన్ని ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు.

కలాం అంతరిక్ష శాస్త్రవేత్త అయితే..

మోదీ సామాజిక శాస్త్రవేత్త!

రాష్ట్రపతి కోవింద్ ఉద్ఘాటన

అహ్మదాబాద్: దివంగత అబ్దుల్‌కలాం అంతరిక్ష శాస్త్రవేత్త అయితే...ప్రధాని నరేంద్రమోదీ సామాజిక శాస్త్రవేత్త అని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్ఘాటించారు. గుజరాత్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆదివారం ప్రసంగించిన కోవింద్ మాజీ రాష్ట్రపతి కలాం, ప్రస్తుత ప్రధాని మోదీలను ఇలా అభివర్ణించారు. మోదీ ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి కాగా...కలాం కొంతకాలం పాటు ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. అయితే, నేటి స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థుల్లో ఎవరూ కూడా చిన్నతనంలో మోదీ లాగా తేనీటిని విక్రయించి, కష్టపడి ఉండకపోవచ్చన్నారు. ఇక్కడే పుట్టి... పెరిగి... చదువుకుని..దేశానికే ప్రధాని అయిన వ్యక్తి మోదీ అన్నారు.

క్షయపై యుద్ధప్రాతిపదికన పనిచేయండి

సీఎంలకు ప్రధాని పిలుపు

దిల్లీ: క్షయ వ్యాధి నిర్మూలనపై యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సవరించిన జాతీయ క్షయ నియంత్రణ కార్యక్రమం (ఆర్‌టీఎన్‌సీపీ) పురోగతిని కనీసం ప్రతి త్రైమాసికానికైనా సమీక్షించాలని కోరుతూ వారికి లేఖలు రాశారు. అంటువ్యాధుల్లోకెల్లా అత్యధిక మందిని పొట్టనబెట్టుకుంటున్నది క్షయేనని.. ఏటా 29 లక్షల క్షయ కేసులు కొత్తగా నమోదవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. ఏటా దాదాపు 4.2లక్షల మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారని. . దేశానికి క్షయ వల్ల రూ.20వేల కోట్ల వార్షిక నష్టం కలుగుతోందని తెలిపారు. ప్రజా వైద్యసేవల వ్యవస్థలో వ్యాధి గుర్తింపు, చికిత్స కోసం అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ. . ఇలాంటి విషాదాలు చోటుచేసుకోవడాన్ని కొనసాగనివ్వకూడదని అన్నారు.

భారత్ అంటే అభివృద్ధి

దావోస్ సదస్సులో మోదీ మంత్రమిదే ★ నేడు లాంఛనంగా ప్రారంభం కానున్న ప్రపంచ ఆర్థిక సదస్సు

దిల్లీ: మోదీ అభివృద్ధి మంత్రం వినడానికి ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) సిద్ధమయింది. భారత్‌లో వాణిజ్య అవకాశాల గురించి ప్రధాని ప్రపంచానికి విడమర్చి చెప్పనున్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారత్ ఏ విధంగా చోదకశక్తో వివరించనున్నారు. మునుపెన్నడూ లేనంతగా ఈ సారి భారత్ నుంచి 130 మందికి పైగా ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే 48వ ప్రపంచ ఆర్థికసదస్సులో వ్యాపార, రాజకీయ, విద్యా రంగాలతో పాటు పౌర సమాజం నుంచి 3వేల మంది ప్రపంచ నేతలు హాజరవుతున్నారు. సోమవారం సాయంత్రం డబ్ల్యూఈఎఫ్ ఛైర్మన్ క్లాస్ షావబ్ స్వాగత సందేశంతో సదస్సు ప్రారంభమవుతుంది. అనంతరం బాలీవుడ్ షారుక్ ఖాన్, ఆస్ట్రేలియా నటి కేట్ బ్లాంషెట్, సంగీత కళాకారుడు ఎల్టన్ జాన్‌ను క్రిస్టల్ పురస్కారాలతో సత్కరిస్తారు. బాలె నృత్య ప్రదర్శన కూడా ఉంటుంది.

నవ్యావిష్కరణల భారత్ గురించి: అధికారిక సమావేశాలు మంగళవారం ప్రారంభమవుతాయి. ప్రధాని మోదీ ప్రారంభ సదస్సునుద్దేశించి ప్రసంగిస్తారు. ఇతర దేశాల అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి భారత్‌కున్న ఆసక్తిని తెలియజెప్పడంతో పాటు భారత్ అభివృద్ధిలో ఇతర దేశాలు పాలుపంచుకోవాలని మోదీ కోరనున్నారు. పెట్టుబడులను ఆహ్వానించనున్నారు. మోదీ తన ప్రసంగంలో నవ, యువ, నవ్యావిష్కరణల భారత్ గురించి వివరిస్తారని భావిస్తున్నారు. అవినీతి నియంత్రణకు, నల్లధనం కట్టడికి, పన్నుచెల్లింపులను గాడిలో పెట్టడానికి తీసుకున్న చర్యలను వివరించవచ్చు. ఉగ్రవాదం, ఆర్థిక అసమతౌల్యం, సైబర్ ముప్పులపై ప్రపంచం సమష్టిగా పోరాడాలని కోరనున్నారు. 1997లో అప్పటి ప్రధాని దేవెగౌడ హాజరయిన తర్వాత మళ్లీ దావోస్ సదస్సుకు హాజరవుతున్న భారత ప్రధాని మోదీయే.

మోదీతో పాటు ఆరుగురు కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రధాన్, ఎం.జె.అక్బర్, జితేంద్ర సింగ్ హాజరుకానున్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నేతృత్వంలో ముకేశ్ అంబానీ, గౌతమ్ ఆదాని, అజీం ప్రేమ్‌జీ, రాహుల్ బజాజ్, ఎన్.చంద్రశేఖరన్, చందా కొచ్చర్, ఉదయ్ కోటక్, అజయ్‌సింగ్ తదితరులతో కూడిన సీఈఓ ప్రతినిధి బృందం హాజరవుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సదస్సుకు హాజరవుతున్నారు.

సీఈఓలకు విందు: వివిధ దేశాల సీఈవోలకు మోదీ సోమవారం సాయంత్రం విందు ఇవ్వనున్నారు. మంగళవారం డబ్ల్యూఈఎఫ్‌కు చెందిన దాదాపు 120 మంది అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధులతో మోదీ సమావేశమవుతారు. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు అలయన్ బెరెస్ట్‌తో ద్వైపాక్షిక భేటీ ఉంటుంది. ద్వైపాక్షిక పెట్టుబడుల రక్షణ ఒప్పందంతో పాటు ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య సంఘం గురించి ఈ భేటీలో ప్రముఖంగా చర్చకు వస్తుంది. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ కూడా ఈ సదస్సులో ప్రసంగించనున్నారు. 21వ శతాబ్దపు సవాళ్లను విధాన రూపకర్తలు ఏ విధంగా పరిష్కరించవచ్చో ఆయన వివరిస్తారు మహిళా సాధికారికత ద్వారా భారత్‌లో మార్పు తీసుకురావడంపై షారుక్‌ఖాన్ మాట్లాడతారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముగింపు ఉపన్యాసం ఇస్తారు. తన ప్రసంగంలో 'అమెరికా ఫస్ట్' విధానాన్ని వివరిస్తారు. మోదీ, ట్రంప్ సమావేశం ఉండకపోవచ్చు. పాక్ ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ దావోస్ సదస్సుకు హాజరవుతున్నారు. మోదీ, అబ్బాసీ మధ్య భేటీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు. జర్మన్ ఛాన్సెలర్ యాంజెల మెర్కెల్, ఇటలీ ప్రధాని పాలో జెంటిలోని, ఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ జీన్ క్లాడ్ జంకర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్యాన్యుయెల్ మాక్రోన్, బ్రిటన్ ప్రధాని థెరెసా మే, కెనడా ప్రధాని జస్టిన్ తదితర ప్రపంచ నేతలు హాజరు కానున్నారు. డబ్ల్యూఈఎఫ్ సదస్సు నేపథ్యంలోనే ప్రపంచ ఆర్థిక సంస్థకు సంబంధించి మంత్రుల స్థాయి సమావేశం అనధికారికంగా జరుగుతుంది. ఈ సమావేశానికి భారత్ నుంచి సురేశ్ ప్రభు హాజరవుతారు.



ప్రపంచ ఆర్థికవేత్తల సదస్సు జరిగే భవనం ఇదే

> **దావోస్‌లో భారతీయం**
>
> **స**దస్సులో భారతీయత ఉట్టిపడనుంది. ఈ సారి భారత్ స్వాగత వేడుకను నిర్వహించనుంది. చవులూరించే వంటకాలతో ఆతిథ్యం ఇవ్వనుంది. యోగా కార్యక్రమాలతో సదస్సు ప్రత్యేకత సంతరించుకోనుంది. సదస్సు జరిగినన్ని రోజులూ యోగాలో శిక్షణ నిర్వహిస్తుంది.

> **భారత్ అంటే వ్యాపారం**
>
> **దా**వోస్ సదస్సులో పాల్గొంటున్న నేపథ్యంలో ప్రధాని ఆదివారం ట్విట్టర్‌లో స్పందిస్తూ "భారత్ అంటే వ్యాపారం" అన్నారు. అంతర్జాతీయ సమాజంతో భవిష్యత్తులో భారత సంబంధాల గురించి తన ఆలోచనలను పంచుకోవడానికి ఆసక్తితో ఎదురు చూస్తున్నానని చెప్పారు.

22 బొగ్గు క్షేత్రాలపై దర్యాప్తును నిలిపివేశాం

సుప్రీం కోర్టుకు విన్నవించిన సీబీఐ

దిల్లీ: బొగ్గు గనుల కుంభకోణం కేసులపై సీబీఐ.. సుప్రీం కోర్టు ఎదుట ఒక స్థాయీ నివేదికను సమర్పించింది. 1993 నుంచి 2005 మధ్య జరిగిన 22 బొగ్గు క్షేత్రాల కేటాయింపుపై విచారణను మూసివేసినట్లు అందులో తెలిపింది. ముఖ్య విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) ఆమోదంతో ఈ పనిచేశామని వివరించింది. 1993-2005 కాలానికి సంబంధించి మొత్తం 43 బొగ్గు క్షేత్రాలపై విచారణ చేపట్టామని తెలిపింది. అందులో 22 క్షేత్రాలకు సంబంధించి విచారణను మూసేయగా, మిగతా 21 బొగ్గు బ్లాకులపై 16 కేసులను నమోదు చేశామని పేర్కొంది. ఈ 16 కేసుల్లో ఏడింటికి సంబంధించి తుది నివేదికలను దాఖలు చేశామని విన్నవించింది. ఈ కుంభకోణంతో ముడిపడిన కేసులపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ సాగుతోంది.

ఛాంపియన్స్




ఆస్ట్రేలియన్ ఓపెన్లో స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ దూసుకెళ్తున్నాడు. ప్రీక్వార్టర్స్‌లో ప్రత్యర్థి నుంచి ప్రతిఘటన ఎదురైనా.. కాచుకుని ఈ టోర్నీలో పదోసారి క్వార్టర్‌ఫైనల్ చేరాడు. మరోవైపు డెన్మార్క్ భామ వోజ్నియాకి, క్రొయేషియా స్టార్ మారిన్ సిలిచ్, మూడో సీడ్ దిమిత్రోవ్ కూడా తుది ఎనిమిదిమంది జాబితాలో చోటు సంపాదించారు.

రఫా పదోసారి

- క్వార్టర్స్‌లో ప్రవేశం
- స్క్వాట్జ్‌మన్‌పై చెమటోడ్చి విజయం

వోజ్నియాకి, సిలిచ్, దిమిత్రోవ్ ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్



స్వితోలినా

మెల్‌బోర్న్

రాడ్‌లేవర్ ఎరీనాలో టాప్‌సీడ్ రఫా జోరు కొనసాగుతోంది. మరో అద్భుత ప్రదర్శనతో అతను క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించాడు. ప్రీక్వార్టర్స్‌లో అర్జెంటీనా కుర్రాడు డిగో స్క్వాట్జ్‌మన్ నుంచి గట్టిపోటీ ఎదురైనా.. అనుభవం రంగరించిన నాదల్ 6-3, 6-7 (4-7), 6-3, 6-3తో విజయం సాధించి ముందంజ వేశాడు. తొలి సెట్ ఎనిమిదో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన నాదల్.. ఆపై 6-3తో సెట్ గెలిచాడు. రెండో సెట్లో రఫాకు స్క్వాట్జ్‌మన్ నుంచి ఊహించని పోరాటం ఎదురైంది. ఈ సెట్ ఆరంభంలో స్క్వాట్జ్‌మన్ సర్వీస్ బ్రేక్ చేసి 4-3తో నాదల్ ఆధిక్యంలో నిలువగా.. ఆ వెంటనే స్క్వాట్జ్‌మన్ బ్రేక్ సాధించడంతో స్కోరు 4-4తో సమమైంది. టైబ్రేకర్‌కు మళ్లిన ఈ సెట్లో సర్వీసులతో ఆకట్టుకున్న స్క్వాట్జ్‌మన్.. 7-6 (7-4)తో సెట్ గెలుచుకున్నాడు. అక్కడ నుంచి రఫాదే జోరు. మూడో సెట్‌లో ఒకసారి, నాలుగో సెట్‌లో రెండుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి అతను సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రఫా ఏడు ఏస్‌లతో పాటు 46 విన్నర్లు కొట్టాడు. ఈ విజయంతో నంబర్‌వన్ ర్యాంకును కూడా అతను నిలబెట్టుకున్నాడు. క్వార్టర్స్‌లో అతను మారిన్ సిలిచ్‌తో పోరుకు సిద్ధమయ్యాడు. సిలిచ్‌పై నాదల్‌కు 5-1తో తిరుగులేని రికార్డు ఉంది.

దిమిత్రోవ్ ముందుకు: హోరాహోరీ సాగిన మరో ప్రీక్వార్టర్స్‌లో ఆరోసీడ్ సిలిచ్ 6-7 (2-7), 6-3, 7-6 (7-6), 7-6 (7-3)తో కారెనో బుస్టా (స్పెయిన్)పై నెగ్గాడు. ఈ మ్యాచ్‌లో అతను 20 ఏస్‌లతో పాటు 73 విన్నర్లు కొట్టాడు. సిలిచ్‌కు ఇది 100వ గ్రాండ్‌స్లామ్ విజయం కావడం విశేషం. నువ్వానేనా అన్నట్లు సాగిన మరో పోరాటంలో దిమిత్రోవ్ 7-6 (7-3), 7-6 (7-4), 4-6, 7-6 (7-4)తో కిర్గియోస్ (ఆస్ట్రేలియా) పోరాటానికి తెరదించాడు. కైల్ ఎడ్మండ్ (బ్రిటన్) కూడా క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. అతను 6-7 (4-7), 7-5, 6-2, 6-3తో ఆండ్రియస్ సెప్పి (ఇటలీ)పై విజయం సాధించాడు.

వోజ్నియాకి దూకుడు: డెన్మార్క్ తార, రెండో సీడ్ వోజ్నియాకి జోరు మీదుంది. ఆమె అలవోకగా క్వార్టర్‌ఫైనల్ చేరింది. ప్రీక్వార్టర్స్‌లో వోజ్నియాకి 6-3, 6-0తో రేబ్రికోవా (స్లొవేకియా)ను చిత్తు చేసింది. గంటలోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో 25 విన్నర్లు కొట్టిన ఆమె.. ఐదుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. సురెజ్ నవారో (స్పెయిన్), మెర్టిన్స్ (బెల్జియం) కూడా క్వార్టర్స్ చేరారు. నవారో 4-6, 6-4, 8-6తో కొంటావిట్ (ఇస్తోనియా)పై చెమటోడ్చి గెలవగా.. మెర్టిన్స్ 7-6 (7-5), 7-5తో మార్టిచ్ (క్రొయేషియా)ను ఓడించింది. నాలుగో సీడ్ ఎలెనా స్వితోలినా (ఉక్రెయిన్) కూడా తొలిసారి క్వార్టర్‌ఫైనల్ చేరింది. ప్రీక్వార్టర్స్‌లో ఆమె 6-3, 6-0తో అలెర్టోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేసింది.

పేస్ జోరుకు బ్రేక్: డబుల్స్‌లో లియాండర్ పేస్ పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో లియాండర్ పేస్-పూరవ్ రాజా 1-6, 2-6తో జువాన్ సెబాస్టియన్-రాబర్ట్ ఫరా (కొలంబియా) చేతిలో పరాజయం పాలయ్యారు. రెండేసిసార్లు భారత జోడీ సర్వీస్ బ్రేక్ చేసిన జువాన్ జంట సులభంగా విజయాన్ని సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న శుభారంభం చేశాడు. తొలి రౌండ్లో బోపన్న-బబోస్ (హంగేరి) 6-2, 6-4తో పెరెజ్-విటింగ్టన్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించారు.

నా పిల్లలు టెన్నిస్‌లోకి వద్దు



మెల్‌బోర్న్: క్రికెటర్ కొడుకు క్రికెటర్ అవ్వడానికే ప్రయత్నిస్తాడు. సినీ నటి పిల్లలు సినిమాల్లోకే రావాలనుకుంటారు. ఇలా తమ తల్లిదండ్రుల వారసత్వాన్ని కొనసాగించడానికే చాలామంది ప్రయత్నిస్తారు. తల్లిదండ్రులు కూడా ఆ విషయంలో సుముఖంగానే ఉంటారు. కానీ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ మాత్రం తన పిల్లలు తాను ఆడే ఆటలోకి రావాలని కోరుకోవట్లేదు. వాళ్లు వేరే కెరీర్లను ఎంచుకోవాలని అతను అభిలషిస్తున్నాడు. ఇందుకు కారణం ఏంటని అడిగితే.. "మేం ఇంకో 25 ఏళ్ల పాటు పర్యటనల్లో ఉండాలని కోరుకోవట్లేదు. అందుకే వాళ్లు టెన్నిస్‌లోకి రావాలనుకోవట్లేదు. ఐతే నేను అందరి లాగే పిల్లలకు మద్దతుగా నిలిచే తండ్రిని. వాళ్లు ఏం చేయాలన్నది నేను నిర్దేశించను. క్రీడలో.. వ్యాపారమో.. ఇంకోటో.. వాళ్లు ఎటువైపు వెళ్తారన్న దానిపై నాకు ఎలాంటి స్పష్టత లేదు. ఏం చేసినా మద్దతుగా నిలుస్తా" అని ఫెదరర్ చెప్పాడు.

రహానె వస్తాడా?



జొహానెస్‌బర్గ్

దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టుల్లో భారత మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ అజింక్య రహానె ఆడకపోయినా.. అతడి పేరు రెండు వారాలుగా చర్చల్లో నానుతూనే ఉంది. విదేశాల్లో, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో మంచి రికార్డున్నప్పటికీ అతడిని ఈ సిరీస్‌లో ఆడించకపోవడం విమర్శలకు దారి తీసింది. తొలి టెస్టులో రోహిత్ వైఫల్యం తర్వాత కూడా రెండో టెస్టుకు అతడినే కొనసాగించి, రహానెను పక్కన పెట్టింది టీమ్ మేనేజ్మెంట్. దీంతో విమర్శల దాడి మరింత తీవ్రమైంది. ఈ నేపథ్యంలో మూడో టెస్టుకు రహానెను తప్పక ఆడించాల్సిన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు కెప్టెన్ కోహ్లి. ఆదివారం టీమ్‌ఇండియా ప్రాక్టీస్ సాగిన తీరు చూస్తే రహానె.. బుధవారం ఆరంభమయ్యే మూడో టెస్టులో ఆడేట్లే అనిపిస్తోంది. రెండో టెస్టు తర్వాత మూడ్రోజులు విశ్రాంతి తీసుకున్న భారత ఆటగాళ్లు ఆదివారం సాధన ఆరంభించారు. 4 గంటల పాటు సాగిన ప్రాక్టీస్ సాగింది. ఇందులో రహానె చాలాసేపే సాధన చేశాడు. ముందుగా ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేసిన రహానె.. ఆ తర్వాత బ్యాటింగ్‌పై దృష్టిపెట్టాడు. అతను చాలాసేపు సాదన చేయడాన్ని బట్టి మూడో టెస్టుకు తుది జట్టులో ఉండే అవకాశాలు ఎక్కువే. రహానెతో పాటు కేఎల్ రాహుల్, మురళీ విజయ్, పుజారా, కోహ్లి, పాండ్య, రోహిత్ శర్మ, ధావన్.. బృందాలు బృందాలుగా బ్యాటింగ్ సాధన చేశారు. నెట్ సెషన్స్‌లో టీమ్ ఇండియాకు సాయం చేయడానికి దక్షిణాఫ్రికా చేరుకున్న యువ పేసర్లు నవదీప్ సైని, శార్దూల్ ఠాకూర్ ప్రాక్టీస్‌కు హాజరయ్యారు. బౌలర్లు అశ్విన్, భువనేశ్వర్, షమి, బుమ్రా కూడా బ్యాటింగ్ సాధన చేశారు.

బవుమా ఔట్: దక్షిణాఫ్రికా మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ బవుమా వేలికి గాయమవడంతో భారత్‌తో మూడో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయాడు. తొలి రెండు టెస్టుల్లో తుది జట్టుకు ఎంపిక కాని బవుమా.. మధ్యలో విరామం దొరకడంతో దేశవాళీ వన్డే టోర్నీలో కేప్ కోబ్రాస్‌కు ఆడాడు. ఆ సందర్భంగా అతడి వేలికి గాయమైంది. సిరీస్ ఇప్పటికే చేజిక్కిన నేపథ్యంలో ఫిట్‌గా ఉండుంటే దక్షిణాఫ్రికా బవుమాను మూడో టెస్టులో ఆడించేవాళ్లేమో. అతడి స్థానంలో ఈ మ్యాచ్‌కు వేరే ఆటగాడిని తీసుకోలేదు.

పంజాబ్ 'సూపర్' విజయం

దిల్లీ చేతిలో తమిళనాడు ఓటమి ● సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీ



కోల్‌కతా: ఉత్కంఠభరితంగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్ మ్యాచ్‌లో పంజాబ్.. సూపర్ ఓవర్లో కర్ణాటకను ఓడించింది. మొదట కర్ణాటక 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులు సాధించింది. అనిరుద్ధ జోషి (40) రాణించాడు. ఛేదనలో పంజాబ్ కూడా 9 వికెట్లకు 158 పరుగులే చేసింది. మన్‌దీప్ సింగ్ (45), హర్భజన్ సింగ్ (33), యువరాజ్ సింగ్ (29) రాణించారు. శ్రీనాథ్ అరవింద్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. సూపర్ ఓవర్లో మొదట పంజాబ్ 15 పరుగులు చేయగా.. కర్ణాటక 11 పరుగులకే పరిమితమైంది. మరో మ్యాచ్‌లో దిల్లీ 8 వికెట్ల తేడాతో తమిళనాడును చిత్తు చేసింది. మొదట తమిళనాడు 7 వికెట్లకు 145 పరుగులు చేసింది. విజయ్ శంకర్ (57 నాటౌట్), అపరాజిత్ (45) రాణించారు. అనంతరం రిషబ్ పంత్ (58; 33 బంతుల్లో 7×4, 3×6), నితీశ్ రాణా (రాణా (34 నాటౌట్; 14 బంతుల్లో 3×4, 3×6) మెరుపులతో దిల్లీ 15.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇంకో మ్యాచ్‌లో ముంబయి 13 పరుగుల తేడాతో ఝార్ఖండ్‌ను ఓడించింది.

సెమీస్‌కు చేరువైన మరాఠాస్

దిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో వీర్ మరాఠాస్ సెమీఫైనల్‌కు చేరువైంది. ఆదివారం జరిగిన పోరులో ఆ జట్టు 4-2తో దిల్లీ సుల్తాన్స్‌ను ఓడించింది. తొలి బౌట్లో సందీప్ తోమర్ 6-1తో గెలిచి దిల్లీకి శుభారంభం అందించాడు. ఆ తర్వాత బౌట్లో రీతు ఫొగాట్.. మెరొయ్ మెజెయన్‌ను ఓడించడంతో మరాఠాస్ 1-1తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత నాలుగు బౌట్లలో మూడు బౌట్లు గెలిచిన మరాఠాస్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లతో మరాఠాస్ సెమీస్‌కు చేరువైంది.

పుంజుకున్న ఆనంద్



విజ్క్ ఆన్ జీ(నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ పుంజుకున్నాడు. ఏడో రౌండ్లో వ్లాదిమిర్ క్రామ్నిక్ చేతిలో పరాజయం పాలైన విషీ.. ఎనిమిదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పోరులో అతను పీటర్ స్విడ్లర్ (రష్యా)తో పాయింట్లు పంచుకున్నాడు. దీంతో విషీ.. ఎనిమిది రౌండ్ల నుంచి 4.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్), మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), మమెద్‌యరోవ్ (ఉజ్బెకిస్థాన్) 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు.

ఫైనల్లో భారత్ ఓటమి

తౌరంగా: నాలుగు దేశాల హాకీ తొలి అంచె ఫైనల్ మ్యాచ్‌లో ఆదివారం భారత్ 1-2 గోల్స్‌తో బెల్జియం చేతిలో ఓడిపోయింది. బెల్జియం తరపున బూన్ (4వ నిమిషం), డొక్రైర్ (36వ) చెరో గోల్ కొట్టగా.. భారత్ తరపున నమోదైన ఏకైక గోల్‌ను మన్‌దీప్ సింగ్ సాధించాడు. టోర్నీ రెండో అంచె తొలి మ్యాచ్‌లో భారత జట్టు బుధవారం న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

భయం, ఒత్తిడి పోయాయి



మెల్‌బోర్న్: తన ఆట మళ్లీ గాడిన పడటానికి ధ్యానం సాయపడిందని సెర్బియా టెన్నిస్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ చెప్పాడు. గాయం నుంచి కోలుకుని ఇటీవలే పునరాగమనం చేసిన జకోవిచ్.. ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో చక్కటి ప్రదర్శన చేస్తున్నాడు. మళ్లీ ఫామ్ అందుకోవడంపై నొవాక్ స్పందిస్తూ.. "నేను ప్రతి రోజూ ధ్యానం చేస్తున్నా. దాని వల్ల ఏం సాధించానో చెప్పను. ఏం కోల్పోయానో చెబుతా. భయం పోయింది. ఒత్తిడి, ఆందోళన పోయాయి. మనం అంతిమంగా కోరుకునేది ఇదే" అన్నాడు. ప్రస్తుతం తాను ఆటగాడిగానే కాక వ్యక్తిగానూ ఎదిగే ప్రయత్నంలో ఉన్నట్లు జకోవిచ్ చెప్పాడు.

లంక విజయం

ఢాకా: శ్రీలంకకు ఉపశమనం. వరుస ఓటములను ఎదుర్కొంటున్న ఆ జట్టుకు ఎట్టకేలకు ఓ విజయం. తిసార పెరీరా (4/33, 39 నాటౌట్) ఆల్‌రౌండ్ నైపుణ్యం ప్రదర్శించడంతో ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో లంక 5 వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే.. పెరీరా, ఫెర్నాండో (3/28) ధాటికి 44 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. బ్రెండన్ టేలర్ (58) టాప్ స్కోరర్. ఛేదనలో లంక.. 117 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ స్థితిలో పెరీరా, చండిమాల్ (38 నాటౌట్) అభేద్యమైన ఆరో వికెట్‌కు 57 పరుగులు జత చేసి జట్టును గెలిపించారు. లంక 44.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

అదరగొట్టిన బట్లర్

- సిరీస్ ఇంగ్లాండ్ వశం
- మూడో వన్డేలోనూ ఆసీస్ ఓటమి



బట్లర్

సిడ్నీ: ఆస్ట్రేలియాకు టెస్టు సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్.. వన్డే సిరీస్‌లో మాత్రం చెలరేగిపోతోంది. తాజాగా మూడో వన్డేలోనూ నెగ్గి.. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ (3-0)ను చేజిక్కించుకుంది. బట్లర్ (100; 83 బంతుల్లో 6×4, 4×6) చెలరేగడంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 16 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. బట్లర్‌తో పాటు వోక్స్ (53), మోర్గాన్ (41), బెయిర్‌స్టో (39) రాణించడంతో మొదట ఇంగ్లాండ్ 6 వికెట్లకు 302 పరుగులు చేసింది. ఛేదనలో ఆసీస్ తడబడింది. 6 వికెట్లకు 286 పరుగులే చేసింది. ఫించ్ (62), స్టాయినిస్ (56), మిచెల్ మార్ష్ (55) రాణించారు. వోక్స్, రషీద్, మార్క్ వుడ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. నాలుగో వన్డే శుక్రవారం అడిలైడ్‌లో జరుగుతుంది.

అమ్మా.. నాన్నా.. వస్తున్నా మీ కోసం!



అనీస్ దాస్

దిల్లీ

'అమృత' సినిమాలో చిన్నమ్మాయి తనకు జన్మనిచ్చిన తల్లి కోసం పట్టుబట్టి మరీ శ్రీలంక బయల్దేరుతుంది. ఆ అమ్మాయికి పెంపుడు తల్లిదండ్రులూ అండగా నిలుస్తారు. అతి కష్టం మీద చివరికి తన తల్లిని కలుస్తుందా చిన్నారి. నెదర్లాండ్స్ స్కేటింగ్ క్రీడాకారిణి అనీస్ దాస్ కూడా ఇప్పుడు ఇదే లక్ష్యంతో భారత్‌లో అడుగు పెట్టబోతోంది. 32 ఏళ్ల అనీస్ దాస్ పుట్టింది ముంబయిలోనే. అనీస్‌తో పాటు ఆమె కవల సోదరికి ముంబయికి చెందిన దంపతులే జన్మనిచ్చారు. ఐతే అనీస్, ఆమె సోదరికి 8 నెలల వయసుండగా నెదర్లాండ్స్‌కు చెందిన భార్యాభర్తలు దత్తత తీసుకున్నారు. అనీస్‌కు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో వీరికి సంబంధాలు తెగిపోయాయి. అనీస్‌కు, ఆమె సోదరికి కొంచెం ఊహ తెలిశాక, ఐదారేళ్ల వయసులో వారి దత్తత గురించి చెప్పారు. పెద్దయ్యాక ఈ విషయంపై స్పష్టత వచ్చింది. ఐతే క్రీడాకారులైన వీళ్లిద్దరూ కెరీర్లపై దృష్టిపెట్టారు. ఐతే పెరిగి పెద్దయ్యే కొద్దీ తమ తల్లిదండ్రులెవరో తెలుసుకోవాలన్న పట్టుదల కలిగింది వీరికి. ఇప్పటికే డచ్ టీవీ ప్రోగ్రాం ద్వారా సందేశం పంపడం ద్వారా తల్లిదండ్రుల గురించి తెలుసుకునే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకపోయింది. ఐతే ఇప్పుడు అనీస్ నేరుగా భారత్‌కే రావాలని నిర్ణయించుకుంది. ఇటీవలే స్కేటింగ్‌లో చక్కటి ప్రదర్శనతో వింటర్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది అనీస్. కొన్నాళ్ల పాటు తన కెరీర్‌ను కూడా పక్కన పెట్టి ఆమె త్వరలోనే ముంబయికి వచ్చి తమ తల్లిదండ్రుల కోసం వెతకాలని భావిస్తోంది. "నేనింత వరకు భారత్‌కు రాలేదు. కానీ ఈ దేశంతో నాకు బలమైన బంధం ఉంది. మా మూలాలు ఇక్కడే ఉన్నాయి. ముంబయిలో మాకో కుటుంబం ఉంది. ఒలింపిక్ సీజన్ ముగియగానే ఇక్కడికి వస్తాం. మాకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కోసం వెతుకుతాం. మమ్మల్ని పెంచి పెద్ద చేసిన వాళ్లు ఈ విషయంలో మాకెంతో అండగా నిలుస్తున్నారు. వారిని మేం పెంపుడు తల్లిదండ్రులుగా చూడట్లేదు" అని అనీస్ తెలిపింది.

తక్షణ సాయానికి తరుణోపాయం

ఈనాడు – హైదరాబాద్

తెలంగాణలోని పారిశ్రామిక సమూహాల్లో తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) పరిశ్రమల స్థాపన కోసం బ్యాంకుల ద్వారా సామూహిక రుణసాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం కింద ఒక్కో పరిశ్రమకు రూ.5 లక్షల వరకు రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పిస్తారు. రుణంలో 20 శాతాన్ని ప్రభుత్వం తన వాటాగా పెట్టుబడి పెడుతుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలోనే ఖరారు చేయనుంది. సూక్ష్మ పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రుణ సమీకరణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని దూరం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. దీని ప్రకారం ప్రభుత్వం పారిశ్రామిక సమూహాలను గుర్తిస్తుంది. వాటిల్లో ఇప్పటికే ఉన్న, కొత్తగా స్థాపించే పరిశ్రమలకు బ్యాంకుల ద్వారా రుణసాయం ఇప్పించే బాధ్యతను తీసుకుంటుంది. ఒక సమూహంలోని పరిశ్రమలకు రుణాలు మంజూరు చేసే బాధ్యతను ఒకే బ్యాంకు తీసుకునేలా ఒప్పిస్తుంది. ఆ మేరకు బ్యాంకులు ముందుకు వస్తే.. ఇచ్చే రుణంలో 20 శాతాన్ని పెట్టుబడిగా పెట్టి ఆ మొత్తాన్ని పారిశ్రామికవేత్తలకు అందజేస్తుంది.

వీటికి వర్తింపు

ఆహారశుద్ధి, తోలు, జౌళి ఉత్పత్తులు, కంప్యూటర్ ఆధారిత రూపకల్పనలు, తయారీలు(క్యాడ్,క్యామ్), లేత్ మిషన్లు, చేతివృత్తులు, చేనేత, హస్తకళల వారికి ఇందులో అవకాశం కల్పిస్తారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న సమూహాలతోపాటు.. కొత్తగా ఏర్పాటయ్యే వాటినీ ఈ పథకం కింద పరిగణనలోనికి తీసుకుంటారు. తెలంగాణ ప్రభుత్వం త్వరలో సిరిసిల్లలో మరమగ్గాలు, రంగారెడ్డి జిల్లాల్లో ఫైబర్ గ్లాస్, ఖమ్మం జిల్లాలో ఆహార శుద్ధి, యాదాద్రి జిల్లాలో తోలు ఉత్పత్తుల సమూహాలను(క్లస్టర్) ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఈ పథకం అక్కడ పరిశ్రమలు స్థాపించే వారికి ప్రోత్సాహకంగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

త్వరలో మార్గదర్శకాలు

ఈ పథకంపై మంత్రి కేటీఆర్ ఇప్పటికే బ్యాంకు అధికారులతో చర్చించారు. 20 శాతాన్ని ప్రభుత్వమే పెట్టుబడిగా పెడుతున్నట్టు చెప్పడంతో వారిలో సానుకూలత వ్యక్తమయింది. ఈ మేరకు విధివిధానాలను రూపొందించాల్సిందిగా పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌ను మంత్రి ఆదేశించారు. దీనికి అనుగుణంగా పరిశ్రమల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంత్రి విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత దీనికి తుది రూపు వస్తుందని అధికారులు తెలిపారు.



గాలిబుడగలు ఎగురవేసి లాంఛనంగా మానవహారాన్ని ప్రారంభిస్తున్న నీతీష్‌కుమార్

13 వేల కి.మీ. మానవహారం

- పాల్గొన్న 4 కోట్ల మంది బిహార్ ప్రజలు
- వరకట్నం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం

పట్నా: వరకట్నం, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా బిహార్ రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం 13 వేల కిమీ పొడవైన మానవహారం ఏర్పాటైంది. నాలుగు కోట్ల మంది పాల్గొన్న ఈ మానవహారం 13,660 కిమీ పొడవైనదని భావిస్తున్నట్లు విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.మహాజన్ పేర్కొన్నారు. మద్యపానం విడనాడాలని గత ఏడాది చేపట్టిన ప్రచార కార్యక్రమంలో 11,292 కిమీ పొడవైన మానవహారం ఏర్పాటైంది. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్‌కుమార్ పట్నా నుంచి బెలూన్లు గాల్లోకి ఎగురవేసి తాజాగా ప్రారంభించిన కార్యక్రమానికి కాంగ్రెస్, ఆర్జేడీ నుంచి మద్దతు లభించలేదు. గత ఏడాది జరిగిన కార్యక్రమంలో రెండు పార్టీలు పాల్గొన్నాయి. విపరీతంగా కురుస్తున్న మంచు కారణంగా కొన్నిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మూసివేశారని, బాలబాలికలను ఇబ్బంది పెట్టే ఈ ప్రచారంలో మేం పాల్గొనలేమని ఆర్జేడీ స్పష్టం చేసింది. నీతీష్ డ్రామా ఆడుతున్నారని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మద్యపానం చేస్తున్నవారి సంఖ్య ఏమాత్రం తగ్గలేదని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది.

మోదీకి అహంభావం అధికం: అన్నాహజారే

ముంబయి: ప్రధాని నరేంద్రమోదీకి ప్రధానమంత్రినన్న అహంభావం ఉందని అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నాహజారే ఆరోపించారు. అందుకనే ఆయన తన లేఖలకు ఏ మాత్రం స్పందించడం లేదని అన్నారు. సంగ్లీజిల్లాలోని అట్పాడి తెహసీల్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో అన్నాహజారే శనివారం ప్రసంగించారు. తాను గత మూడేళ్లలో ప్రధానమంత్రికి 30కి పైగా లేఖలు రాసినట్లు అన్నాహజారే చెప్పారు. ఆయనసలు వాటికి స్పందించనేలేదన్నారు. మార్చి 23 నుంచీ దిల్లీలో మరో విడత ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు అన్నాహజారే ఇదివరకే ప్రకటించడం తెలిసిందే.

25 నుంచీ పాక్‌లో ఐరాస భద్రతా మండలి బృందం పర్యటన!

ఇస్లామాబాద్: ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి బృందం గురువారం పాక్ పర్యటనకు వస్తోంది. 25, 26 తేదీల్లో ....రెండు రోజుల పాటు ఈ పర్యవేక్షణ బృందం ఇక్కడ పర్యటిస్తుందని పాక్ సీనియర్ అధికారి ఒకరిని ఉటంకిస్తూ 'డాన్' వెల్లడించింది.

భవిష్యత్తులో మగాడే ఉండడా?!

- క్షీణించిపోతున్న 'వై' క్రోమోజోమ్
- డెన్మార్క్‌లో శాస్త్రవేత్తల పరిశోధన

డెన్మార్క్: పిండం పురుషుడిగా మారాలా లేక స్త్రీగా మారాలా? అని నిర్ణయించే అతి ముఖ్యమైన జన్యువు 'ఎస్.ఆర్.వై'లో వస్తున్న మార్పుల కారణంగా 'వై' క్రోమోజోమ్ క్రమేపీ అంతరించిపోనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. స్త్రీలలో రెండు 'ఎక్స్', పురుషులలో 'ఒక ఎక్స్, ఒక వై' క్రోమోజోమ్ ఉంటాయనే సంగతి తెలిసిందే. మహిళల్లో వై-క్రోమోజోమ్ ఉండదు కాబట్టి వారిపై ఎలాంటి ప్రభావం కనిపించడం లేదు. పురుషుల్లో కనిపిస్తున్న ప్రస్తుత క్షీణత ప్రభావం ఇలాగే కొనసాగితే 46 లక్షల సంవత్సరాల తరువాత అసలు 'వై' క్రోమోజోము పూర్తిగా అంతరించిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 16.6 కోట్ల ఏళ్లక్రితం ఎక్స్-క్రోమోజోము వలే వై-క్రోమోజోములోనూ సమాన జన్యువులు ఉండేవి. 62 మంది పురుషులపై డెన్మార్క్ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధన వివరాలు 'పీఎల్ఓఎస్ జెనెటిక్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఆక్స్‌ఫర్డ్‌లో పరీక్ష కాలవ్యవధి పొడిగింపు

- విద్యార్థినుల గ్రేడ్లపై సానుకూల ప్రభావం!

లండన్: ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో గణితం, కంప్యూటర్ సైన్స్‌లలో పరీక్ష కాలవ్యవధిని పొడిగించడం విద్యార్థినుల గ్రేడ్లపై సానుకూల ప్రభావాన్ని చూపింది. గణితం, కంప్యూటర్ సైన్స్ కోర్సుల చివరి సంవత్సరం పరీక్షల కాలవ్యవధిని 90 నుంచి 105 నిముషాలకు గతేడాది పొడిగించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. అయితే, అటు ప్రశ్నల విషయంలో మాత్రం ఎలాంటి సులువులు, వెసులుబాట్లను ప్రకటించలేదు. కేవలం వ్యవధిని పొడిగించడం వల్ల చక్కని ఫలితాలను సాధించిన ఆడపిల్లల సంఖ్య పెరిగినట్లు 'సండే టైమ్స్' తెలిపింది. ప్రపంచప్రఖ్యాతి గాంచిన ఈ విశ్వవిద్యాలయంలో మిగిలిన సబ్జెక్టుల కంటే గణితం గ్రేడ్ల విషయంలో మహిళల సంఖ్య అంతంతమాత్రం. గణితంలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణులైన మహిళల సంఖ్య 21.2శాతంగా ఉంటే...పురుషులు 45.5 శాతంగా ఉన్న విషయం గమనార్హం.

కుమార్తెపై కన్నతండ్రి అత్యాచారం

ఒడిశాలో ఘటన



లక్ష్మీధర్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్తున్న పోలీసు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కన్న కుమార్తెపై కొంతకాలంగా అత్యాచారానికి పాల్పడుతున్న ఘటన ఒడిశాలోని మధుసూదన్‌పూర్‌లో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన లక్ష్మీధర్ జెనాకు ఐదుగురు కుమార్తెలు. భార్య చనిపోయాక మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఆ మహిళ లక్ష్మీధర్‌ను విడిచి వెళ్లిపోయింది. ఇద్దరు అక్కలకు వివాహాలు అయ్యాక మిగిలిన ఇద్దరు అక్కలు నాన్న లైంగిక వేధింపులకు తట్టుకోలేక ఇల్లు విడిచి వెళ్లిపోయారని బాధిత బాలిక(19) తెలిపింది. తాను మాత్రమే నాన్నతో కలిసి ఉంటున్నానని, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తీవ్రంగా కొట్టి అత్యాచారానికి పాల్పడుతుండేవాడని వివరించింది. తన సమస్య ఎవరికీ చెప్పుకోలేక కుంగిపోయేదానని చెప్పింది. రెండు రోజుల కిందట తీవ్రంగా దాడి చేశాడని, భరించలేక గ్రామంలో ఉంటున్న ఓ మహిళకు తెలిపానంది. ఆమె స్పందించి మహిళా సమితి సహాయంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారని వివరించింది. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి జెనాను పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలిని అనాథ ఆశ్రమానికి తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

భారతీయ ఆయుర్వేద నిపుణుడికి చైనా విద్యార్థుల నివాళి

జింగ్: భారతీయ ఆయుర్వేద నిపుణుడు, విద్యావేత్త దీపక్ దుధ్మండేకు చైనాలోని విద్యార్థులు నివాళులు అర్పించారు. జనవరి 9న దీపక్ గుండెపోటుతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో బీజింగ్, గాంగ్జావ్ నగరాల్లో దీపక్ స్మారక సమావేశాలు ఆదివారం జరిగాయి. పురాతన భారతీయ చికిత్స విధానాల్లోని సప్తచక్ర వ్యవస్థ.. ధ్వని, పుష్ప పరిమళాల చికిత్సల గురించి గత పదేళ్లుగా చైనాలోని సదస్సులు, విశ్వవిద్యాలయాల్లో ప్రసంగాలు చేస్తూ దీపక్ బాగా ప్రాచుర్యం పొందారు. బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయంలోనూ ఆయన పలుమార్లు ప్రసంగించారు.

కాస్మిక్ కిరణాల శోధనకు స్మార్ట్‌ఫోన్లు

★ రష్యా శాస్త్రవేత్తల వినూత్న పరిశోధన




మాస్కో: విశ్వంలో అంతుచిక్కని, అత్యంత శక్తిమంతమైన కాస్మిక్ కిరణాలను స్మార్ట్ ఫోన్లు విశ్లేషించేలా శాస్త్రవేత్తలు ఒక ఆల్గోరిథమ్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఈ కిరణాల తీరుతెన్నులపై కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయి. నక్షత్రాల్లో ఇంధనం ఖాళీ అయ్యాక అవి భారీ విస్ఫోటంతో పేలిపోతాయి. ఈ పరిణామాన్ని సూపర్‌నోవాగా పేర్కొంటారు. వీటి నుంచి, కృష్ణబిలాల నుంచి కాస్మిక్ కిరణాలు వెలువడుతుంటాయి. ఇవి భూ వాతావరణంలోకి ప్రవేశిస్తుంటాయి. వీటిలో 'అల్ట్రా హై ఎనర్జీ కాస్మిక్ కిరణాలు' (యూహెచ్ఈసీఆర్) కూడా ఉన్నాయి. వీటి లక్షణాలు అంతుపట్టకుండా ఉన్నాయి. ఇవి.. భూవాతావరణంలో వాయు రేణువులను తాకగానే అనేక రకాల ద్వితీయ శ్రేణి రేణువులను, తక్కువ స్థాయి శక్తిని వెలువరిస్తాయి. వీటిని 'విస్తృత వాతావరణ జల్లులు'గా (ఈఏఎస్) పేర్కొంటారు.

వీటిని గుర్తించేందుకు ఒక చదరపు కిలోమీటరు మేర విస్తీర్ణం కలిగిన ఒక డిటెక్టర్‌ను ఏర్పాటు చేస్తే వందేళ్లలో ఒక పరిణామాన్ని మాత్రమే కనుగొనడం సాధ్యమని శాస్త్రవేత్తలు గుర్తించారు. పూరిస్థాయిలో అధ్యయనం కోసం ఏకంగా ఒక చిన్న దేశమంత డిటెక్టర్ అవసరమని తేల్చారు. ఈ నేపథ్యంలో రష్యా శాస్త్రవేత్తలు ఒక వినూత్న ప్రతిపాదన చేశారు. విస్తృత మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ సాయంతో యూహెచ్ఈసీఆర్‌ను గుర్తించొచ్చని వారు పేర్కొన్నారు. ఈ వాతావరణ జల్లుల్లో ఉండే మ్యువాన్లను మొబైల్ ఫోన్లు రికార్డు చేసేలా ఒక న్యూరల్ నెట్‌వర్క్స్‌ను నిర్మించేలా ఆల్గోరిథమ్‌ను అభివృద్ధి చేశారు. ఫలితంగా పార్టికల్ డిటెక్టర్లలో ఉండే పరిజ్ఞానమే ఈ మొబైల్ కెమెరాల్లోకి వచ్చినట్లవుతుంది. అందువల్ల అవి ఈఏఎస్‌ను గుర్తించడానికి వీలవుతుంది.

కృత్రిమ వైరస్‌తో మశూచి సంబంధ వ్యాధులకు శక్తిమంతమైన టీకా!!

★ సింథటిక్ హార్స్‌పాక్స్ వైరస్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు



టొరాంటో: కెనెడాకు చెందిన శాస్త్రవేత్తలు ఇటీవల ఆవిష్కరించిన ఓ కృత్రిమ వైరస్(సింథటిక్ హార్స్‌పాక్స్ వైరస్) తట్టు, పొంగు, దద్దు వంటి మశూచి సంబంధ వ్యాధులకు మరింత శక్తిమంతమైన టీకాను కనుగొనేందుకు ఉపకరించే అవకాశం ఉంది. ఓ కృత్రిమ డీఎన్ఏను ప్రజారోగ్య సాధన దిశగా ఎలా ఉపయోగించుకోవచ్చనే దానికి ఈ కృత్రిమ వైరస్ ఓ ఉదాహరణ కావచ్చు. ఇప్పటికే వెలుగులోకి తెచ్చి ఉన్న జన్యుక్రమాన్నీ.....సంపూర్ణంగా రసాయనిక ప్రక్రియల ద్వారా తయారుచేసిన డీఎన్ఏ భాగాలను ఉపయోగించి పూర్తిగా కృత్రిమంగా ఈ వైరస్‌ను తయారు చేశారు. మశూచి సంబంధ ఇన్‌ఫెక్షన్ ఉన్న ఎలుకలపై ఈ కృత్రిమ వైరస్‌ను ప్రయోగించి పరీక్షించారు. ఫలితం అత్యంత ఆశాజనకంగా ఉన్నట్లు అల్‌బెర్టా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డేవిడ్ ఇవాన్స్ తెలిపారు.

వలస పక్షులకు కృత్రిమ వెలుగుల ఉచ్చు!

వాషింగ్టన్: పట్టణాల్లోని కృత్రిమ వెలుగులు వలస పక్షుల పాలిట యమపాశాలుగా మారుతున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలో చాలావరకూ పక్షులు వేరే ప్రాంతాలకు వలస వెళ్తుంటాయి. వీటి ప్రయాణాలను 16 ప్రత్యేక రాడార్లతో ఏడేళ్లపాటు అమెరికాలోని డెలావేర్ వర్సిటీ నిపుణులు పరిశీలించారు. ఎందుకు కొన్ని ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా గుమిగూడి ఉంటున్నాయనే అంశంపై దృష్టిసారించారు. 'చాలావరకు పక్షులు సూర్యాస్తమయం తర్వాతే వలస ప్రయాణం మొదలుపెడతాయి. దీంతో పట్టణాల్లోని కృత్రిమ కాంతుల ఆకర్షణకు గురవుతున్నాయి. బోస్టన్, న్యూయార్క్, ఫిలడెల్ఫియా, బాల్టిమోర్, వాషింగ్టన్ డీసీ లాంటి వెలుగులు విరజిమ్మే నగరాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇక్కడ వీటిని సంరక్షించడం కష్టంగా మారుతోంది. ముఖ్యంగా వనరులు తక్కువగా, ప్రాణహాని ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇవి నివసిస్తున్నాయి. భవనాలు, వాహనాలను గుద్దేయడం, ఇతర జంతువులకు ఆహారంగా మారడం లాంటి ముప్పులూ వీటిని వెంటాడుతున్నాయి'అని పరిశోధకులు జెఫ్ బ్లర్ తెలిపారు.

యాసంగి వరిపై ఆశలు ఆవిరి..!

- 41 శాతం విస్తీర్ణంలోనే నాట్లు
- దేశవ్యాప్తంగా పెరిగినా.. తెలంగాణలో తగ్గుదల
- రాష్ట్రంలో ఆహారధాన్యాల పంటలన్నీ నిరాశాజనకం
- ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులతోనే: జయశంకర్ వర్సిటీ

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత యాసంగి(రబీ) సీజన్‌లో రాష్ట్రంలో ఆహార ధాన్యాల పంటల సాగు నిరాశాజనకంగా ఉంది. వ్యవసాయశాఖ, రాష్ట్ర ప్రభుత్వం తొలుత వేసిన అంచనాలు నెరవేరే సూచనలేమీ కానరావడం లేదు. డిసెంబరు చివరికల్లా వరి నాట్లు పూర్తిచేస్తేనే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పలుమార్లు హెచ్చరించినా.. ఇప్పటికీ సాధారణం 6.14 లక్షల హెక్టార్లకు గాను 41 శాతం విస్తీర్ణంలోనే వరి సాగైంది.. గత అక్టోబరులో విరివిగా వర్షాలు కురవడంతో నీటివనురులన్నీ నిండాయని, యాసంగి పంటల సాగు ఊపందుకుంటుందని ప్రభుత్వం తొలుత అంచనా వేసింది. కానీ పంటకాలం మొదలై 4 నెలలు పూర్తికావస్తున్నా పంటల్లో ఏ ఒక్కటీ వంద శాతం విస్తీర్ణంలో సాగుకాలేదని వ్యవసాయశాఖ శుక్రవారం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, సెనగ, జొన్న పంటలు ఈ సీజన్‌లో సాగుకావాలి. వీటిలో సెనగ 98, జొన్న 53, మొక్కజొన్న 62 శాతం చొప్పున విస్తీర్ణంలో వేశారు. దేశవ్యాప్తంగా వరి నాట్లు పలు రాష్ట్రాల్లో ఆశాజనకంగా ఉన్నాయని, గతేడాదికన్నా ఈసారి ఈ నెల 19 నాటికి 39 శాతం అధిక విస్తీర్ణంలో వరి సాగయినట్లు కేంద్ర వ్యవసాయశాఖ తాజా నివేదిలో వెల్లడించింది. తమిళనాడులో ఈశాన్య రుతుపవనాలతో కురిసిన వర్షాల వల్ల వరి సాగు గణనీయంగా పెరిగింది. తెలంగాణ, పశ్చిమ్ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లో సాగు తగ్గింది.

ఎందుకిలా?

రాష్ట్రంలో ఈసారి గత జూన్ నుంచి ఈ నెల 18 వరకూ కేవలం 9 జిల్లాల్లోనే సాధారణం (100 శాతం) లేదా అంతకన్నా ఎక్కువ వర్షాలు కురిశాయి. మిగిలిన 22 జిల్లాల్లో 1 నుంచి 37 శాతం దాకా లోటు వర్షపాతం నమోదయింది.. 8 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఉన్నట్లు వాతావరణ శాఖ చెపుతోంది. మండలాలవారీగా చూస్తే 176 చోట్ల కరవు ఛాయలున్నాయి. ఈ ప్రాంతాల నీటి వనరుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు బాగా తగ్గడంతో వ్యవసాయ బోర్ల కింద నాట్లు వేయడానికి రైతులు జంకుతున్నారు. 2016 డిసెంబరుతో పోలిస్తే 2017 డిసెంబరు నాటికి 54 మండలాల్లో భూగర్భ జలమట్టాలు బాగా తగ్గినట్టు భూగర్భ జలశాఖ వివరించింది. వీటిలో 30 మండలాల్లో నీటిమట్టం 20 మీటర్లకన్నా దిగువకు పడిపోయింది.

ఇక నాట్లు వేసినా ఫలితం లేదు

తెలంగాణలో వాతావరణ పరిస్థితుల ప్రకారం డిసెంబరు ఆఖరుకల్లా వరినాట్లు పూర్తిచేయాలి. జనవరి 20 తరవాత నాట్లు వేసినా దిగుబడి రాదు. నాట్లు వేసిన తరవాత కనీసం 60 రోజులకే వరిధాన్యం గింజ ఏర్పడటం మొదలవుతుంది. అప్పుడు పగటి ఉష్ణోగ్రత 32 డిగ్రీలకు మించితే గింజ సరిగా ఏర్పడక తాలు అధికమమై దిగుబడి పడిపోతుంది. ఇప్పుడు నాటు వేస్తే మార్చి 20 తరవాత 40 డిగ్రీల ఉష్ణోగ్రతలుంటే ధాన్యం గింజ సరిగా రాదు. వరి నాట్లు ఒక్కోరోజు ఆలస్యమయ్యేకొద్దీ 50 కిలోల దాకా ధాన్యం దిగుబడి తగ్గుతుందని పరిశోధనల్లో గుర్తించాం. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల వల్ల వరి నారు సరిగా ఎదగలేదు. పైరుకు కాండం తొలుచే పురుగు అధికంగా వ్యాపిస్తున్నట్లు గుర్తించాం.

- జగదీశ్వర్, వరి ప్రధాన శాస్త్రవేత్త, వరి పరిశోధన కేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయం

అనుమతి లేకుండా ఆడవారిని తాకడం తగదు

- మైనర్ బాలికను తాకిన వ్యక్తికి మూడేళ్ల కారాగార శిక్ష
- దిల్లీ అదనపు సెషన్స్ న్యాయమూర్తి తీర్పు

దిల్లీ: అనుమతి లేకుండా ఆడవారిని ఏ ఒక్కరూ తాకడం తగదని దిల్లీ అదనపు సెషన్స్ న్యాయమూర్తి సీమా మైని పేర్కొన్నారు. పోకిరీలు, లైంగిక విపరీత బుద్ధులు ఉన్నవారి వల్ల అన్ని వయస్కుల మహిళలు ఇప్పటికీ బాధితులు అవుతుండడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 2014లో యూపీకి చెందిన ఛావిరామ్ అనే వ్యక్తి రద్దీగా ఉన్న ఉత్తర దిల్లీలో మార్కెట్లో తొమ్మిదేళ్ల బాలికను అభ్యంతరకరంగా తాకినందుకు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించాలనీ, రూ.10వేల జరిమానా చెల్లించాలని ఆమె తీర్పుచెబుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అసలు నిందితుడు పారిపోయాడనీ, బాలిక పొరపాటుపడి తనను వేలెత్తి చూపిందనీ నిందితుడు చేసిన వాదనను న్యాయస్థానం అంగీకరించలేదు. బాలికకు రూ.50 వేలు చెల్లించాల్సిందిగా దిల్లీ రాష్ట్ర న్యాయసేవల సంస్థను న్యాయమూర్తి ఆదేశించారు. 'ఆడవారి దేహం ఆమె సొంతం. దానిపై పూర్తి హక్కులు వారికే ఉంటాయి. ఆమె అనుమతి లేకుండా మరెవరూ ఆ దేహాన్ని తాకకూడదు... అది ఏ అవసరమైనప్పటికీ...' అని స్పష్టంచేశారు. ఆడవారి వ్యక్తిగత హక్కును కాలరాస్తూ వారిపై దాడికి పాల్పడడం ద్వారా లైంగిక సంతృప్తి పొందాలనుకోవడాన్ని తప్పుపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో, ముఖ్యంగా రద్దీ మార్కెట్లు, బస్సులు, మెట్రో రైళ్లు, సినిమాహాళ్లలో మహిళలు వేధింపులకు గురవుతుండడంపై విచారం వ్యక్తంచేశారు.

యువకునిపై లైంగిక దాడి కేసులో శిక్ష కొట్టివేతకు నిరాకరణ

20 ఏళ్ల యువకునిపై లైంగికదాడి చేసిన వ్యక్తికి మెజిస్ట్రీరియల్ న్యాయస్థానం విధించిన మూడేళ్ల కఠిన కారాగార శిక్షను కొట్టివేసేందుకు దిల్లీ అదనపు సెషన్స్ న్యాయమూర్తి సురేశ్‌కుమార్ గుప్తా నిరాకరించారు. ఇలాంటి విషయాల్లో కనికరం చూపిస్తే బాధితుని మనసుపై జీవితాంతం చెరగని ముద్ర పడిపోతుందని చెప్పారు. కుటుంబానికి తానే జీవనాధారమని చెప్పినంతమాత్రాన శిక్షను కొట్టివేయలేమన్నారు.

25న నల్లబ్యాడ్జిలతో విధులకు..

- నీట్‌లో ఇన్‌సర్వీస్ కోటా సాధనకు ఆందోళన బాట
- దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వ వైద్యుల నిర్ణయం

ఈనాడు, అమరావతి: పీజీ వైద్య విద్య సీట్ల భర్తీలో ఇన్ సర్వీస్ కోటాను పునరుద్ధరించాలని దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. తమ విజ్ఞప్తిపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పందన రానందున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించింది. విజయవాడలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వ వైద్యుల సంఘం సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. "ఈ నెల 25న నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతాం. అప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన రాకపోతే 31న ఓపీ విధులను బహిష్కరించేందుకూ వెనుకాడబోం" అని సంఘం ఏపీ అధ్యక్షుడు డా.జయధీర్, తెలంగాణ నేత లాలూప్రసాద్ రాథోడ్, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు తెలిపారు. "ఇన్ సర్వీస్ కోటా తీసేస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసేందుకు ఎంబీబీఎస్ వైద్యులెవరూ ముందుకు రారు. నీట్ (పీజీ వైద్య విద్య ప్రవేశ పరీక్ష)లో సాధారణ విద్యార్థులతో నిత్యం విధుల్లో ఉండే వైద్యులు పోటీ పడలేరు. గతంలో ఉన్న 30 శాతం కోటాను కొనసాగించాలి. నీట్‌లో అర్హత సాధించిన తర్వాత 30 మార్కులు కలుపుతామని కేంద్రం ప్రకటించింది. ర్యాంకులు ప్రకటించే ముందే 30 మార్కులు కలపాలి. నీట్ రాసే ముందు రోజూ జన్మభూమి విధులకు హాజరు కావాల్సిన పరిస్థితి వచ్చింది. సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇతర రాష్ట్రాల్లోనూ వైద్యులు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో తలమునకలై ఉన్నారు. ఈ పరిస్థితుల్లో నీట్‌లో అర్హత సాధించిన వారికి 30 మార్కులు అదనంగా కలుపుతామని చెప్పడం వల్ల ఉపయోగం ఉండదు" అని డా.జయధీర్ పేర్కొన్నారు.

మార్చి 4న పీహెచ్‌డీలో ప్రవేశానికి పరీక్ష!

దిల్లీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో పీహెచ్‌డీ, ఎంఫిల్ (రెగ్యులర్) కోర్సుల్లో చేరేందుకు మార్చి నాలుగోతేదీన జాతీయస్థాయి ప్రవేశపరీక్ష జరుగుతుంది దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. 'ఇగ్నో' పరిశోధనావిభాగం సంచాలకులు ప్రొఫెసర్. కౌస్తువ బారిక్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అభ్యర్థులు సంబంధిత దరఖాస్తు ఫారాలను సమర్పించడానికి ఫిబ్రవరి 16ను తుది గడువుగా నిర్ణయించారు. ఈనెల 23వ తేదీ నుంచీ సంబంధిత కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి వస్తుంది. ఎకనామిక్స్‌లో ఎంఫిల్ కోసం దరఖాసు తచేసుకునే వారు ప్రవేశపరీక్ష రాయాల్సిన అవసరం లేదు. నిర్దేశిత అర్హతలు ఉంటే సరిపోతుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

TG